ప్రభాతనవ

SINGIDI
తెలుగు దినపత్రిక

# సింగిడి

ప్రతి రంగూ ఓ నిజం site.singidinews.com

ఆదివారం 9 ఆగస్టు 2026 సంపుటి: 1 సంచిక: 53 పేజీలు 12 వెల: 6.50

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

## సిఎన్‌జికి ప్రత్యామ్నాయంగా బయోగ్యాస్

దేశీయంగా ఉత్పత్తి పెంచాలన్న లక్ష్యంలో కేంద్రం

ఇంధన అవసరాలు తీర్చుకునేలా ప్రణాళికలు




2



## సుదీర్ఘ యుద్ధంతో తీవ్ర నష్టం

2

ఇరాన్ యుద్ధం నుంచి బయటపడడమే మేలు

ట్రంప్‌నకు జనరల్ డాన్ కేన్ సహా ఇచ్చినట్లు ప్రచారం

# పాత నినాదం.. కొత్త రాజకీయం

## తెలంగాణ రాజకీయాల్లో మళ్లీ అదే సెంటిమెంట్ అస్త్రం

పాత గాయం రేపితే మళ్లీ రక్తం కారినట్టుగా.. తెలంగాణ మలిదశ ఉద్యమానికి ఊపిరిగా నిలిచిన నీళ్లు.. నిధులు.. నియామకాలు నినాదం.. ఇప్పుడు మరోసారి రాష్ట్ర రాజకీయాలను వేడెక్కిస్తోంది. గోదావరి జలాల వాటాపై వివాదం.. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై రగడ.. ఉద్యోగ నియామకాలు, నిరుద్యోగుల ఆందోళనలు.. మూడు అంశాలు మళ్లీ రాజకీయ తెరపైకి వచ్చాయి. నాడు తెలంగాణ సాధన కోసం ఉద్యమాన్ని నడిపిన ఈ సెంటిమెంట్.. నేడు ఎన్నికల రాజకీయాల్లో ఆధిపత్యం కోసం పార్టీల చేతిలో మరోసారి పదునైన రాజకీయ అస్త్రంగా మారింది.

- (హైదరాబాద్ బ్యూరో-సింగిడి)



మూడు పార్టీల మధ్య ముదురుతున్న రాజకీయ యుద్ధం

నీటి వాటాలపై కాంగ్రెస్–బీఆర్ఎస్ మాటల యుద్ధం

నిధులు, బకాయిలపై బీజేపీ సరికొత్త అస్త్రం

ఉద్యోగాల అంశంతో యువతను ఆకట్టుకునే ఎత్తుగడ

### మళ్లీ రగులుతున్న జల వివాదం

కృష్ణా, గోదావరి జలాల వాటా విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం తీవ్రతరమవుతోంది. తెలంగాణకు రావాల్సిన గోదావరి నీటి వాటా, ప్రాజెక్టుల అనుమతులు, జీఆర్ఎంబీ అజెండా అంశాలను బీఆర్ఎస్ నేతలు ప్రధాన రాజకీయ అస్త్రంగా మలుచుకుంటున్నారు. తెలంగాణ ప్రయోజనాలను సీఎం రేవంత్ రెడ్డి ఆంధ్రప్రదేశ్‌కు తాకట్టు పెడుతున్నారంటూ బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. అయితే కాంగ్రెస్ మాత్రం ఈ ఆరోపణలను ఖండిస్తోంది. ఏపీ గతంలో చేసిన డిమాండ్లనే జీఆర్ఎంబీ అజెండాలో చేర్చిందని.. తెలంగాణ ప్రయోజనాల విషయంలో తమ ప్రభుత్వం రాజీ పడదని స్పష్టం చేస్తోంది. దీంతో నీటి అంశం కేవలం సాగునీటి వివాదంగా కాకుండా.. తెలంగాణ హక్కులు, రాష్ట్ర ప్రయోజనాల రాజకీయంగా మారుతోంది.

### నిధులు.. రాజకీయ రగడ

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కూడా మూడు పార్టీల మధ్య మరో ప్రధాన పోరాటంగా మారింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం భారీ అప్పులు చేసి రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టిందని కాంగ్రెస్ ఆరోపి

2

### ఉద్యమ సెంటిమెంట్.. రాజకీయ అస్త్రం

నీళ్లు.. నిధులు.. నియామకాలు అనేవి సాధారణ రాజకీయ అంశాలు కావు. తెలంగాణ ప్రజల భావోద్వేగాలతో నేరుగా ముడిపడి ఉన్న అంశాలు. అందుకే ఏ పార్టీ అయినా వీటిని ప్రస్తావించినప్పుడు రాజకీయ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. అధికార కాంగ్రెస్ గత పాలనను ప్రశ్నిస్తూ తన పాలనను సమర్థించుకుంటోంది. బీఆర్ఎస్ తెలంగాణ హక్కులు, ఉద్యమ సెంటిమెంట్‌ను ముందుకు తెస్తోంది. బీజేపీ మాత్రం రెండు పార్టీల వైఫల్యాలను ఎత్తిచూపుతూ ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదగాలని చూస్తోంది.



## సాగునీటి ప్రాజెక్టులకు 5 వేల కోట్లు మంజూరు

పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి అత్యధిక ప్రాధాన్యం

తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

సాగునీటి ప్రాజెక్టులకు రూ.5 వేల కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. భూసేకరణ, ఆర్ఆర్ కోసం రూ.5 వేల కోట్లు మంజూరు చేశామని వెల్లడించారు.

హైదరాబాద్,ఆగస్టు8 (సింగిడి)

నిధుల కొరతతో సాగునీటి పనులు ఆగొద్దని చెప్పుకొచ్చారు. శనివారం సచివాలయంలో మీడియాతో మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని స్పష్టం చేశారు.

2

## నైపుణ్యం ఉంటేనే ఉపాధి



మారుతున్న కాలానికి అనుగుణంగా కేవలం మార్కుల మెమోలతో కూడిన డిగ్రీలు ఉద్యోగాలను తెచ్చిపెట్టవని, పరిశ్రమల అవసరాలకు తగ్గ నైపుణ్యం, సాంకేతిక పరిజ్ఞానం ఉన్న యువతకే ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి శ్రీధర్ స్పష్టం చేశారు.

హైదరాబాద్, ఆగస్టు8 (సింగిడి)

2

# నిరుద్యోగులంటే ఎందుకింత కక్ష

## సరూర్ నగర్ ఘటన ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమే



రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ హామీ మోసానికి నిదర్శనం

ఎక్స వేదికగా మండిపడ్డ బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు

హైడ్రాలో డ్రైవర్ పోస్టుల భర్తీకి వచ్చిన నిరుద్యోగులను ప్రభుత్వం అవమానించిందంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సోషల్ మీడియా ఎక్స వేదికగా స్పందిస్తూ.. విద్యార్థులు, నిరుద్యోగులు అంటే ప్రభుత్వానికి ఎందుకింత కక్ష అంటూ మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేస్తూ.. 32 నెలలు దాటినా ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని దుయ్యబట్టారు. రెండు లక్షల ఉద్యోగాల హామీ బోగస్ అయ్యిందంటూ ఫైర్ అయ్యారు. అధికారం కోసం ఎన్నికల సమయంలో విద్యార్థులు, నిరుద్యోగులను నెత్తిన పెట్టుకున్నారు. ఉద్యోగాలు ఇస్తామని హామీలు గుప్పించారు.

హైదరాబాద్, ఆగస్ట్ 8 (సింగిడి)

## నేడు నర్సంపేటకు కెసిఆర్

పెద్ది కుటుంబ సభ్యులకు పరామర్శ

2



## మహిళా బిల్లుపై మాటల యుద్ధం

కేంద్రమంత్రి కిరణ్ రిజిజుకు రాహుల్ కౌంటర్



మహిళా రిజర్వేషన్ అంశంపై అధికార, ప్రతిపక్షాల మధ్య మరోసారి మాటల యుద్ధం మొదలైంది. లోకసభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు.. 'ఎక్స' సోషల్ మీడియా వేదికగా పరస్పరం స్పందించారు. మహిళా శక్తిపై రాహుల్ వ్యాఖ్యలను స్వాగతించిన రిజిజు.. మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ పార్టీ బేషరతుగా మద్దతివ్వాలని కోరారు.

న్యూఢిల్లీ,ఆగస్ట్8 (సింగిడి)

2



## నేడు, రేపు హైదరాబాద్ బోనాలు

2

పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్‌లో బోనాల ఉత్సవాలు ఆగస్టు 9, 10 తేదీల్లో జరగనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో ట్రాఫిక మళ్లింపులు చేపట్టినట్లు ట్రాఫిక పోలీసులు పేర్కొన్నారు. లాల్ దర్వాజా, కార్వాన్ దర్బార్ మైసమ్మ, అంబర్‌పేట్ మహంకాళి, చిలకలగూడ కట్ట మైసమ్మ ఆలయాల పరిసరాల్లో ట్రాఫిక ఆంక్షలు విధించినట్లు వెల్లడించారు.

హైదరాబాద్, ఆగస్ట్ 8 (సింగిడి)

## లోయలో పడ్డ బొలెరో వాహనం

ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు దుర్మరణం



ఉత్తరాఖండ్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. బొలెరో వాహనం లోయలో పడ్డ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. శుక్రవారం ఈ సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. దేవ్‌ప్రయాగ్ నుంచి పౌరీ వెళుతున్న బొలెరో వాహనం శుక్రవారం సాయంత్రం సబ్దర్‌ఖల్ వద్ద ప్రమాదానికి గురైంది.

నైనిటాల్,ఆగస్ట్8 (సింగిడి)

2

## 17 నుంచి ఏపీ శాసనసభ సమావేశాలు

# క్షుద్ర రాజకీయాలు కాంగ్రెస్‌కే చెల్లు

నీటి వాటాల విషయంలో తేడా వస్తే తెలంగాణ భగ్గుమంటది

నీళ్లు ఎత్తిపోయడం కూడా చేతకాని సిఎం రేవంత్ రెడ్డి

మీడియా సమావేశంలో మండిపడ్డ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

## యూఏఈ బతుకమ్మ సంబురాలకు కేటీఆర్‌కు ఆహ్వానం

2

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ లో నిర్వహించనున్న బతుకమ్మ సంబరాలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను ఎమిరేట్స్ తెలంగాణ కల్చరల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఈటీసీఏ–యూఏఈ) ప్రతినిధులు ఆహ్వానించారు.

హైదరాబాద్, ఆగస్ట్ 8 (సింగిడి)



## తెలంగాణ కోసం కొట్లాడిన మాకు తెలియదు

క్షుద్రపూజలు అని చెప్పి క్షుద్ర రాజకీయాలు చేస్తున్నది కాంగ్రెస్ పార్టీయేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ కోసం కొట్లాడిన వాళ్లం. తెలంగాణ కోసం త్యాగాలు చేసిన వాళ్లం. క్షుద్ర రాజకీయాలు చేయవలసిన అవసరం తమకు లేదని వెల్లడించారు. అధికారంలో ఉన్నా లేకున్నా తెలంగాణ బాగుండాలని కోరుకుంటాం. కాంగ్రెస్ లాగా పార్టీ క్షుద్ర రాజకీయాలు మాకు తెలియదని పేర్కొన్నారు.

హైదరాబాద్, ఆగస్టు8 (సింగిడి)

2

## హైడ్రాలో 150 డ్రైవర్ ఉద్యోగాలు

2

వేలాదిగా తరలివచ్చిన నిరుద్యోగులు

సరూర్ నగర్ స్టేడియంలో తోపులాట





## నిరుద్యోగ యువతపై ఇంత కాఠిన్యమా

కాంగ్రెస్ అణచివేతకు ఇదే నిదర్శనం

సరూర్‌నగర్ ఘటనపై మండిపడ్డ రాంచంద్రరావు

2

## జలధార-జలహారతి ఇక నిరంతర కార్యక్రమం

ఎల్‌నినోతో అప్రమత్తంగా ఉండాలి

సాగు,తాగునీటితో పాటు పరిశ్రమలకు నీటి సరఫరా

పక్కా ప్రణాళికతో ముందుకు సాగాల్సిందే

అధికారులకు సిఎం చంద్రబాబు దిశానిర్దేశం



2

ప్రభాతనవ సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
ఆదివారం
9 ఆగస్టు 2026

# జలధార-జలహారతి ఇక నిరంతర కార్యక్రమం

**అమరావతి,ఆగస్టు8 (సింగిడి):**

జలధార – జలహారతి ఇక నిరంతర కార్యక్రమమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వ్యాఖ్యానించారు. జలధార – జలహారతిపై సీఎం శనివారం సచివాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై దిశానిర్దేశర చేశారు. ఎల్‌నినో ప్రభావంపై ముందస్తు ప్రణాళికతో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. నీటి లభ్యత తగ్గినా పరిశ్రమలకు అవసరమైన నీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. నీటి పొదుపు, వినియోగంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని దిశానిర్దేశం చేశారు. ఆయా జిల్లాల కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ ఏడాది సాధారణం కంటే 39 శాతం తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. జూన్ నుంచి డిసెంబర్‌లో సాధారణ వర్షపాతం 867 మిల్లిమీటర్లుగా ఉందని వెల్లడించారు. కాగా..



ప్రస్తుతం 525 మిల్లిమీటర్లు మాత్రమే నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. ఆగస్టులో 56 శాతం లోటు వర్షపాతం ఉండే అవకాశం ఉందని తెలిపారు. రిజర్వాయర్ల నీటి నిల్వలపైనా ఎల్‌నినో ప్రభావం ఉండే అవకాశాలు ఉన్నాయని సీఎం అభిప్రాయపడ్డారు. ఏపీలోని వివిధ బేసిన్లలో ప్రస్తుతం 563.05 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయని చెప్పుకొచ్చారు. గతేడాది ఇదే సమయానికి 825.67 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయని వెల్లడించారు. ఆగస్టు నుంచి భూగర్భ జలమట్టాలు మరింత పడిపోయే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. తాగునీటినిల్వలు, సరఫరాపై పక్కా ప్రణాళిక రూపొందించాలని సీఎం మార్గనిర్దేశర చేశారు. వెలుగోడు, గోరకల్లు, అవుకు, జీడిపల్లి, చెర్లోపల్లి రిజర్వాయర్లలో తాగునీటిని నిల్వ చేయాలని సూచించారు.నాగార్జునసాగర్ కాలువల ద్వారా వివిధ జిల్లాలకు తాగునీటి కేటాయింపులు సిద్ధం చేయాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశర చేశారు. అందుబాటులోకి వచ్చిన నీటిని ఒడిసి పట్టుకోవాలని సూచించారు. ఆయా ప్రాజెక్టుల్లోకి వస్తున్న నీటిని సమర్థంగా వినియోగించి రిజర్వాయర్లు నింపాలని మార్గనిర్దేశర చేశారు. తాగునీటి వసతి లేని ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. అవసరమైన ప్రాంతాలకు నీటి సరఫరా కోసం ట్యాంకర్లను ముందుగానే సిద్ధం చేయాలని ఆదేశించారు. వర్షాభావ పరిస్థితుల్లోనూ సాగులో ఉన్న పంటలను కాపాడాలని సూచించారు. అందుబాటులో ఉన్న నీటిని ప్రాధాన్యం మేరకు వినియోగించాలని మార్గనిర్దేశర చేశారు. తక్కువ నీటి వినియోగంతో సాగు చేసే పంటలను భవిష్యత్తులో ప్రోత్సహించాలని సూచించారు. వర్షాభావంతో పశుగ్రాసం కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. పశువులకు మేత, నీటి లభ్యతను ముందుగానే నిర్ధారించాలని పేర్కొన్నారు. అవసరమైన ప్రాంతాల్లో గోకులాలను సిద్ధం చేయాలని సూచించారు. పశుసంపద రక్షణకు జిల్లా స్థాయిలో ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. నీటి వనరుల సంరక్షణ నిరంతరం కొనసాగాలని సీఎం తెలిపారు. చాలాకాలంగా నీటి లభ్యత లేని చెరువులు, కాల్వలను గుర్తించి నీరు అందించాలని సూచించారు. అదనపు నీరు ఉన్న ప్రాంతాల నుంచి కొరత ఉన్న ప్రాంతాలకు మైక్రో బేసిన్ అనుసంధాన అవకాశాలను పరిశీలించాలని తెలిపారు. జలధార – జలహారతి కింద 82,865 పనులు గుర్తించామని.. 79,826 పనులు పూర్తి అయ్యాయని చెప్పుకొచ్చారు. జలధార – జలహారతి కింద రూ.3,409.35 కోట్ల పనులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. చెరువులు, ఫీడర్ ఛానళ్లు, ఫార్మ్ పాండ్లు, ట్రెంచ్‌ల తవ్వకం పనులు చేపట్టినట్లు అధికారులు వివరించారు.

# సిఎన్‌జికి ప్రత్యామ్నాయంగా బయోగ్యాస్

**న్యూఢిల్లీ,ఆగస్ట్8 (సింగిడి):**

దేశంలో పెట్రోల్‌లో ఇథనాల్ మిశ్రమాన్ని ప్రోత్సహించిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు మరో కీలక నిర్ణయం తీసుకుంది. త్వరలో సీఎన్‌జీలో కూడా బయోగ్యాస్‌ను మిళితం చేసి వినియోగదారులకు అందించేందుకు సిద్ధమవుతోంది. ఇందుకోసం కేంద్ర మంత్రివర్గం రూ.23,731 కోట్ల వ్యయంతో గోబర్ధన్ పథకానికి ఆమోదం తెలిపింది. ఈ పథకం ద్వారా దేశీయంగా కంప్రెస్డ్ బయోగ్యాస్ ఉత్పత్తిని పెంచడంతో పాటు, దిగుమతి చేసుకునే సహజ వాయువుపై ఆధారపడటాన్ని తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యం. గోబర్ధన్ అంటే సేంద్రియ గ్యాస్. ఈ పథకాన్ని 2027 నుంచి 2036 ఆర్థిక సంవత్సరాల మధ్య అమలు చేయనున్నారు. దేశవ్యాప్తంగా సేంద్రీయ వ్యర్థాలను వినియోగించి బయోగ్యాస్ ఉత్పత్తిని భారీగా పెంచడం, ఆ గ్యాస్‌ను సీఎన్‌జీ నెట్‌వర్క్‌లో వినియోగించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. కంప్రెస్డ్ బయోగ్యాస్ ను పశువుల పేడ, పంట అవశేషాలు, పురపాలక వ్యర్థాలు, ఆహార వ్యర్థాలు, చెరకు కర్మాగారాల వ్యర్థాలు వంటి సేంద్రీయ పదార్థాల నుంచి ఉత్పత్తి చేస్తారు. శుద్ధి పక్రియ అనంతరం ఈ గ్యాస్ రసాయనికంగా సహజ వాయువుకు చాలా దగ్గరగా ఉంటుంది. అందువల్ల ఇప్పటికే ఉన్న సీఎన్‌జీ, పీఎన్‌జీ పంపిణీ వ్యవస్థల ద్వారానే దీన్ని సరఫరా చేయవచ్చు. ప్రభుత్వం ప్రకటించిన ఈ నిర్ణయంతో ప్రస్తుతం ఉపయోగిస్తున్న సిఎన్‌జి కార్ల యజమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. బయో–గ్యాస్ రసాయనిక లక్షణాలు సహజ వాయువుకు సమానంగా ఉండటంతో వాహనాల్లో ఎలాంటి ఇంజిన్ మార్పులు లేదా హార్డ్‌వేర్ అప్‌గ్రేడ్ అవసరం ఉండదు. పెట్రోల్‌లో ఇ20 వినియోగానికి ప్రత్యేక ఇంజిన్ అవసరమైనట్లు గా, బయో–అఔఉ విషయంలో అలాంటి నిబంధనలు ఉండవు. ప్రభుత్వ ప్రణాళిక ప్రకారం నగర గ్యాస్ పంపిణీ సంస్థలకు బయోగ్యాస్ మిశ్రమం తప్పనిసరి కానుంది. 2026–27 ఆర్థిక సంవత్సరంలో 3 శాతం బయోగ్యాస్ మిశ్రమంతో ప్రారంభించి, 2027–28లో 4 శాతానికి, 2028–29 నుంచి 5 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. పథకం అమలుతో దేశీయంగా బయో–గ్యాస్ ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుందని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. రాబోయే దశాబ్దంలో బయోగ్యాస్ ఉత్పత్తి దాదాపు 10 రెట్లు పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీంతో విదేశాల నుంచి సహజ వాయువు దిగుమతులపై ఆధారపడటం తగ్గి, దేశ విదేశీ మారక వ్యయాన్ని కూడా తగ్గించవచ్చని నిపుణులు చెబుతున్నారు. సేంద్రీయ వ్యర్థాలను వినియోగించి ఇంధనం ఉత్పత్తి చేయడం వల్ల వ్యర్థాల నిర్వహణ మెరుగుపడటమే కాకుండా, పర్యావరణ కాలుష్యం కూడా తగ్గే అవకాశం ఉంది. అదే సమయంలో రైతులకు పంట అవశేషాలు, పశువుల పేడ వంటి వనరుల ద్వారా అదనపు ఆదాయం లభించే అవకాశాలు కూడా ఈ పథకం ద్వారా ఏర్పడనున్నాయి. దేశంలో స్వచ్ఛమైన ఇంధన వినియోగాన్ని పెంచే దిశగా గోబర్ధన్ పథకం కీలక అడుగుగా భావిస్తున్నారు.

# నేడు, రేపు హైదరాబాద్ బోనాలు

లాల్ దర్వాజా బోనాల నేపథ్యంలో పాతబస్తీలో ఆగస్టు 9వ తేదీన ఉదయం 6 గంటల నుంచి, 10వ తేదీన ఉదయం 9 గంటల నుంచి ఊరేగింపు ముగిసే వరకు ట్రాఫిక మళ్లింపులు ఉంటాయని వెల్లడించారు. మదీనా ఎక్స రోడ్డు నుంచి ఇంజిన్ బౌలి (చార్మినార్, నాగుల్ చింతా మీదుగా) రహదారి బోనాల ఊరేగింపు పూర్తయ్యే వరకు పూర్తిస్థాయిలో ఈ రోడ్డును మూసివేస్తున్నట్లు ట్రాఫిక పోలీసులు వివరించారు. ఆర్టీసీ బస్సులు, భారీ వాహనాలకు చార్మినార్, ఫలకనుమా వైపు నో ఎంట్రీ ఉంటుందని తెలిపారు. వాహనదారులను ప్రత్యామ్నాయ మార్గాల్లోకి మళ్లించినట్లు వెల్లడించారు. కార్వాన్ దర్బార్ మైసమ్మ బోనాల సందర్భంగా ఆగస్టు 8వ తేదీ రాత్రి 9 గంటల నుంచి ఆగస్టు 10వ తేదీ ఉదయం వరకు పురానాపూల్, జియాగూడ, టప్పాచబుత్రా పరిసరాల్లో ట్రాఫిక ఆంక్షలు విధించినట్లు పేర్కొన్నారు. అంబర్‌పేట్ మహంకాళి ఆలయం వద్ద ఆగస్టు 9వ తేదీ ఉదయం 6 గంటల నుంచి ఆగస్టు 10వ తేదీ మధ్యాహ్నం 12గంటల వరకు మళ్లింపులు ఉంటాయని ట్రాఫిక పోలీసులు తెలిపారు. బస్సులు, భారీ వాహనాలు అంబర్‌పేట్ మీదుగా వెళ్లాలని సూచించారు. చిలకలగూడ కట్ట మైసమ్మ ఆలయం వద్ద ఆగస్టు 9, 10వ తేదీల్లో ఉదయం 5 గంటల నుంచి రాత్రి 11గంటల వరకు ట్రాఫిక ఆంక్షలు అమల్లో ఉంటాయని వెల్లడించారు. సీతాఫల్‌మండి, పద్మారావు నగర్ వైపు వాహనాలను మళ్లిస్తున్నట్లు చెప్పారు. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని ట్రాఫిక పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# సాగునీటి ప్రాజెక్టులకు 5 వేల కోట్లు మంజూరు

మిడ్‌మానేరు ఎడమ కాలువ పనులను వెంటనే పున:ప్రారంభిస్తామని వివరించారు. పత్తిపాక రిజర్వాయర్‌ను ఫాస్ట్‌ట్రాకలోపూర్తి చేయాలని ఆదేశించారు. పత్తిపాకతో కొత్తగా 10 వేల ఎకరాలకు సాగునీరు ఇస్తామని పేర్కొన్నారు. 2.40 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణెళి లక్ష్యమని మంత్రి ఉత్తమ్ చెప్పుకొచ్చారు. ఆగస్టు నెలాఖరులోగా పత్తిపాక డీపీఆర్ సిద్ధం చేస్తామని తెలిపారు. 96 శాతం పూర్ఖైన రోళ్లవాగుపై ప్రత్యేక దృష్టి సారించామనీ అన్నారు. రోళ్లవాగుతో 15 వేల ఎకరాల చివరి ఆయకట్టుకు నీరు అందజేస్తామని చెప్పుకొచ్చారు. భూసేకరణ, టెండర్లు, అనుమతులను సమాంతరంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. నిర్వాసితులకు పరిహారం, పునరావాసం వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి పెండింగ్ సమస్యను 'యాక్షన్ పాయింట్'గా మార్చాలని సూచించారు. తదుపరి సమీక్షకు యాక్షన్ టేకెన్ రిపోర్ట్ తప్పనిసరని ఆదేశించారు. ఆయా ప్రాజెక్టులు పూర్తి చేసి రైతులకు నీరందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు.

# నైపుణ్యం ఉంటేనే ఉపాధి..

హైదరాబాద్ నాయాపూల్‌లోని ప్రభుత్వ సిటీ కాలేజీ అటానమస్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డా. ఎస్. ఝాన్సీ రాణిని జాతీయ స్థాయి పురస్కారం వరించింది. ప్రతిష్ఠాత్మక ఐపీఏ సన్మాన్ అవార్డ్స్ 2026లో భాగంగా ఆమెకు బెస్ట్ కామర్స్ ఫ్యాకల్టీ 2026 పురస్కారాన్ని అందజేశారు. కామర్స్, మేనేజ్‌మెంట్ విద్యారంగంలో ఆమె అందిస్తున్న విశిష్ట సేవలు, బోధనలో అనుసరిస్తున్న నూతన పద్ధతులు, పరిశోధన మరియు విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి చేస్తున్న కృషిని గుర్తించి ఈ గౌరవం కల్పించారు. డా. ఝాన్సీ రాణి గత కొంతకాలంగా తరగతి గది బోధనను కేవలం పుస్తకాలకే పరిమితం చేయకుండా, ఆధునిక సాంకేతికతతో అనుసంధానం చేస్తూ విద్యార్థుల్లో ఆచరణాత్మక జ్ఞానాన్ని పెంపొందిస్తున్నారు. వాస్తవ వ్యాపార ప్రపంచంలోని సవాళ్లు, అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ వారిని పరిశోధనా దృక్పథం వైపు మళ్లించడంలో ఆమె విశేష కృషి చేస్తున్నారు. ముఖ్యంగా నైపుణ్యాభివృద్ధి, సాంకేతికత ఆధారిత బోధనా విధానాల్లో ఆమె ప్రవేశపెట్టిన సంస్కరణలు విద్యావేత్తల ప్రశంసలు అందుకున్నాయి. ఈ సందర్భంగా డా. ఎస్. ఝాన్సీ రాణి మాట్లాడుతూ.. ఈ పురస్కారం తన బాధ్యతను మరింత పెంచిందని పేర్కొన్నారు. ఇది తన వ్యక్తిగత విజయం మాత్రమే కాదని, తనను నిరంతరం ప్రోత్సహిస్తున్న విద్యార్థులు, సహచర అధ్యాపకులు, కళాశాల యాజమాన్యం కుటుంబ సభ్యులకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఈ గుర్తింపు భవిష్యత్తులో విద్యారంగానికి మరింత అంకితభావంతో సేవ చేయడానికి స్ఫూర్తినిస్తుందని ఆమె ఆకాంక్షించారు.

## యూఏఈ బతుకమ్మ సంబురాలకు
# కేటీఆర్‌కు ఆహ్వానం

ఈ మేరకు శుక్రవారం నంది నగర్‌లోని కేటీఆర్ నివాసంలో ఆయనను కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బతుకమ్మ వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను కేటీఆర్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈటీసీఏ ఆధ్వర్యంలో గత 16 సంవత్సరాలుగా యూఏఈలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహిస్తున్నామని ప్రతినిధులు కేటీఆర్‌కు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా ప్రతి ఏటా బతుకమ్మతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వివరించారు. ఈసారి అక్టోబర్ 11, 2026న దుబాయ్‌లోని అల్ అహిలి స్పోర్ట్స్ క్లబ్లో నిర్వహించనున్న బతుకమ్మ సంబురాలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని కేటీఆర్‌ను కోరారు.

# నిరుద్యోగ యువతపై ఇంత కాఠిన్యమా

**హైదరాబాద్, ఆగస్ట్ 8 (సింగిడి):**

సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం వద్ద ఉద్యోగాల కోసం వచ్చిన నిరుద్యోగ యువతపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడం తీవ్ర బాధాకరమని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ అణచివేత ధోరణిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. రాహుల్ గాంధీ ఢిల్లీలో 'మొహబ్బత్ కీ దుకాణ్' అని గొప్పలు చెప్తూ, తెలంగాణలో మాత్రం ఉపాధి కోరిన యువతపై లాఠీలు ఝుళిపిస్తున్నారని విమర్శించారు.

# పాత నినాదం.. కొత్త రాజకీయం

## నియామకాలు.. నిరుద్యోగుల ఆశలు

తెలంగాణ ఉద్యమంలో కీలకంగా నిలిచిన నియామకాలు అంశం ఇప్పుడు మళ్లీ రాజకీయ చర్చలోకి వచ్చింది. ఎన్నికల ముందు యువతకు ఇచ్చిన ఉద్యోగ హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి స్థాయిలో అమలు చేయలేదని బీఆర్ఎస్, బీజేపీలు విమర్శిస్తున్నాయి. నోటిఫికేషన్లు, గ్రూప్స్ పరీక్షలు, ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో జాప్యాన్ని ప్రతిపక్షాలు ప్రధాన అస్త్రంగా ఉపయోగిస్తున్నాయి. కాంగ్రెస్ మాత్రం అధికారంలోకి వచ్చిన తర్వాత వేలాది ఉద్యోగ నియామకాలు చేపట్టామని చెబుతోంది. పోలీస్ ఉద్యోగాలతో పాటు వివిధ శాఖల్లో నియామక ప్రక్రియ కొనసాగుతోందని ప్రభుత్వం వివరిస్తోంది. దీంతో ఉద్యోగాల అంశం కూడా అధికార, ప్రతిపక్షాల మధ్య మరో రాజకీయ సమరంగా మారింది.

## సెంటిమెంట్‌పై ఆధిపత్యం కోసం..

మూడు పార్టీల వాదనలు వేర్వేరుగా కనిపిస్తున్నా.. రాజకీయ లక్ష్యం మాత్రం ఒక్కటే. తెలంగాణ ప్రజల భావోద్వేగాలతో ముడిపడిన నీళ్లు.. నిధులు.. నియామకాల అంశాలపై ఎవరి పట్టు బలంగా ఉంటే.. రాజకీయంగా వారికే పైచేయి దక్కే అవకాశం ఉంది. అయితే సెంటిమెంట్‌ను రగిలించడం మాత్రమే కాదు.. ఆ మూడు అంశాలపై ఆచరణాత్మక పరిష్కారం చూపించడమే అసలు పరీక్ష. తెలంగాణ ప్రజలు ఈసారి నినాదాలను మాత్రమే కాకుండా.. ఫలితాలను కూడా బేరీజు వేసే పరిస్థితి ఉంది.

# 17 నుంచి ఎపి శాసనభ సమావేశాలు

**అమరావతి,ఆగస్ట్8 (సింగిడి):**

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. 17వ తేదీన ఉదయం 10 గంటలకు శాసన మండలి మొదలు కానుంది. ఈ మేరకు ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ శనివారం నోటిఫికేషన్ విడుదల చేశారు. శాసనసభ, శాసనమండలి సెషన్ సమావేశానికి అధికారిక నోటిఫికేషన్ జారీ చేశారు. నాలుగు రోజుల పాటు 50వ వర్షాకాల సమావేశాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. 17వ తేదీ ఉదయం 9 గంటలకు ఏపీ అసెంబ్లీ సమావేశాలు మొదలవుతాయని నోటిఫికేషన్‌లో గవర్నర్ పేర్కొన్నారు. 17వ తేదీ ఉదయం 10 గంటలకు శాసన మండలి సమావేశాలు ప్రారంభమవుతాయని వెల్లడించారు. 17వ తేదీ ఉదయం ఉభయ సభల బీఏసీలు సమావేశం కానున్నాయి. సమావేశాలు ఎన్ని రోజులు జరగాలి, అజెండాను ఉభయ సభల బీఏసీలు ఖరారు చేయనున్నాయి.

# మహిళా బిల్లుపై మాటల యుద్ధం

దీనికి ఘాటుగా బదులిచ్చిన రాహుల్.. మహిళలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తపరిచేందుకు అవకాశం ఇవ్వాలని పేర్కొన్నారు. వీడియోపై రిజిజు స్పందిస్తూ.. 'కాంగ్రెస్ పార్టీలో ఇది సానుకూల సందేశంగా కనిపిస్తోంది. రాహుల్ వైఖరిలో మహిళల విషయంలో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది' అని 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఇదే సమయంలో మహిళా రిజర్వేషన్ అంశాన్ని ప్రస్తావిస్తూ.. కాంగ్రెస్ పార్టీ మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఎలాంటి షరతులు లేకుండా మద్దతివ్వాలని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. రిజిజు వ్యాఖ్యలకు రాహుల్ గాంధీ వెంటనే స్పందించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును 2023లోనే పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదించిందని గుర్తుచేశారు. 'పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిగా మీకంటే ఈ విషయం బాగా ఎవరికి తెలుస్తుంది మహిళా రిజర్వేషన్ చట్టం–2023 కాంగ్రెస్ పూర్తి మద్దతుతో ఏకగ్రీవంగా ఆమోదమైంది. అయినా మూడేళ్లు గడిచినా ఎందుకు అమలు చేయలేదు ఇప్పుడు దాన్ని డీలిమిటేషన్‌తో అనవసరంగా ఎందుకు ముడిపెడుతున్నారు' అని ప్రశ్నించారు. మహిళలకు రిజర్వేషన్ కల్పించే 2023 చట్టాన్ని ఎలాంటి షరతులు లేకుండా వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాహుల్ విడుదల చేసిన ఈ వీడియోలో మహిళల సామర్థ్యంపై విస్తృతంగా ప్రసంగించారు. దేశంలోని మహిళల శక్తి ఇంకా పూర్తిస్థాయిలో బయటకు రాలేదన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే మహిళలు తమ ఆలోచనలను స్వేచ్ఛగా వ్యక్తం చేయాలని, తమకు నచ్చిన రంగాల్లో ముందుకు సాగేందుకు అవకాశం ఉండాలని పేర్కొన్నారు. మహిళలు.. వ్యాపారం, రాజకీయాల్లో రాణించడమే కాకుండా.. ఇళ్లలోనూ తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా చెప్పగలగాలని, సమాజంలో ఎలాంటి భయం లేకుండా తిరగగలగాలని చెప్పారు. పితృస్వామ్య భావజాలం, మహిళలపై ఉండే కఠిన నియంత్రణ నుంచి కొంత విముక్తి అవసరమని రాహుల్ అభిప్రాయపడ్డారు. మహిళా శక్తి, మహిళా రిజర్వేషన్ అంశాలపై రాహుల్ చేసిన వరుస వ్యాఖ్యల నేపథ్యంలో.. కేంద్రంతో కాంగ్రెస్ మధ్య రాజకీయ వాగ్వాదం మరోసారి తెరపైకి వచ్చింది.

# నేడు నర్సంపేటకు కెసిఆర్

**వరంగల్,ఆగస్టు8 (సింగిడి):**

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నేడు నర్సంపేటకు రానున్నారు. స్వర్గీయ పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించనున్నారు. పార్టీ స్థాపించిన నాటి నుంచి ఎంతో నిబద్ధతతో పనిచేస్తూ, పార్టీ కోసం కృషి చేస్తూ, తన ముఖ్య అనుచరుడుగా కొనసాగిన పెద్ది సుదర్శన్ రెడ్డి మరణంతో కేసీఆర్ విషాదంలో మునిగిపోయారు. ఈ క్రమంలో తన ఆప్తుని కుటుంబ సభ్యులను పరామర్శించడానికి ఆయన నర్సంపేట రానున్నారు. ఈ మేరకు, ఆదివారం నాడు నర్సంపేట నియోజకవర్గంలోని పెద్ది స్వగ్రామమైన నల్లబెల్లికి బయలుదేరి వెళ్ళనున్నారు. ఈ సందర్భంగా, ఇంటి పెద్దను కోల్పోయి శోక తప్త హృదయులై వున్న పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చి కష్ట కాలంలో ఉన్న వారికి భరోసా ఇవ్వనున్నారు. ఇదే సందర్భంలో, నర్సంపేట నియోజకవర్గం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, పెద్ది అభిమానులకు అధినేత కేసీఆర్ గుండె ధైర్యం ఇవ్వనున్నారు. కాగా, పెద్ది కుటుంబాన్ని ఆదుకునేందుకు తన విశాల హృదయాన్ని చాటుకున్న కేసీఆర్ గారు, ఇప్పటికే 2 కోట్ల 25 లక్షల రూపాయలను ఆర్థిక సహాయం ప్రకటించారు. స్వర్గీయ పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ అండగా నిలిచారు. పార్టీ తరపున రెండు కోట్ల 25 లక్షల రూపాయలను అందజేయాలని నిర్ణయించారు. పార్టీ సీనియర్లు, వరంగల్ జిల్లా ముఖ్య నేతలతో చర్చించిన అనంతరం కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల అనారోగ్యంతో మరణించిన స్వర్గీయ పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా నిలవాలని అధినేత కేసీఆర్ నిర్ణయించారు. ఇందులో భాగంగానే సుదర్శన్ రెడ్డి ఇద్దరు పిల్లలకు చెరో కోటి రూపాయల చొప్పున ఆర్థిక సహాయం చేయాలని నిర్ణయించారు. అదే సమయంలో పెద్ది సుదర్శన్ రెడ్డి తల్లి అమృతమ్మ వృద్ధాప్యంలో ఉన్నందున వారి బాగోగుల కోసం మరో రూ. 25 లక్షలు రూపాయలను తల్లి పేరు మీద బ్యాంకులో జమ చేయాలని కేసీఆర్ నిర్ణయించారు. తద్వారా మొత్తంగా, 2 కోట్ల 25 లక్షల రూపాయలను పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ ఆర్థిక సహాయాన్ని అందిస్తూ అండగా నిలవాలని నిర్ణయం తీసుకున్నది. అలాగే పెద్ది సుదర్శన్ రెడ్డి పిల్లల భవిష్యత్తు, వారి చదువు తదితర కుటుంబ సంక్షేమానికి సంబంధించి పార్టీ నిరంతరం పర్యవేక్షిస్తూ అండగా నిలుస్తుందని కేసీఆర్ తెలిపారు. ఈ మేరకు పార్టీ సీనియర్లతో పాటు వరంగల్ జిల్లా పార్టీ సీనియర్ నేతలతో చర్చించి నిర్ణయం తీసుకున్నారు. కాగా దివంగత పెద్ది సుదర్శన్ రెడ్డి దశదినకర్మల కార్యక్రమాలు ముగిసిన తర్వాత జిల్లా పార్టీ ముఖ్యులు కూర్చొని వారి కుటుంబానికి సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన నిర్ణయాలు తీసుకుంటారనీ, ఎల్లకాలం వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని కేసీఆర్ పునరుద్ఘాటించారు.

# క్షుద్ర రాజకీయాలు కాంగ్రెస్‌కే చెల్లు

హరీష్ రావు గుడికి పోతే తప్పా ఇలాంటి చిల్లర రాజకీయాలు చేయవచ్చా కాంగ్రెస్ పార్టీలాగా మేడిగడ్డకు, చెక డ్యామ్‌లోనూ ధ్వంసం చేసి ఓట్లు దండుకోవాలని చూడలేదని ఆరోపించారు. నీళ్లు ఉన్నా కూడా రైతులను ఎండబెట్టే కాంగ్రెస్ సంస్కృతి బీఆర్ఎస్‌ది కాదని అన్నారు. కరెంటు ఉండి కూడా వ్యవసాయదారుడికి 24 గంటల కరెంట్ ఇవ్వడం లేదు. ఏ సబ్ స్టేషన్‌కైనా రావడానికి మేము సిద్ధం. 24 గంటల కరెంట్ వస్తే ఇంకా ఎక్కడ ఉందో చెప్పాలి. కనీసం ఐదు, ఆరు సార్లు ప్రతిరోజూ కరెంట్ కోతలు అవుతున్నాయని విమర్శించారు. కోర్టులు చెప్పినా హైడ్రా విషయంలో రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న వైఖరిని ప్రజాస్వామిక వాదులు గుర్తించాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. రేవంత్ రెడ్డి ప్రజా వ్యతిరేక, రాజ్యాంగ వ్యతిరేక ఆలోచనా విధానాన్ని గుర్తించాలని, రేవంత్ రెడ్డి హిట్లర్ అని చెప్పుకున్నట్లే రాజ్యాంగ వ్యవస్థలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రెండున్నర లక్షల మందికి 58 జీవో ద్వారా పట్టాలు ఇచ్చామని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఒక్క పట్టా అయినా ఇవ్వలేదని, పైగా వేలాది మంది ఇళ్లను కూలగొట్టిందని ఆరోపించారు. హైదరాబాద్ లోని 10,000 ఎకరాల విలువైన భూమి పారిశ్రామిక భూముల విషయంలో రేవంత్ రెడ్డి చేస్తున్న 5 లక్షల కోట్ల స్కామ్ పైన రాష్ట్ర ప్రజలను జాగృతం చేస్తామని కేటీఆర్ వెల్లడించారు. హిల్ట్ పాలసీ ద్వారా రాష్ట్ర ప్రజల సొమ్మును ఏ విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం జేబులో వేసుకుంటుందో ప్రజలందరికీ అర్థమయ్యేలా లేఖల రూపంలో, ప్రజెంటేషన్ల రూపంలో ప్రజల ముందు ఉంచుతామన్నారు. రైతులపై రేవంత్‌రెడ్డికి కనీస పరిజ్ఞానం లేదని తెలిపారు. తాము డిమాండ్ చేస్తేగానీ పంప్‌లు ఎందుకు ఆన్ చేయలేదని ప్రశ్నించారు. సీఎంకు ఎప్పుడు నీళ్లు ఎత్తిపోయాలో కూడా తెలియదని విమర్శించారు. హరీశ్‌రావు ఈ విషయంపై ప్రశ్నించినా కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు స్పందించలేదని నిలదీశారు. సీఎం రేవంత్ దృష్టిలో భూమి అంటే రియల్ ఎస్టేట్ అని ఎద్దేవా చేశారు.కేంద్రమైనా, రాష్ట్రమైనా నష్టం కలిగించేలా వ్యవహరిస్తే తిరుగుబాటు తప్పదని కేటీఆర్ హెచ్చరించారు.కేంద్ర ప్రభుత్వాన్ని అడ్డు పెట్టుకొని తెలంగాణకు నీటి వాటాల్లో అన్యాయం చేస్తే, తెలంగాణ ఉద్యమానికి మించి మరొక ఆందోళన తెలంగాణలో వస్తుందని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని నందినగర్‌లో మీడియాతో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. వచ్చేవారం జరిగే జీఆర్ఎంబీ సమావేశం ఎజెండా ఎందుకు అంగీకరించారో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశం ఎజెండా పూర్తిగా తెలంగాణ హక్కులను కాల రాస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ హక్కులను ఏ విధంగా కాపాడతారో రేవంత్, ఉత్తమ్ కుమార్ రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. తెలంగాణ వ్యతిరేకి ఆదిత్యనాథ్ దాస్‌ని సలహాదారుగా పెట్టుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన సిగ్గుమాలిన చర్య అని విమర్శించారు. తెలంగాణలో ఒక్క ఇంజనీర్ కూడా లేరా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చెప్పుచేతల్లోకి తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తుంది. చంద్రబాబు చెప్పు చేతల్లో రేవంత్ రెడ్డి నడుస్తున్నాడని విమర్శించారు.

# నిరుద్యోగులంటేే ఎందుకింత కక్ష

ఇప్పుడు అదే నిరుద్యోగులు ఉద్యోగాల కోసం రోడ్ల మీదకు వస్తే వారి పట్ల ఇంత కర్కశంగా వ్యవహరిస్తారా అని ప్రశ్నించారు. హైడ్రాలో కేవలం 150 డ్రైవర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇస్తే వేలాది మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకునేందుకు తరలివచ్చారు. ఇది నిరుద్యోగుల తప్పా లేక ఉద్యోగాలు కల్పించడంలో విఫలమైన మీ ప్రభుత్వం తప్పా అని అన్నారు. ఇంజినీరింగ్ చదివిన విద్యార్థులను ముఖ్యమంత్రి స్థాయిలో 'క్రిమినల్ వేస్ట్' అని అవమానించడం, ఉద్యోగాల కోసం వచ్చిన నిరుద్యోగులను అధికారులు దుర్భాషలాడటం చూస్తుంటే 'యథా రాజా.. తథా అధికారులు' అన్న సామెత గుర్తుకొస్తోంది. అధికారుల నోటివెంట ఇలాంటి మాటలు రావడం మరింత బాధాకరం. ఉద్యోగం కోసం వచ్చిన యువతను గౌరవంగా చూడాల్సిన అధికారులు వారినే అవమానిస్తే ఇక ఈ ప్రభుత్వం ఎవరి కోసం పనిచేస్తున్నట్టు అని అన్నారు. రెండు లక్షల ఉద్యోగాలు నిజంగా భర్తీ చేసి ఉంటే.. ఈరోజు 150 డ్రైవర్ పోస్టుల కోసం వేలాది మంది నిరుద్యోగులు ఇలా క్యూలలో నిలబడాల్సిన పరిస్థితి వచ్చేదా అని అన్నారు. నీ రెండు లక్షల ఉద్యోగాల హామీ బోగస్. నీ జాబ్ క్యాలెండర్ బోగస్. నిరుద్యోగులకు నువ్వు ఇచ్చిన హామీలు బోగస్. మీ పాలనలో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతలో నిరాశ పెరుగుతోంది. నోటిఫికేషన్లు సక్రమంగా రాకపోవడం తో పీజీ, పీహెచ్డీ వంటి ఉన్నత విద్య చదివిన యువత కూడా చిన్నచిన్న పోస్టుల కోసం పోటీ పడాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం. ఉద్యోగాల కోసం వచ్చిన నిరుద్యోగులపై అనుచితంగా, అసభ్యంగా మాట్లాడిన అధికారులపై వెంటనే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి. వారిని అవమానించినందుకు విద్యార్థి, నిరుద్యోగ లోకానికి ప్రభుత్వం క్షమాపణ చెప్పాలి' అంటూ ఎక్సలో హరీశ్ రావు పోస్ట్ చేశారు. హైడ్రాలో డ్రైవర్ పోస్టుల భర్తీ సందర్భంగా సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం వద్ద జరిగిన ఘటనలపై హరీశ్ రావు 'ఎక్స్'వేదికగా స్పందించారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని.. ఉద్యోగాలు ఇవ్వాల్సిన ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వడం లేదని పేర్కొన్నారు.

# సుదీర్ఘ యుద్ధంతో తీవ్ర నష్టం

**వాషింగ్టన్,ఆగస్ట్8 (సింగిడి):**

గత ఐదు నెలలుగా ఇరాన్‌తో సాగిస్తోన్న యుద్ధం కారణంగా అమెరికా ఆయుధ నిల్వలు తరిగిపోతున్నాయని పెద్ద ఎత్తున ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘర్షణలకు త్వరగా ముగింపు పలకాలని స్వదేశంలో డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే అగ్రరాజ్య జాయింట్ చీఫ్స్ ఛైర్మన్ జనరల్ డాన్ కేన్ ట్రంప్కార్యవర్గానికి కీలక సూచనలు చేసినట్లు తెలుస్తోంది. ఇరాన్‌తో యుద్ధం నుంచి ఇకనైనా బయటపడాలని.. లేదంటే ప్రతికూల ఫలితాలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించినట్లు సమాచారం. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ అంతర్జాతీయ మీడియా కథనం వెల్లడించింది. ఇరాన్‌తో యుద్ధం స్వల్పకాలికంగా ఉండాల్సింది. ఇప్పటికే అది ఆ దశను దాటేసింది. పశ్చిమాసియాలో ఘర్షణలు తీవ్రతరం చేయడానికి మనకు అందుబాటులో ఉన్న సైనిక చర్యలు ప్రతికూల ఫలితాలు ఇచ్చే ప్రమాదం ఉంది. కేవలం వైమానిక శక్తితోనే నిర్దేశిత లక్ష్యాలను మనం సాధించలేం. అందుకే ఇకనైనా, ఈ యుద్ధం నుంచి బయటకు వచ్చే మార్గాలను అన్వేషించాలని ట్రంప్ సలహాదారులకు డాన్ కేన్ ప్రైవేటుగా చెప్పినట్లు తెలుస్తోంది. ఇదే విషయం గురించి ఆయన పలువురు క్యాబినెట్ అధికారులు, సీఐఏ డైరెక్టర్ జాన్ రాట్‌క్లిఫ్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తోనూ చర్చలు జరిపారట. ఇరాన్‌లో భూతల దాడులకు విముఖత చూపుతోన్న అధ్యక్షుడు ట్రంప్.. దానికి బదులుగా వైమానిక దాడులను మరింతగా పెంచుతామని ఇటీవల కాలంలో పదేపదే ప్రకటనలు చేస్తున్నారు. ఈ హెచ్చరికలతో ఇరాన్‌ను ఒప్పందానికి తీసుకురావొచ్చని ఆయన విశ్వసిస్తున్నారు. అయితే, సుదీర్ఘకాలంగా వైమానిక దాడులు చేపడుతుండటంతో అగ్రరాజ్య ఆయుధ నిల్వలు భారీగా తగ్గిపోతున్నాయి. ఇప్పటికే 80 శాతం మిసైల్ డిఫెన్స్ సిస్టమ్ ఇంటర్‌సెప్టర్లు, దాదాపు సగం పేట్రియాట్ క్షిపణులు కరిగిపోయినట్లు ఇటీవల కథనాలు వచ్చాయి. అయితే, వీటిని ట్రంప్ కొట్టిపారేశారు. తమ వద్ద పెద్ద ఎత్తున ఆయుధ నిల్వలు ఉన్నట్లు పేర్కొన్నారు. అంతేగాక, చరిత్రలో ఎన్నడూ లేని విధంగా.. భారీ సంఖ్యలో ప్లాంట్లు, ఫ్యాక్టరీలను రక్షణ రంగ కంపెనీలు నిర్మిస్తున్నాయని తన ట్రూత్ ఖాతాలో పోస్ట్ చేశారు. అయితే, క్షిపణుల సంఖ్య గురించి మాత్రం ఆయన కచ్చితమైన లెక్క చెప్పక పోవడం గమనార్హం.

# లోయలో పడ్డ బొలెరో వాహనం

రోడ్డు పక్క ఉన్న లోయలో పడిపోయింది. సమాచారం అందుకున్న వెంటనే దేవ్‌ప్రయాగ్ పోలీసులు, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదం జరిగిన సమయంలో బొలెరోలో ఒకే కుటుంబానికి చెందిన 7 మంది ఉన్నారు. వాహనం లోయలో పడగానే తీవ్రగాయాలపాలై ఐదుగురు అక్కడికక్కడే చనిపోయారు. తీవ్రంగా గాయపడ్డ మరో ఇద్దరిని సహాయక సిబ్బంది దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఓ బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలను అన్వేషిస్తున్నారు

# హైడ్రాలో 150 డ్రైవర్ ఉద్యోగాలు

**హైదరాబాద్, ఆగస్ట్ 8 (సింగిడి):**

నగరంలోని సరూర్‌నగర్ స్టేడియం వద్ద తోపులాట జరిగింది. హైడ్రాలో 150 డ్రైవర్ ఉద్యోగాల కోసం నిరుద్యోగులు పోటెత్తారు. శనివారం, ఆదివారం డ్రైవర్ల ఎంపిక ఉంటుందని హైడ్రా ప్రకటించింది. దీంతో ఇందులో పాల్గొనేందుకు నిరుద్యోగులు భారీగా తరలిరావడంతో తోపులాట జరిగింది. ఇటీవల హైడ్రా విడుదల చేసిన 150 డ్రైవర్ పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన రిక్రూట్‌మెంట్ పక్రియ తీవ్ర గందరగోళానికి దారి తీసింది. డ్రైవర్ పోస్టుల కోసం రాష్ట్రంలోని నలుమూల నుంచి వేలాది మంది నిరుద్యోగ యువత శనివారం తెల్లవారుజామున 4 గంటల నుంచే భారీగా సరూర్‌నగర్ స్టేడియానికి చేరుకున్నారు. కేవలం 150 పోస్టులు ఉండగా.. ఊహించిన రీతిలో వేలాది మంది పోటెత్తడంతో స్టేడియం మొత్తం నిరుద్యోగులతో కిక్కిరిసిపోయింది. ఈ క్రమంలో కొంత ఉద్రిక్తత, తోపులాట చోటుచేసుకుంది. గంటల తరబడి లైన్లలో వేచి ఉన్నప్పటికీ అధికారుల వైపు నుంచి సరైన ఏర్పాట్లు లేకపోవడంతో నిరుద్యోగులు అసహనం వ్యక్తం చేశారు. కనీసం తాగడానికి మంచి నీరు కూడా ఏర్పాటు చేయకపోవడంతో లైన్లలో వేచి ఉన్న యువత.. నిర్వాహకుల తీరుపై ఆందోళనకు దిగారు. ఉద్యోగం కోసం జిల్లాలు దాటి వస్తే అధికారులు నిర్లక్ష్యంగా ప్రవర్తించారంటూ నిరుద్యోగులు వాపోతున్నారు.



## వరి సాగు వద్దు..

# ఆరుతడి పంటలే ముద్దు

- సాగర్‌లో నీరు తాగునీటికే
  రైతులకు అధికారులు అవగాహన కల్పించాలి
- 2028 ఆగస్టు నాటికి ఎస్ఎల్‌బీసీ సొరంగం పూర్తి చేస్తాం
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

**నల్గొండ ప్రతినిధి ఆగస్టు 8(సింగిడి):** ఎల్‌నినో ప్రభావంతో నాగార్జునసాగర్ ప్రాజెక్టులో ప్రస్తుతం ఉన్న నీరు తాగునీటి అవసరాలకు మాత్రమే సరిపోతుందని, ఎగువ నుంచి నీరు వచ్చే పరిస్థితి కూడా లేనందున రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ వరి సాగు చేయకుండా ఆరుతడి పంటలు వేసుకునేలా అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశించారు. శనివారం నల్గొండ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మాట్లాడుతూ నాగార్జునసాగర్‌లో నీరు డెడ్‌స్టోరేజీలో ఉందని, శ్రీశైలం నుంచి నీరు వచ్చినప్పటికీ ప్రస్తుతం పంటలకు సాగునీరు అందించే పరిస్థితి లేదన్నారు. ఉన్న నీరు 2027 జూన్ వరకు తాగునీటి అవసరాలకు సరిపోతుందని తెలిపారు. ఏఎంఆర్‌పీ కూడా సగమే నిండిందని, గతంలో ఎన్నడూ లేనివిధంగా పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. రానున్న రోజుల్లో సూపర్ ఎల్‌నినో ప్రభావం దక్షిణ తెలంగాణపై ఎలా ఉంటుందో తెలియని పరిస్థితి ఉందని పేర్కొన్నారు. జిల్లాలో పంట మార్పిడిలో భాగంగా



ఇప్పటికే 33 వేల ఎకరాల్లో వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేస్తున్నారని, దీనిని 1.50 లక్షల ఎకరాల లక్ష్యానికి పెంచాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు ధైర్యం చెప్పడంతో పాటు ఆరుతడి పంటల వైపు మళ్లించాలని సూచించారు. కూరగాయలు, ఉద్యాన పంటలు సాగు చేయడంతో పాటు సేంద్రియ వ్యవసాయంపై కూడా రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

**2028 ఆగస్టు నాటికి ఎస్ఎల్‌బీసీ పూర్తి**

కరువు పరిస్థితులు ఎదురైనా నల్గొండ జిల్లాకు శాశ్వ తంగా సాగునీరు అందించేలా ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులను 2028 ఆగస్టు నాటికి పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. పనులు కొనసాగు తున్నాయని, ఏఎంఆర్‌పీ, ఎస్ఎల్‌బీసీ, బ్రాహ్మణ వెల్లెంల ద్వారా జిల్లాలో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందించనున్నట్లు తెలిపారు. ఎస్ఎల్‌బీసీ కోసం ఎంతైనా ఖర్చు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారని, శ్రీశైలం డెడ్‌స్టోరేజీలో ఉన్నప్పటికీ ఎస్ఎల్‌బీసీ ద్వారా సాగునీరు అందించే అవకాశం ఉంటుందని అన్నారు. ఇకపై జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. ఎల్‌నినోతో అప్రమ త్తంగా ఉండాలి: ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో రాబోయే రోజుల్లో సాగునీటి ఇబ్బందులు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి రైతుల వద్దకు వెళ్లి పంట మార్పిడిపై అవగాహన కల్పించాలని కోరారు. ఆరుతడి పంటల వైపు రైతులను మళ్లించాలి: జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రాజెక్టుల్లో నీటి లభ్యత తక్కువగా ఉన్నందున రానున్న రోజుల్లో సాగునీటి పరిస్థితిపై ముందస్తు ప్రణాళిక అవసరమని తెలిపారు. ఆగస్టు 15 వరకు మాత్రమే ఆరుతడి పంటలు వేసుకునే అవకాశం ఉన్నందున వ్యవసాయ, ఉద్యాన శాఖల అధి కారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులను చైతన్య పరచాలని ఆదేశించారు. మున్సిపాలిటీల్లో రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలను ప్రోత్సహించాలని సూచించారు. సమావేశంలో నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్‌రెడ్డి, హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ శేఖర్‌రెడ్డి, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, జిల్లా నీటిపారుదల శాఖ సీఈ శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ ఆమీర్ అలీ, వివిధ మార్కెట్ కమిటీలు, పీఏసీఎస్‌ల చైర్మన్లు, అధికారులు పాల్గొన్నారు. ప్రాజెక్టులు, భూగర్భ జలాలు, వ్యవసాయ, ఉద్యాన, విద్యుత్ శాఖల అధికారులు జిల్లాలో ప్రస్తుత సాగునీటి పరిస్థితి, పంటలసాగు, భవిష్యత్ కార్యాచరణపై వివరాలు సమర్పించారు.

### టీవీఆర్ గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల్లో

# ఘనంగా బోనాల వేడుకలు



నెత్తిన బోనాలు ఎత్తుకొని అమ్మవారికి మొక్కులు చెల్లించిన చిన్నారులు

పోతరాజుల విన్యాసాలతో ఆకట్టుకున్న విద్యార్థులు

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 8 (సింగిడి):** కుత్బుల్లాపూర్ నియోజక సుభాష్ నగర్ డివిజన్ అపురూప కాలనీలోని టివిఆర్ మాడల్ హైస్కూల్లో, ఎస్సార్ నాయక్ నగర్ సత్యవాణి విద్యానికేతన్ పాఠశాలల్లో శనివారం రోజున టివిఆర్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ టి. వంశీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. టివిఆర్ విద్యాసంస్థలలో నిర్వహించిన ఆషాఢ మాస పూర్ణాల వేడుకలు అంగరంగ వైభవంగా, అంబరాన్నంటే సంబరాలు భక్తి ప్రపత్తులతో జరిపించారు. తెలంగాణ సాంప్రదాయాన్ని ప్రతిబింబించేలా నిర్వహించిన ఆషాడమాస బోనాల వేడుకలు ఆటపాటలతో, సాంస్కృతిక వేడుకలు, పోతరాజుల నృత్యాలు చూపరులందర్నీ ఎంతగానో అలరించాయి. అనాది నుండి వస్తున్న సాంప్రదాయాలను అనుకరిస్తూ, ప్రకృతి దేవతలను, వన దేవతలను కొలుస్తూ ఆషాడ మాసంలో ప్రజలకు ఎటువంటి అంటు వ్యాదులు ప్రభ లకుండా ఉండాలని దేవతామూర్తులకు బోనాలతో మొక్కులు చెల్లించుకుంటారు. గ్రీష్మ రుతువు దక్షిణా యనం మొదలై వర్షాకాలం రావడంతో వాతావర ణ మార్పుతో కలరా, మసూచి, ప్లేగు వంటి విష జ్వరాల బారిన పడకుండా ఉండాలని అమ్మవారికి అతి ప్రీతిపాత్రమైన బెల్లన్నం భోజనంగా వండి మట్టి కుండలో పెట్టి పూజించి అమ్మవార్లకు నైవేద్యంగా సమర్పించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనాదిగా వస్తున్న ఆచార వ్యవహారాలను అనుకరిస్తూ ఆషాడ మాసంలో వాడవాడన పసుపు కుంకుమలతో కాళ్లకు గజ్జలు కట్టి, డప్పు చప్పులతో అమ్మవారి పూన కాలతో మనసు పులకించి మైమరిచి భక్తిశ్రద్ధలతో ప్రజలందరూ అమ్మవారిని కొలుస్తారని వంశీకృష్ణ రెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాన్ని టివిఆర్ విద్యాసంస్థల చిన్నారులు సాంప్రదాయ నృత్యాలతో, శివసత్తుల శిగాలు, పోతరాజుల నృత్యాలు అన్నింటినీ కలబోసిన అమ్మవారి బోనాల వేడుకలను కన్నుల పండుగగా భక్తిశ్రద్ధలతో పాఠశాల అధ్యాపక బృందం యాజమాన్యం విద్యార్థులతో కలిసి వేడుకలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థిని విద్యార్థులు, అధ్యాపక బృందం పాల్గొన్నారు. టివిఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ కోటి రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ సూర రవిచంద్రా రెడ్డి, దీప్తి రెడ్డి, కరస్పాండెంట్ అరుణ కుమారి బోనాల పండుగ శు భాకాంక్షలు తెలిపారు.



### దెబ్బతిన్న రోడ్లను పరిశీలించిన భరత్ సింహారెడ్డి



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 8 (సింగిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 132 జీడిమెట్ల డివిజన్ (పేట్ బషీరాబాద్ డివిజన్) పరిధిలోని ప్రగటూల్స్ కాలనీ, బీ.ఎచ్.ఈ.ఎల్ విస్తా కాలనీలో ఇటీవల కురిసిన వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్లను కాలనీ వాసులతో కలిసి బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి పరిశీలించారు. రోడ్ల దుస్థితి కారణంగా ప్రజలు ఎదుర్కొం టున్న ఇబ్బందులను కాలనీ వాసులను అడిగి తెలుసుకుని, దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మంజునాథ్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, బాల్ రెడ్డి, వంశీ కృష్ణ, ప్రియాంక రావు, పరిశోదన్ రెడ్డి, బిల్లా, శ్రీనివాస్, నార్లకంటి దుర్గయ్య, నార్లకంటి ప్రతాప్, నల్లనాగుల కృష్ణ, పెద్దింటి సాయిలు, సతీష్ చక్రవర్తి, ప్రవీణ్ గౌడ్, పోల గంగాధర్, శ్రవణ్ బోస్, అంజయ్య, దీపిక, శ్రవణ్, వర్మ, మూర్తి, శివ, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

### "నాన్న ఒక నిశ్శబ్ద సముద్రం" పుస్తకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 8 (సింగిడి):** కుటుంబ సంతోషం కోసం చేసే త్యాగాలు, తన బాధలను చిరునవ్వుతో దాచుకుని, కుటుంబం కోసం నిరంతరం శ్రమించే నిత్య శ్రామికుడైన తండ్రి కష్టాన్ని వివరిస్తూ యువ రచయిత "ఆకాష్ కేదార్" ద్వారా రూపొందించబడిన "నాన్న ఒక నిశ్శబ్ద సముద్రం" పుస్తకాన్ని శనివారం పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి సమాజంలో తండ్రి పై పిల్లలకు మరింత ప్రేమను పెంచుతూ చీకటిలో వెలుతురూ చూపే కాంతి రేఖగా ఈ పుస్తకం నిలుస్తుందని అన్నారు. నేటి యువత నాన్న ఒక నిశ్శబ్ద సముద్రం పుస్తక పఠనాన్ని అలవరుచుకోవాల న్నారు. ఈ సందర్భంగా యువ రచయిత ఆకాష్ కేదార్ ను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సత్తిరెడ్డి, కిషోర్ చారి, సమ్మయ్య నేత తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియెట్ విద్యార్థులకు గీతం అవగాహన

- అధ్యాపకుల పర్యవేక్షణలో గణిత, విజ్ఞానశాస్త్రాల బోధన



**పటాన్చెరు, ఆగస్టు 08 (సింగిడి):** హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ సైన్స్, గణిత, గణాంక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శనివారం ముత్తంగిలోని "ఎం యు పి టీ బీ సి వి ఆర్ జే సి", సంగారెడ్డి అండ్ స్ ఓ ఏ , గర్ల్స్ కళాశాలలోని ఇంటర్మీడియెట్ విద్యార్థుల కోసం గణిత, విజ్ఞాన శాస్త్ర అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. జేఈఈ మెయిన్, జేఈఈ అడ్వాన్స్ డ్, ఈఏపీసెట్ పరీక్షలకు సమర్థవంతమైన సన్నద్ధత వ్యూహాలను విద్యార్థులకు అందించడంతో పాటు, ఇంజనీరింగ్, గణితం, విజ్ఞాన శాస్త్రంలో ఉన్నత విద్యను అభ్యసించేలా వారిని ప్రోత్సహించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. అధ్యాపక బృందం, విద్యార్థి వాలంటీర్లు కలిసి పరీక్షా సంబంధిత భావనలు, సమయాన్ని ఆదా చేసే గణితంలో సులువైన మార్గాలు (షార్ట్ కట్లు), శాస్త్రీయ సమస్య పరిష్కార పద్ధతులు, వృత్తి మార్గదర్శనంపై ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. నేర్చుకున్న భావనలను మరింత పటిష్టం చేయడానికి ఒక ఆసక్తికరమైన క్విజ్ పోటీని నిర్వహించారు. ఇందులో విజేతలకు గీతం లోగోతో కూడిన వాటర్ బాటిళ్లు, పెన్నులను బహుమతిగా అందజేశారు. పోటీ పరీక్షల కోసం తమ ఆత్మవిశ్వాసాన్ని, సమస్య పరిష్కార సామర్థ్యాలను పెంచిన ఆచరణాత్మక చిట్కాలను, సులువైన పద్ధతులను విద్యార్థులు ఎంతగానో ప్రశంసించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థుల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. అధ్యాపక సమన్వయకర్తలు డాక్టర్ పి. నరసింహస్వామి, డాక్టర్ శివారెడ్డి శేరి, డాక్టర్ పి. జితేంద్ర సేనాపతి, డాక్టర్ ఎస్. చక్రవర్తిల పర్యవేక్షణలో, విద్యార్థులు త్రిషల్ సాయి వల్లేపల్లి, చింతలకుంట నితిన్ కుమార్, సుభాంగి పాండా, అనుష్క ప్రజాపతి, పిర్లమర్ల లక్ష్మీ వజ్ర, తలమంచి మనోజ్ కుమార్ ఈ ఔట్ రీచ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

# అంగరంగ వైభవంగా బోనాలు

- ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే జిఎంఆర్





**పటాన్చెరు, ఆగస్టు 08 (సింగిడి):** గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలో శనివారం నిర్వహించిన దుర్గమ్మ తల్లి బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు నిర్వాహకులు, భక్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదా యాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలంతా భక్తిశ్రద్ధలతో బోనాల ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయ మన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. తెలంగాణలో బోనాల పండుగకు ప్రత్యేకమైన ప్రాధాన్యత ఉందని, తరతరాలుగా వస్తున్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పండుగలను ప్రజలంతా ఐక్యతతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. గుమ్మడిదల ప్రాంతం మరింత అభివృద్ధి చెందేలా ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా తాము నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో గుమ్మడిదల ప్రాంత ప్రజలందరికీ మంచి జరగాలని, నియోజకవర్గం సుభిక్షంగా ఉండాలని ఆయన ఆకాంక్షిం చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ సంధ్య గోవర్ధన్ రెడ్డి, విజయ్ భాస్కర్ రెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు,నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

### కాలనీ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

- మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



**అల్వాల్, ఆగస్టు 8 (సింగిడి):** కాలనీ సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత అని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. అభివృద్ధిలో భాగంగా ఎమ్మెల్యే శ్రీ మర్రి రాజశేఖర్ రెడ్డి మచ్చబొల్లారం డివిజన్‌లోని అల్వాల్ హిల్స్‌లో రోడ్డు నంబర్ 13 మరియు 15లో రూ. 29 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భ ంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఇంజనీరింగ్ అధికారులతో పాటు స్థానిక కాలనీవాసులతో కలిసి సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం అల్వాల్ హిల్స్ కమ్యూనిటీ హాల్‌లో కాలనీవాసులతో సమావేశమై స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీవాసులు ప్రధానంగా భూగర్భ డ్రైనేజీ ఏర్పాటు, తాగునీటి పైప్‌లైన్ల సమస్య పరిష్కారం, ఇంకా సీసీ రోడ్లు ఏర్పాటు చేయాల్సిన ప్రాంతాల్లో రోడ్డు పనులు చేపట్టాలని ఎమ్మెల్యే గారిని కోరారు. కాలనీవాసుల విజ్ఞప్తులపై ఎమ్మెల్యే గారు సానుకూలంగా స్పందిస్తూ, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అల్వాల్ మాజీ కార్పొరేటర్ శ్రీమతి చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ రవళి, వర్క్ ఇన్‌స్పెక్టర్ అఫ్రోజ్, అల్వాల్ హిల్స్ వాసులు భూపాల్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, నర్సింగరావు, దేవేందర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు డోలి రమేష్, రాము యాదవ్, తోట నరేందర్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, శరణగిరి, సురేష్, అతిక్ పాషా, శిల్ప, వర్ష, హరిత, రేవంత్ రెడ్డి, తిరుమల్, పెంటారెడ్డి, సత్యనారాయణ, సతీష్ పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరికలు



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 8 (సింగిడి):** సిఎంసి నిజాంపేట్ సర్కిల్ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సాంబశివ రెడ్డి ఆధ్వర్యంలో నిజాంపేట్ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయవాసులు బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ పేదవారి సొంత ఇంటి కల నెరవేర్చిన మహా నాయకులు కేసీఆర్ అని, బి ఆర్ ఎస్ అధినేత కెసిఆర్ ద్వారానే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ కుత్బుల్లాపూర్ నియోజక వర్గ అభివృద్ధికి చేస్తున్న కృషికి ఆకర్షితులై బిఆర్ఎస్ పార్టీలో చేరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మద్దెల సత్యనారా యణ, జయరాజు, ఝాన్సీ, హైమద్, సర్దార్, నర్సింహ, మల్లేష్, దుర్గప్రసాద్, మోహన్, లక్ష్మణ్, శ్రీనివాస్, కె. రవి, ప్రసాద్, నర్సింగరావు, మహిళలు, నందిని, చంద్రకళ, ఎండి ఆస్మా, యోగిత, రత్నమ్మ, శాంతాబాయి, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

### అమ్మవారి కృపా కటాక్షాలు ప్రజలపై ఉండాలి

- ఎమ్మెల్యే కెపి.వివేకానంద్



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 8 (సింగిడి):** కుత్బుల్లాపూర్ డివిజన్ సుదర్శన్ రెడ్డి నగర్ లోని విరూపాక్ష, పోచమ్మ దేవాలయంలో నిర్వహించిన భోనాల వేడుకలకు బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై విరూపాక్ష స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే ను శాలువాలతో ఘనంగా సత్కరించారు. అమ్మవారి కృపా కటాక్షాలు ప్రజలందరికీ సంపూర్ణంగా ఉండాలి. జీడిమెట్ల డివిజన్ కుత్బుల్లాపూర్ గ్రామంలోని శ్రీ చిలుకమ్మ, శ్రీ మహంకాళి, శ్రీ దుర్గా దేవి ( మూడు గుళ్ళు) దేవాలయంలో బోనాల పండుగను పురస్కరించుకొని నిర్వహించిన ప్రత్యేక పూజలు బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ పాల్గొని దుర్గాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# ఎడిటోరియల్

Editorial

## బొద్దింకల వేటలో రాహుల్ !

బొద్దింకలను బుట్టలో వేసుకోవడమెలా? ఇప్పుడు ఇదే ఆలోచనతో కాంగ్రెస్ అప్రకటిత అగ్రనేత రాహుల్ గాంధీ తన ప్రయత్నంలో తను ఉన్నారని చెప్పాలి. బొద్దింకలకు మద్దతుగా ఆయన కార్యక్రమాలు చేస్తున్నారు. నిజానికి ఈ బొద్దింకల వెనక కాంగ్రెస్ పార్టీ కూడా ఉందన్న టాక్ ఒకటి రాజధానిలో చక్కర్లు కొడుతోంది. మోడీని పడగొట్టాలంటే రాహుల్‌తో కావడం లేదు. ఆయన జనం దగ్గర పెద్దగా ప్రతిష్టను సంపాదించలేకపోయారు. యూపిఏ ప్రభుత్వం ఓడినప్పటి నుంచి నానా కష్టాలు పడ్డా లాభం లేకుండా పోతోంది. రాజ్యాంగం ప్రమాదంలో పడిందని, రిజర్వేషన్లు ఎత్తేస్తారని బాగా ప్రచారం చేయడంతో గత పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ కొంత పుంజుకుంది. అయితే ఇది రాహుల్ నాయకత్వాన్ని పుంజుకునేంతగా మాత్రం కాదు. ఇప్పుడు ఇటీవల దేశంలో ఓ కుదుపు కుదిపిన బొదింకలను బుట్టలో వేసుకునే ప్రయత్నం లో ఉన్నారు. వారి ఆందోళనకు మద్దతుగా పార్లమెంట్‌లో పోరాడుతున్నారు. అలాగే వారితో కలసి పని చేసేందుకు ఉత్సాహ పడుతున్నారు. ఇటీవల ఉద్యమంలో పాల్గొన్న కొందరు విద్యార్థులతో కలసి మీడియా ముందుకు వచ్చారు. ప్రయాగ్ రాజ్‌లో జెన్‌జీలతో కలసి ఆందోళనకు పిలుపునిచ్చారు. ఇవన్నీ కూడా ఓ క్రమపద్దతిలో మోడీని ఢీకొనేందుకు చేస్తున్న ప్రయత్నాలుగా గుర్తించాలి. తాజాగా రైతులు కూడా మళ్లీ రోడ్డెక్కబోతున్నారు. ఈ ఇద్దరిని కలిపితే వాలిలా తన బలం కూడా పెరుగుతుందని భావిస్తున్నట్లుగా ఉంది. ఇకపోతే ఇటీవల రాహుల్ తన ఆహార్యాన్ని కూడా మార్చారు. జీన్స్, టి షర్ట్‌తోనే ఎక్కువగా కనిపిస్తున్నారు. ఖద్దరు బట్టలను ఉత్తికి అవతల పడేశారు. యువతరం మనసులో ఏముందో గుర్తించి అందుకు అనుగుణంగా పార్టీ విధానాలు, నినాదాలను సవరించుకుంటేనే భవిష్యత్తు ఉంటుందని భావిస్తున్నారు. తమిళనాడు ఎన్నికల ఫలితందీనిని రుజువు చేస్తోంది. ఎన్నికలు రాగానే సరికొత్త సంక్షేమ పథకాలను ప్రకటించి ఓటర్లకు డబ్బు పంచితే చాలన్న భావన ఇప్పటివరకు ఉండేది. తమిళనాడు ఎన్నికలు ఇందుకు భిన్నంగా ఫలితాలను ఇచ్చాయి. టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ డబ్బు పంచకుండాఇ, పెద్దగా ప్రకటనలు చేయకుండా ద్రవిడ పార్టీలను దెబ్బతీసారు. తమిళనాడులో యువతను ఆకట్టుకోవడం ద్వారా విజయ్ అధికారంలోకి వచ్చారు. విజయ్ కూడా ద్రవిడ పార్టీలతో పోటీపడి సంక్షేమ పథకాలు ప్రకటించినా ప్రజలు వాటి గురించి పట్టించుకోలేదు. నిజానికి నేటి తరానికి చెందిన యువత కేవలం సంక్షేమ పథకాలను మాత్రమే కోరుకోవడం లేదు. ప్రభుత్వం లో జవాబుదారీతనం కోరుకుంటున్నారు. ఢిల్లీ నుంచి గల్లీ దాకా వివిధ స్థాయిల్లో జవాబుదారీతనం ఇప్పుడు లోపించింది. అధికార దుర్వినియోగం పెచ్చరిల్లింది. పాలకులు విలాసాలు పెరిగాయి. ప్రభుత్వాలలో ఏ స్థాయిలో కూడా జవాబుదారీతనం కనిపించడం లేదు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఏ ఒక్క ఫైలు కూడా దానంతట అది కదిలే పరిస్థితి లేదు. లంచం ఇవ్వనిదే కాగితం కదలని పరిస్థితి. ఈ కారణంగానే ఈ దేశ యువతలో ఆశలు, ఆకాంక్షలతో పాటు నిరాశా నిస్పృహలు చోటు చేసు కుంటున్నాయి. అందుకే అవకాశం రాగానే మార్పును ఆహ్వానిస్తున్నారు. పరీక్షా పేపర్ల లీక్ విషయంలో మోడీ ప్రభుత్వం నిర్లక్ష్యంగానే వ్యవహరించింది. తాము చేసే పనులే మంచివనే పరిస్థితికి మోడీ వచ్చేశారు. అందుకే ఆయన ప్రజల గుండెచప్పుడు వినలేకపోతున్నారు. జెన్‌జీ లంతా బొద్దింకల రూపంలో నిరసనలు తెలపడంతో కొంత సర్దుకున్నా, పూర్తిగా సర్దుకునేందుకు సిద్దం కావడం లేదు. దీన్ని అవకాశంగా తీసుకుని రాహుల్ దూకుడు ప్రదర్శిస్తున్నారు. అందుకే దేశంలోని రాజకీయ పార్టీలు బొద్దింకల పేరు ఎత్తగానే భయపడుతున్నాయి. నిన్నటి తరం ఆలోచనలతో, పాత చింతకాయ పచ్చడి విధానాలతో నడుస్తున్న పార్టీలకు ఎన్నికలలో నవతరం నుంచి ప్రతిఘటన ఎదురవుతోంది. యువతరంలో ఆశలు,ఆకాంక్షలు పెరుగుతున్న సమయంలోనే నిరాశా నిస్పృహలు కూడా వారిని కమ్మేస్తున్నాయి. బొద్దింకల ఢిల్లీ ఆందోళన ఇందుకు తాజా ఉదాహరణ. ఈ బొద్దింకలను పట్టేస్తే.. మనకు తిరుగు లేదని అందరూ ఆలోచన చేస్తున్నారు. రాహుల్ గాంధీ ఓ అడుగు ముందుకు వేసి వారికి మద్దతుగా పోరాట పంథా అవలంబిస్తున్నారు. పార్లమెంట్ లోపలా, బయటా ఇప్పుడు, విద్యార్థులు, యువత గురించి గట్టిగా మాట్లాడు తున్నారు. యవ తరంతో కనెక్ట్ కాని పార్టీలు మెల్లగా తెరమరుగవుతాయని గుర్తించారు. ప్రధాని మోదీ కూడా సామాజిక మాధ్యమాల్లో యువతరం వెలిబుచ్చుతున్న అభిప్రాయాలను ఎప్పటికప్పుడు తెలుసుకొని తదనుగుణంగా వ్యూహాలు రూపొందించుకోవాలని పార్టీ నాయకులకు దిశా నిర్దేశం చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ ఘావత్ కూడా ఇదే విషయాన్ని ప్రకటించారు. స్వాతంత్ర్య సంగ్రామాన్ని ముందుండి నడిపించిన కాంగ్రెస్ పార్టీ... ఆ తర్వాత దేశాన్ని సుదీర్ఘ కాలం పరిపాలించింది. తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ నుంచి లాల్‌బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ, పీవీ నరసింహారావు, మన్మోహన్‌సింగ్ కాంగ్రెస్ పార్టీ నుంచి ప్రధానమంత్రులుగా పనిచేశారు. కాంగ్రెస్ నాయకుల పెడ ధోరణులు కారణంగా నేటి తరానికి దూరం అయ్యారు. పార్టీని ఎప్పటికప్పుడు యువతతో కనెక్ట్ చేసుకునే పనిని కాంగ్రెస్ నాయకులు చేయలేదు. విధానాలను, ఆలోచనలను సవరించుకొని నవీకరించుకోవడం లేదు. డెబ్బై అయిదేళ్లు పైబడిన ప్రధాని నరేంద్ర మోదీ ఈ దేశం యువతతో కనెక్ట్ అవుతుం డగా... వయసులో చిన్నవాడైన రాహుల్‌గాంధీ యువతను ఆకట్టుకోలేకపోయారు. ఆల స్యంగా అయినా ఇప్పుడు రాహుల్ యువత గురించి ఆలోచిస్తున్నారు. అయితే బొద్దింకల పార్టీ రాజకీయాలకు దూరంగా ఉండాలని నిర్ణయించింది. కేవలం ప్రెజర్ గ్రూపుగా పనిచేస్తామని అభిజిత్ దీప్కే ప్రకటించారు. ఈ క్రమంలో రాహుల్ బుట్టలో పడతారా లేక సొంతగా తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తారా అన్నది ముమ్ముందు తేలనుంది. ఓ వైపు రాజ్యాంగం బుక్, మరోవైపు బొద్దింకల ఎజెండాతో ముందుకు సాగడం ద్వారా జాతీయ స్థాయిలో విజయం సాధించి అధికారం చేపట్టాలన్న లక్ష్యంతో రాహుల్ సాగుతున్నారు.

# వరుణ యాగం... వర్షాభిలాషకు వైదిక సంకల్పం

### ఆధ్యాత్మిక సంకల్పం... ఆయకట్టు సుభిక్షం: జల సిరుల కోసం వరుణ యాగం

వాన చినుకు కోసం నేల ఆత్రుతగా ఎదురు చూస్తోంది. ఆశల పల్లకి మోసే నల్లని మబ్బుల కోసం రైతు కళ్లు నిరంతరం ఆకాశాన్ని తిలకిస్తున్నాయి. పల్లెల్లోని చెరువులు, కుంటలు, వాగులు, వంకలు జలకళ కోసం నిరీక్షిస్తున్నాయి. విత్తిన విత్తనం మొలకెత్తి, పంట పొలాలు పచ్చదనం పరుచు కోవాలని, బావుల్లో జల మట్టాలు పెరగాలని, ప్రతి జలాశయమూ నిండుకుండలా తొణికిసలాడాలని తెలంగాణ గ్రామీణ సీమ నిండు మనసుతో కోరుకుంటోంది. ఈ ఏట వాతావరణంలో చోటుచేసుకున్న విచిత్ర పరిణామాలు, రుతుపవనాల ఆలస్యం కారణంగా రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఇటువంటి క్లిష్ట సమయంలో రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, నదులు పరవళ్లు తొక్కి, జలాశయాలు నిండిపోయి, రైతాంగం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ ప్రభుత్వం 'మహా వరుణ యాగానికి' శ్రీకారం చుట్టడం అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. ఆగస్టు 10న నల్గొండ–గుంటూరు జిల్లాల సరిహద్దులోని నాగార్జున సాగర్ డ్యామ్ తీరంలో ఉన్న విజయ విహార్ ప్రాంగణంలో ఈ మహా వైదిక క్రతువు నిర్వహణకు సర్వం సిద్ధమైంది. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రత్యేక నిర్ణయం మేరకు, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రత్యక్ష సారథ్యంలో ఈ బృహత్ కార్యక్రమం జరగనుంది. తెలంగాణ లోనే అత్యంత ప్రాచీన, ప్రసిద్ధ దివ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి చెందిన ప్రధాన అర్చకులు, లబ్ధప్రతిష్టులైన వేద పండితులు, ఋత్వికులు అత్యంత శాస్త్రోక్త విధానంలో ఈ యాగాన్ని నిర్వహించ నున్నారు.

ఈ మహా క్రతువుకు నాగార్జున సాగర్ వంటి ఆసియాలోనే అతి పెద్ద రాతి కట్టడమైన మహాజలాశయాన్ని వేదికగా ఎంచుకోవడంలో అంతర్లీనమైన ప్రతీకాత్మకత, సామాజిక ఆవశ్యకత స్పష్టంగా కనిపిస్తాయి. ఉమ్మడి నల్గొండ, గుంటూరు జిల్లాల సరిహద్దుల్లో కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ ప్రాజెక్టు తెలంగాణతో పాటు ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయానికి, కోట్లాది మంది తాగునీటి అవసరాలకు, జల విద్యుత్ ఉత్పత్తికి దశాబ్దాలుగా ప్రాణాధారంగా నిలుస్తోంది. కుడి, ఎడమ కాలువల ద్వారా సాగర్ జలాలు అందే ఆయకట్టు ప్రాంతాల్లో దాదాపు 20 లక్షల ఎకరాలకు పైగా వి విస్తీర్ణంలో వ్యవసాయం సాగవుతుంది. ఈ జలాశయం గరిష్ఠ నీటిమట్టం 590 అడుగులు కాగా, పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 312 టి.ఎం.సి లు. సాగర్ నీటితో కళకళలాడితేనే నాగార్జునసాగర్ ఆయకట్టు రైతుల్లో ధైర్యం పెరుగుతుంది, పల్లెలకు జీవం వస్తుంది, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చైతన్యవంత మవుతుంది. అందుకే ఈ సువిశాల జలరాశి తీరాన వరుణ యాగం నిర్వహించడం కేవలం ఒక ప్రార్థన మాత్రమే కాకుండా, సాగునీటి ప్రాధాన్యతను, జల వనరుల సంరక్షణను సమాజానికి చాటిచెప్పే ఒక చారిత్రక సందర్భంగా భావించాలి.

యాగం కోసం విజయ విహార్ ఆవరణలో వైదిక నియమాలకు అనుగుణంగా 11 హోమ కుండాలను ప్రత్యేకంగా నిర్మించారు. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ఆలయాలకు చెందిన 108 మంది వేద పండితులు, వైదిక శ్రేష్ఠులు సప్తశతి, రుద్ర, పవమాన, వరుణ సూక్త మంత్రోచ్ఛారణల మధ్య ఈ యాగాన్ని జరప నున్నారు. యాదాద్రి దేవస్థాన ఆస్థాన సిద్ధాంతి నిర్ణయించిన ముహూర్తానికి అనుగుణంగా ఆగస్టు 10న మధ్యాహ్నం 3.20 గంటల నుంచి 3.24 గంటల మధ్య అత్యంత పవిత్రమైన మహా పూర్ణాహుతి ఘట్టం జరగనుంది. ఈ క్రతువులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పలువురు మంత్రులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని ప్రత్యేక పూజలు సమర్పించ నున్నారు.

**వర్షాలు విస్తారంగా కురిసి, దుక్కి దుక్కికి నీరంది, తెలంగాణలోని కృష్ణా, గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లో చెరువులు, ప్రాజెక్టులు నిండాలని ఈ సందర్భంగా సంకల్పం పూననున్నారు.**



భారతీయ సనాతన సంస్కృతిలో జలానికి దైవిక స్థానం లభించింది. "ఆపో వై సర్వా దేవతాః" అంటే జలమే సమస్త దేవతా స్వరూపం అని వేదాలు చాటాయి. వేదకాలం నుంచే నీటిని సమస్త జీవకోటికి ఆయువు పట్టుగా భావించారు. ప్రకృతి శక్తులలో వరుణుడిని జలాధిపతిగా, విశ్వ నియమ సంరక్షకుడిగా ('రుతస్య గోపా') ఆరాధించే సంప్రదాయం మనది. "ఆపో హిష్ఠా మయోభువః" అంటూ కృష్ణ యజుర్వేదం జలాలను ఆనందాన్ని, ఆరోగ్యాన్ని, శ్రేయస్సును ప్రసాదించే అమృత తత్త్వంగా కీర్తించింది. వర్షపాతం క్షీణించినప్పుడు ప్రకృతి దేవతలను ప్రసన్నం చేసుకునేందుకు యజ్ఞయాగాదులు నిర్వహించడం ప్రాచీనకాలం నుంచి వస్తున్న ఆచారం. తెలుగువారి జానపద జీవనంలోనూ వర్షానికి విడదీయరాని సంబంధం ఉంది. "వాన కురిస్తే పంట... పంట పండితే పండుగ" అనే నానుడి రైతు అనుభవం లోంచి పుట్టిన సత్యం. "జలమే జగతికి జీవం" అనే ఆధునిక పర్యావరణ నినాదానికి మూలం మన ప్రాచీన సంస్కృతి లోనే ఉంది.

ప్రస్తుత పరిస్థితులను పరిశీలిస్తే, తెలంగాణ వ్యవసాయ రంగానికి సమకాలీన వాతావరణ సవాళ్లు స్పష్టంగా కనిపిస్తాయి. నైరుతి రుతుపవనాల కాలంలో (జూన్ నుంచి సెప్టెంబరు) లభించే వర్షపాతమే రాష్ట్ర వార్షిక సాగును నిర్ణయిస్తుంది. సాధారణంగా ఈ నాలుగు నెలల్లో తెలంగాణలో సగటున 730 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, రుతుపవనాల ప్రతికూలతల వల్ల కొన్ని జిల్లాల్లో తీవ్ర వర్షాభావం ఎదురవుతోంది. ఇది కేవలం పంట సాగునే కాక, భూగర్భ జల మట్టాల పతనానికి, చెరువులు ఇంకి పోవడానికి దారితీస్తుంది. విత్తనం వేసిన నాటి నుంచి కోత వరకు వర్షాలు క్రమం తప్పకుండా కురవకపోతే రైతు పెట్టిన పెట్టుబడి, విత్తనాలు, ఎరువుల ఖర్చులు బూడిదలో పోసిన పన్నీరవుతాయి.

రాష్ట్ర నీటిభద్రతకు వెన్నెముక లాంటి నాగార్జున సాగర్, శ్రీశైలం, నిజాం సాగర్, శ్రీరాం సాగర్, కాళేశ్వరం ప్రాజెక్టుల పరిధిలోని మిడ్ మానేరు, లోయర్ మానేరు, కొండపోచమ్మ సాగర్, మల్లన్న సాగర్ వంటి ప్రధాన జలాశయాలు నిండితేనే వ్యవసాయ భవిష్యత్తు సురక్షితంగా ఉంటుంది. వీటితో పాటు రాష్ట్రంలోని 40 వేలకు పైగా ఉన్న చిన్న, మధ్య తరహా చెరువుల పునరుద్ధరణ, కాలువల ఆధునికీకరణ, ఇంకుడు గుంతల నిర్మాణం, నీటిని పొదుపుగా వాడే సూక్ష్మ సేద్య పద్ధతులు మాత్రమే దీర్ఘకాలికంగా కరువు పరిస్థితులను నివారిస్తాయి. గతంలో కూడా వర్షాభావం ఏర్పడినప్పుడు యాదాద్రి క్షేత్రంలో వర్ష పాశుపత వరుణ యాగం నిర్వహించిన దాఖలాలు ఉన్నాయి. ఇప్పుడు నాగార్జున సాగర్ తీరంలో నిర్వహిస్తున్న ఈ మహా యాగం, ఆధ్యాత్మిక సంకల్పాన్ని ప్రజా శ్రేయస్సుతో అనుసంధానించే విస్తృత ప్రయత్నం.

అదే సమయంలో, వర్షపాతం అనేది రుతుపవనాల కదలికలు, అల్ప పీడనాలు, ఉపరితల ఆవర్తనాలు, సముద్ర ఉష్ణోగ్రతలు (ఎల్ నినో, లా నినా ప్రభావాలు) వంటి అనేక భౌతిక, వాతావరణ అంశాలపై ఆధారపడిన సంక్లిష్ట ప్రకృతి శాస్త్ర ప్రక్రియ అనే విషయాన్ని మనం స్మరించు కోవాలి. కాబట్టి వరుణ యాగాన్ని వాతావరణ శాస్త్రానికి ప్రత్యామ్నాయంగా చూడకుండా, మానవాళి సామూహిక సంకల్పానికి, ప్రకృతి పట్ల మనం వ్యక్తపరిచే వినయ విధేయతలకు ప్రతీకగా అర్థం చేసుకోవాలి. పర్యావరణ పరిరక్షణ, అడవుల పెంపకం వంటి సైంటిఫిక్ విధానాలతో పాటు ఆధ్యాత్మిక విశ్వాసాన్ని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడమే సంస్కారవంతమైన సమాజ లక్షణం.

ఒకవైపు యాగ వేదికపై వేద పండితుల మంత్ర ఘోషలు మార్మోగుతుంటే, మరోవైపు పొలంలో పచ్చని విత్తనం మొలకెత్తేందుకు రైతు ఆశగా ఆకాశం వైపు చూస్తున్నాడు. ఈ రెండింటి సంకల్పం ఒక్కటే---మబ్బులు కరిగి వర్షం కురవాలి, ఎండిన నేల తడవాలి, పంటలు సమృద్ధిగా పండాలి, రైతు బాగుపడాలి. తెలంగాణ పల్లెల్లో పచ్చని పైరులు హాయిగా గాలికి ఊగాలి. కృష్ణా, గోదావరి నదులు జీవజలాలతో ప్రవహించాలి. నిండిన ధాన్యపు రాశులతో రైతు ఇంట్లో లక్ష్మీదేవి తాండవించాలి. "పాడిపంటలతో పల్లెలు తుల తూగాలి" అన్న తెలుగువారి కల నెర వేరాలి. నిశ్చయంగా, సాగర్ తీరాన జరుగనున్న ఈ మహా వరుణ యాగం కేవలం ఒక క్రతువు మాత్రమే కాదు; వర్షం, నేల, నీరు, రైతు ఉనికి పరస్పరం ఎలా ముడిపడి ఉన్నాయో చాటిచెప్పే సామూహిక చైతన్య వేదిక. యాగం ద్వారా వ్యక్తమయ్యే భావన, వాన నీటిని పరిరక్షించే కార్యాచరణగా మారినప్పుడే నాగార్జున సాగర తీరం నుంచి వెలువడే ఈ వేద ప్రార్థన సార్థకమవుతుంది, పచ్చని తెలంగాణకు సువర్ణ బాటలు వేస్తుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**


## ఎడతెరిపి వర్షాలు

**రోడ్లు, డ్రైనేజీలు ఎందుకు ప్రతి ఏడాది విఫలమవుతున్నాయి?**

వర్షం ప్రకృతి వరం. కానీ అదే వర్షం ప్రతి ఏడాది ప్రజలకు శాపంగా మారుతుంటే, సమస్య ప్రకృతిలో కాదు... మన ప్రణాళికల్లో ఉందని అర్థం చేసుకోవాలి. తెలంగాణతో పాటు దేశంలోని అనేక ప్రాంతాల్లో కొద్ది గంటల వర్షానికే రోడ్లు చెరువులను తలపించడం, డ్రైనేజీలు పొంగిపొర్లడం, కాలనీలు జలమయం కావడం, వాహనదారులు నరకయాతన అనుభవించడం ఇప్పుడు సాధారణ దృశ్యాలుగా మారాయి. ప్రతి వర్షాకాలంలో ఇదే పరిస్థితి కనిపిస్తున్నా, శాశ్వత పరిష్కారం మాత్రం కనిపించడం లేదు. రోడ్ల నిర్మాణానికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నప్పటికీ, మొదటి భారీ వర్షానికే గుంతలు పడుతున్నాయి. కొత్తగా వేసిన రోడ్లు కూడా కొద్ది నెలల్లోనే దెబ్బతింటున్నాయి. దీనికి నాసిరకం నిర్మాణం, నాణ్యత నియంత్రణ లోపం, పనుల పర్యవేక్షణలో నిర్లక్ష్యం ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. ప్రజల పన్నుల డబ్బుతో నిర్మించే రహదారులు కనీసం కొన్ని సంవత్సరాలు మన్నికగా ఉండాలి. కానీ అనేక చోట్ల వర్షం పూర్తికాకముందే మరమ్మతులు చేయాల్సిన పరిస్థితి వస్తోంది. ఇంకోవైపు, పట్టణాల విస్తరణకు అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి చెందడం లేదు. దశాబ్దాల క్రితం రూపొందించిన మురుగునీటి కాలువలు నేటి జనాభా, భవనాల సంఖ్య, వర్షపాతం తీవ్రతను తట్టుకునే స్థితిలో లేవు. కాలువలపై ఆక్రమణలు, చెత్త పేరుకుపోవడం, వర్షాకాలానికి ముందే డీసిల్టింగ్ పనులు పూర్తికాకపోవడం వల్ల వర్షపు నీరు వెళ్లే మార్గాలు మూసుకుపోతున్నాయి. ఫలితంగా నీరు రోడ్లపై నిలిచి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది.

వాతావరణ మార్పుల ప్రభావంతో తక్కువ సమయంలో అధిక వర్షపాతం నమోదవుతోంది. దీనిని దృష్టిలో పెట్టుకుని పట్టణ ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరం ఉంది. "స్మార్ట్ సిటీలు" నిర్మించడం మాత్రమే కాదు, "స్మార్ట్ డ్రైనేజీ వ్యవస్థలు" కూడా నిర్మించాల్సిన సమయం ఆసన్నమైంది. ఆధునిక సాంకేతికతతో వర్షపు నీటి ప్రవాహాన్ని అంచనా వేసి, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలి. ప్రజల బాధ్యత కూడా తక్కువ కాదు. కాలువల్లో చెత్త వేయడం, వర్షపు నీటి మార్గాలను ఆక్రమించడం, ప్లాస్టిక్ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడేయడం వంటి చర్యలు సమస్యను మరింత తీవ్రం చేస్తున్నాయి. పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన పెరగాలి. స్థానిక సంస్థలతో కలిసి పరిసరాలను శుభ్రంగా ఉంచడం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత. ప్రతి ఏడాది వర్షాల తర్వాత గుంతలు పూడ్చడం, డ్రైనేజీలు శుభ్రం చేయడం తాత్కాలిక చర్యలే. అసలు అవసరం దీర్ఘకాలిక ప్రణాళిక, నాణ్యమైన నిర్మాణం, కఠిన పర్యవేక్షణ, బాధ్యతాయుత పరిపాలన. పనులు సరిగా చేయని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవడం, అధికారుల జవాబుదారీతనం పెంచడం కూడా అంతే ముఖ్యం. వర్షాలను మనం ఆపలేం... కానీ వర్షాల వల్ల కలిగే నష్టాలను మాత్రం తప్పకుండా తగ్గించవచ్చు. అందుకు రాజకీయ సంకల్పం, సమర్థవంతమైన ప్రణాళిక, నాణ్యతకు ప్రాధాన్యం, ప్రజల భాగస్వామ్యం ఈ నాలుగు కలిసివస్తేనే ప్రతి వర్షాకాలం ప్రజలకు భయంగా కాకుండా భరోసాగా మారుతుంది.

**ఉక్కల్ కర్ రాజేందర్ నాథ్**
**ఫ్రీలాన్స్ జర్నలిస్ట్**
**9440287170.**



# తెలంగాణలో ఆరోగ్య రంగం... మౌలికవసతులు

ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం ఆరోగ్యం అంటే వ్యాధి వైకల్యం లేకపోవడం ఒకటే కాదు వ్యక్తి సంపూర్ణ శారీరక మానసిక స్థితి కలిగి ఉండడం. సామాజికంగా సంపన్నంగా ఉండడం అని చెప్పవచ్చు. మానవ ఆరోగ్యం అనేది నిలకడగా ఉండే భావన కాదు. అసలే ఆరోగ్యంగా లేకపోవడం ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్వహించినట్లు అభిలషనీయం ఆరోగ్యం అనే సమస్యకు రెండు భిన్న ధ్రువాల మధ్య మారుతూ ఉంటుంది. ఆరోగ్యం అనేది సమస్యకు చికిత్స చూపడంతో పూర్తయ్యేదిగా భావించకూడదు. అనారోగ్య సమస్యలకు గురికాకుండా నివారణ విధానాలు చూపడం. ఆరోగ్య పరిరక్షణ పునరావాస కల్పనతో కూడుకున్నప్పుడే సంపూర్ణ ఆరోగ్య సాధన సాధ్యమవుతుంది.

ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచన: అత్యధిక ఆరోగ్య ప్రమాణాన్ని పొందడం ప్రతి వ్యక్తి ప్రాథమిక హక్కు అని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రీతిక స్పష్టం చేస్తుంది. ప్రతి మానవుడి ఆరోగ్య పరిరక్షణ ప్రభుత్వాల బాధ్యత. అలాంటి బాధ్యతను పూర్తి చేయడానికి అవసరమైన ఆరోగ్య సామాజికపరమైన చర్యలు చేపట్టాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొంది.

భారత్ లో వ్యాధుల స్వరూపం: భారత రాజ్యాంగం ఆరోగ్యాన్ని రాష్ట్రాల జాబితాలో చేర్చింది. అయితే అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల ప్రణాళిక రూపకల్పన మార్గదర్శనం సమన్వయం మొదలైన కార్యక్రమాలలో కేంద్ర ప్రభుత్వం క్రియాశీలక పాత్రను పోషిస్తుంది. ఈ కార్యక్రమాలను అమలు రాష్ట్రస్థాయిలో జరుగుతుంది. వ్యాధులు: వ్యాధులు జనాభా ఆరోగ్య సంబంధమైన అంశాలలో భారతదేశం పరిణామ దశలో ఉంది. సగటు జీవిత కాలం పెరిగింది. మారుతున్న ఆర్థిక సామాజిక మార్పుల మూలంగా వయస్సు మళ్ళిన వారిలో జీవన శైలిలో మార్పు కారణంగా వివిధ వయసుల వారిలో ముఖ్యంగా యువతలో



బహిర్గమవుతున్న వివిధ రకాల కొత్త వ్యాధులు ఆరోగ్య సంరక్షణ విధానాలను ప్రభావితం చేస్తున్నాయి. సవాళ్లు విసురుతున్నాయి అయినప్పటికీ సంక్రమిక వ్యాధులే ప్రధాన ప్రజారోగ్య సమస్యలుగా ఉన్నాయి. వ్యాధుల్లో ముఖ్యంగా సాంక్రమిక వ్యాధులు సాంక్రమికం కాని వ్యాధులని విభజించారు. అవి మలేరియా, బోదకాలు, కాలా అజార్, మెదడువాపు వ్యాధి, డెంగ్యూ వ్యాధి, చికెన్ గునియా, వ్యాధి తదితర వ్యాధులు సాంక్రమిక వ్యాధుల జాబితాలో ఉన్నాయి. సాంక్రమికం కానీ వ్యాధులు: దీర్ఘకాలిక వ్యవధి మందకోడి పురోగమనం కలిగి ఉండే వ్యాధులను సాంక్రమికం కానీ వ్యాధులు అంటారు. ప్రపంచంలో సంభవించే మరణాలకు సాంక్రమికం కానీ వ్యాధులే అతి ముఖ్యమైన కారణం. 2008వ సంవత్సరంలో ప్రపంచవ్యాప్తంగా 63% మరణాలు ఈ వ్యాధుల వలనే సంభవించాయి. గత కొన్ని శతాబ్దాలుగా భారతదేశంలో వ్యాధి భారం తీవ్రమైన మార్పు సంబంధించింది. 1990లో సాంక్రమికం, సాంక్రమికం కానీ వ్యాధుల భారం భారతదేశం యొక్క అనుపాతం 2020 కల్లా పూర్తి భిన్నంగా ఉంటుందని అంచనా. భారతదేశంలో ప్రస్తుతం ఎన్సీడీ వల్ల ఈ 53% మరణాలు సంభవిస్తున్నాయి. గుండె సంబంధమైన వ్యాధులు 24% దీర్ఘకాలిక శ్వాస సంబంధమైన వ్యాధులు 11% క్యాన్సర్ వ్యాధులు ఆరు శాతం మధుమేహ వ్యాధులు రెండు శాతం సంక్రమికం కానీ వ్యాధుల జాబితాలో ఉన్నాయి.

పొగతాగడం, పొగాకు తినడం, మద్యపానం: దీర్ఘకాలిక వ్యాధుల ద్వారా తీవ్రమైతున్న ప్రజారోగ్య సమస్యను దృష్టిలో ఉంచుకొని సాంక్రమిక వ్యాధులు జాతీయ సంస్థ ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ భారత వైద్య పరిశోధనా మండలి నేతృత్వంలో అధ్యయనం చేయడానికి భారత ప్రభుత్వం 2008లో ఒక సర్వే నిర్వహించింది. ఈ సర్వే ప్రకారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో రాష్ట్రస్థాయి గణాంకాల వివరాలు అందుబాటులో లేవు. 2012 మరియు 2013లో నిర్వహించిన నాలుగో విడత కుటుంబ సర్వేలో 15 సంవత్సరాల పైబడిన స్త్రీ పురుషుల వ్యక్తిగత అలవాట్లకు సంబంధించిన సమాచారం ప్రకారం తెలంగాణలో పురుషులలో 23% స్త్రీలలో 2.3 శాతం మందికి పొగ తాగే అలవాటు ఉంది. స్త్రీ పురుషులలో పొగ తాగే అలవాటు వరంగల్ జిల్లాలో అత్యధికంగా 33 శాతం, మెదక్ జిల్లాలో అత్యల్పంగా 19 శాతంగా ఉంది. వరంగల్ జిల్లా అత్యధికంగా 31 శాతం ఉంది ఖమ్మం జిల్లాలో అతి తక్కువ శాతంగా ఉంది. వారి కంటే మద్యపానం చేసేవారు తెలంగాణలో ఎక్కువగా ఉన్నారు. మద్యపానం తాగే అలవాటు వరంగల్ జిల్లాలో అత్యధికంగా 44 శాతం పురుషుల్లో అతి తక్కువగా మెదక్ జిల్లాలో స్త్రీలలో అతి తక్కువగా అదిలాబాద్ జిల్లాలో మద్యం సేవిస్తున్నారు.

ప్రభుత్వ చర్యలు: తెలంగాణలో వివిధ రకాల అనారోగ్యాల కంటే సాంక్రమికం కానీ వ్యాధుల చికిత్సకు అయ్యే ఖర్చు రెట్టింపు అవుతున్నందున వాటి వల్ల ఎదురయ్యే ఇబ్బందులను నివారించడానికి నియంత్రించడానికి ప్రభుత్వం ముఖ్యంగా తెలంగాణ ప్రభుత్వం పెద్ద ఎత్తున కృషి చేస్తుంది. ఈ వ్యాధుల భారం మరణాల రేటును తగ్గించడానికి అనేక వైద్య సౌకర్యాలు అందుబాటులోకి ఉంచింది. శక్తికి మించిన అప్పు చేయాల్సిన పరిస్థితులను తగ్గించడానికి భారతదేశంలో తగిన వ్యూహరచన జరగలేదు. వ్యవసాయ అభివృద్ధి పట్టణాల అభివృద్ధి తరంగాల విస్తరణ వివిధ రంగాల మధ్య పరస్పర సమన్వయం ద్వారా కలిగించినప్పుడే సానుకూల వాతావరణం సంభవించి వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన పెరిగి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించగలుగుతారు. అప్పుడే సంపూర్ణ ఆరోగ్య తెలంగాణ సంపూర్ణ ఆరోగ్య భారత్ సిద్ధిస్తుంది అనడంలో సందేహం లేదు.

**పందిరి: శ్రీనివాసులు.**
**ఎంఏ (జాగ్రఫీ) బీఈడీ, ఎంసీజే (జర్నలిజం)**
**పిజిడిసిజే (జర్నలిజం) ఉస్మానియా యూనివర్సిటీ.**



ప్రభాతనవ
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
ఆదివారం
09-8-2026

# సమాచార హక్కు చట్టం అమలుకు కమిటీ ఏర్పాటు చేయాలి



- జిల్లా కలెక్టర్‌కు సమాచార హక్కు చట్టం సాధన కమిటీ వినతి

**కరీంనగర్, ఆగస్టు 8(సింగిడి):** జిల్లాలో సమాచార హక్కు చట్టం--2005ను సమర్థవంతంగా అమలు చేసేందుకు జిల్లా స్థాయిలో సమాచార హక్కు కమిటీ ఏర్పాటు చేయాలని కోరుతూ సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కమిటీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి ఆదేశాల మేరకు జిల్లా కన్వీనర్ బండ నరేందర్, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు దాట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. జిల్లా స్థాయిలో పర్యవేక్షణ సభ్యుల వ్యవస్థను పునరుద్ధరించాలని, కలెక్టర్ కార్యాలయంలో సమాచార హక్కు సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజలకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించేందుకు విస్తృత కార్యక్రమాలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. సమాచార హక్కు చట్టం సాధన కమిటీకి అధికారిక ప్రాతినిధ్యం కల్పించి, రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్‌కు సిఫారసు చేయాలని కోరారు. చట్టంపై ప్రజల్లో పూర్తి అవగాహన లేనందున కమిటీకి సమాచార కమిషన్‌లో సభ్యత్వం కల్పిస్తే ప్రజలను మరింత చైతన్యపరచగలమని తెలిపారు. కార్యక్రమంలో తిరగమల్ల నాగార్జున, కుమారస్వామి, రాజు, ప్రసాద్, మహేందర్‌రెడ్డితో పాటు మండల, గ్రామ శాఖల అధ్యక్షులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఎస్ఆర్ ప్రైమ్ స్కూల్లో ఘనంగా బోనాలు



- అమ్మవారి, పోతురాజు వేషధారణల్లో విద్యార్థుల సందడి

**కరీంనగర్, ఆగస్టు8(సింగిడి):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల ఉత్సవాలను జ్యోతినగర్‌లోని ఎస్ఆర్ ప్రైమ్ స్కూల్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అమ్మవారి, పోతురాజు వేషధారణల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. డప్పుచప్పుళ్ల మధ్య విద్యార్థులు నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా జ్యోతినగర్‌లోని పోచమ్మ ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని విద్యార్థులకు తెలియజేయాలనే ఉద్దేశంతో వేడుకలను నిర్వహించినట్లు పాఠశాల నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రవీణ్‌రావు, మాజీ కార్పొరేటర్ గందె మాధవి, ఎస్ఆర్ పాఠశాలల డీజీఎం సచిన్, ప్రధానోపాధ్యాయురాలు నాగప్రణవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# జమ్మికుంట ఒకేషనల్ కళాశాలలో ఘనంగా బోనాల వేడుకలు



**జమ్మికుంట, ఆగస్టు 8(సింగిడి):** జమ్మికుంట ఒకేషనల్ కళాశాలలో తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక పరస్పరం ఆరాధన, సామరస్యంతో మన గౌరవానికి నిలువెత్తు నిదర్శనం బోనాల పండుగ ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో విద్యార్థిని విద్యార్థులు డీజే,భక్తి నృత్యాలతో విద్యార్థినిలు బోనాలు,పోతురాజుల వేషాధారణ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ షైక్ అబ్దుల్లా మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన కల్పించడం కూడా విద్యాసంస్థల బాధ్యత అని అన్నారు. తెలంగాణ బోనాల పండుగ మన సంస్కృతికి, గ్రామీణ జీవన విధానానికి అద్దం పడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో కళాశాల ప్రిన్సిపాల్ అన్నబోయిన రాజేందర్ అధ్యాపకులు, సమ్మయ్య, శ్రీవాణి, సతీష్, మౌనిక, కిషన్, మౌలిక, అనిల్ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలి

## బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జే కే



**జమ్మికుంట, ఆగస్టు 8 (సింగిడి):** ప్రైవేట్ పాఠశాలలు తమ ఫీజుల వివరాలను తప్పనిసరిగా బహిరంగంగా ప్రకటించే విధంగా తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని బిఆర్ఎస్వి రాష్ట్ర కార్యదర్శి జేకే ఒక ప్రకటనలో తెలిపారు. గత కొద్ది సంవత్సరాలుగా విద్యార్థులు, తల్లిదండ్రుల సమస్యలపై బిఆర్ఎస్వి విద్యార్థి విభాగం కొనసాగిస్తున్న నిరంతర పోరాటాలు, ప్రజాస్వామ్య బద్ధమైన శాంతియుత ఉద్యమాల ఫలితంగా ఫీజుల పారదర్శకత దిశగా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం తొలి అడుగుగా భావిస్తున్నామని వారు తెలిపారు. ఫీజుల వివరాలను ప్రదర్శించడం మాత్రమే సరిపోదని, ప్రైవేట్ పాఠశాలలు ఇష్టానుసారంగా ఫీజులు పెంచకుండా ప్రభుత్వం మరింత కఠినమైన చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లల విద్య కోసం భరించలేని స్థాయిలో ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితిని నివారించేందుకు తెలంగాణ అసెంబ్లీలో ప్రత్యేక "ఫీజుల నియంత్రణ క్రమబద్ధీకరణ బిల్లు" ప్రవేశపెట్టాలని కోరారు. విద్య హక్కు, వ్యాపారం కాదు. విద్యను వ్యాపారంగా మార్చి తల్లిదండ్రులపై అధిక ఆర్థిక భారాన్ని మోపడం అన్యాయమని వారు పేర్కొన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల వసూళ్లలో పూర్తి పారదర్శకత ఉండాలని, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను ఉల్లంఘించే పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫీజుల నియంత్రణకు సంబంధించి చేస్తున్న సూచనలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి అసెంబ్లీలో బలమైన చట్టాన్ని తీసుకురావాలని స్పష్టం చేశారు. విద్యా రంగంలో పారదర్శకత, జవాబుదారీతనం, సామాజిక న్యాయం కోసం ప్రభుత్వం మరింత ముందుకు రావాలని కోరారు. విద్యార్థులు, తల్లిదండ్రులకు న్యాయం జరిగే వరకు, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందుబాటులోకి వచ్చే వరకు, అధిక ఫీజుల భారం తగ్గే వరకు పోరాటం కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు.

# మంథని పీఎస్‌లో ఏసీపీ తనిఖీ



**మంథని,ఆగస్ట్ 08(సింగిడి):** మంథని పోలీస్ స్టేషన్‌ను గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్ శనివారం వార్షిక తనిఖీల్లో భాగంగా పరిశీలించారు. రికార్డులు, కేసు ఫైళ్లను తనిఖీ చేసి పెండింగ్ కేసులను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, నేరాల నివారణకు కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ బుద్దె స్వామి, ఎస్ఐ సందీప్ కుమార్ పాల్గొన్నారు.

# రాష్ట్ర నిధులతో అభివృద్ధి.. బీజేపీ ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా వుంది

- కరీంనగర్‌కు కేంద్రం నుంచి నిధులు తీసుకురావాలి
- సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



**కరీంనగర్, ఆగస్టు8(సింగిడి):** కరీంనగర్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులన్నీ కేంద్ర ప్రభుత్వ నిధులతోనే జరుగుతున్నట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా ఉందని సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. శనివారం కరీంనగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి నిధి కింద రూ. 50 కోట్ల రుణాన్ని రాష్ట్ర ప్రభుత్వమే తిరిగి చెల్లిస్తుందని, ఇందులో కేంద్రం వాటా లేదని తెలిపారు. పట్టణ సవాల్ నిధి కింద కరీంనగర్‌కు మంజూరైన రూ. 840 కోట్లలో రాష్ట్ర ప్రభుత్వం రూ. 210 కోట్లు, గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి సంస్థ రుణం కింద మరో రూ. 420 కోట్లను రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు. కేంద్రం 25 శాతం వాటాగా రూ. 210 కోట్లు మాత్రమే ఇస్తుందని పేర్కొన్నారు. స్మార్ట్ సిటీ మిగిలిన పనులకు అవసరమైన రూ. 140 కోట్లలో రాష్ట్రప్రభుత్వం రూ. 70 కోట్లు సమకూర్చిందని, కేంద్రం తన వాటా రూ. 70 కోట్లు విడుదల చేయలేదని ఆరోపించారు. ఈ అంశాలపై బండి సంజయ్ చర్చకు సిద్ధమా అని నరేందర్ రెడ్డి సవాల్ విసిరారు. సంబంధిత నిధుల మార్గదర్శకాల ప్రతులను ఆయనకు పోస్టు ద్వారా పంపిస్తానని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు కేంద్రం నుంచి కరీంనగర్‌కు మరిన్ని నిధులు తీసుకురావాలని, ముఖ్యంగా యువత, నిరుద్యోగులకు ఉపాధి కల్పించే ప్రాజెక్టులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొరివి అరుణ్ కుమార్, కార్పొరేటర్లు వరాల నర్సింగం, పర్వతం మల్లేశం, జగన్ రెడ్డి, నాయకులు పిట్టల రవీందర్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో ఆదిత్య మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఉచిత వైద్య సేవలు

బాలవికాస సేవలు అభినందనీయం
సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలి
వల్బాపూర్‌లో ఉచిత వైద్య శిబిరం





**జమ్మికుంట, ఆగస్టు 8 (సింగిడి):** వీణవంక మండలం వల్బాపూర్ గ్రామ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జమ్మికుంట ఆదిత్య అమృత మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సౌజన్యంతో శనివారం గ్రామపంచాయతీ ఆవరణలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ భరత్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ గ్రీష్మ మాట్లాడుతూ కార్బోహైడ్రేట్లు అధికంగా ఉండే ఆహార పదార్థాల వినియోగాన్ని తగ్గించి, పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. నిత్యం వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. జంక్ ఫుడ్ అధికంగా తీసుకోవడం వల్ల యువతలో ఊబకాయం పెరుగుతోందని, బరువును నియంత్రించుకోవడం ముఖ్యమని తెలిపారు. ఆదిత్య ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ ఎలుక దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ సమాజ సేవలో బాలవికాస సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. సంస్థ సహకారంతో పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఆదిత్య, అమృత ఆసుపత్రుల ఆధ్వర్యంలో గతంలో అనేక వైద్య శిబిరాలు నిర్వహించి ఉచిత పరీక్షలు, మందులు అందించామని, భవిష్యత్తులోనూ ఇటువంటి కార్యక్రమాల్లో పాల్గొని తమ వంతు సహకారం అందిస్తామని చెప్పారు. తమ స్వగ్రామమైన వల్బాపూర్ ప్రజలకు ఆసుపత్రిలో ఉచిత ఓపీ సేవలు అందిస్తామని హామీ ఇచ్చారు. జమ్మికుంట బాలవికాస సెంటర్ మేనేజర్ పబ్బు సులోచన మాట్లాడుతూ ప్రతి మహిళ ఆరోగ్యంపై అవగాహన పెంచుకుని ఇంటిని ఆరోగ్యానికి తొలి కేంద్రంగా మార్చాలని సూచించారు. బాలవికాస కార్యక్రమాలు నిర్వహిస్తున్న 14 సెంటర్ల పరిధిలోని 180 గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు సుమారు రూ. 2 కోట్ల విలువైన మందులను ఉచితంగా పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ఆయా సెంటర్ల పరిధిలోని దాతల సహకారంతో ఈ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలవికాస కోఆర్డినేటర్ స్వాతి, కరోబార్ రాజశేఖర్, పాలకవర్గ సభ్యులు, ఆదిత్య ఆసుపత్రి పీఆర్వోలు రఫిక్, శ్రీకాంత్, దుర్గాప్రసాద్, ఆసుపత్రి సిబ్బంది అనిల్‌రావు, మహేష్, శ్రావణ్, రంజిత్, పూజ, అనూష, శృతి తదితరులతో పాటు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జమ్మికుంటలో పిరియాడిక్ లేబర్ ఫోర్స్" సర్వే

సర్వేకు ప్రజలు సహకరించాలి
జిల్లా గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్



**జమ్మికుంట, ఆగస్టు 8 (నినాదం):** జాతీయ గణాంక శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే లో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని జమ్మికుంట పట్టణంలో సర్వే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఉమ్మడి జిల్లా గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, మేనేజర్, జి. రాజిరెడ్డి సర్కిల్ ఇన్స్పెక్టర్ సుధ గోని రామకృష్ణ గౌడ్ ని వారి కార్యాలయంలో కలిసి సర్వేకు సంబంధించిన కరపత్రాలను అందజేసి, సర్వే లక్ష్యాలు, ప్రాముఖ్యతను వివరించారు. దేశంలో ఉపాధి, నిరుద్యోగం, కార్మిక శక్తి భాగస్వామ్యం, స్వయం ఉపాధి తదితర అంశాలకు సంబంధించిన విశ్వసనీయ గణాంకాలను రూపొందించేందుకు ఈ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు .సర్వేలో మొదటి దశలో కుటుంబాల సాధారణ వివరాలను నమోదు చేసిన అనంతరం, ఎంపికైన కుటుంబాలను మూడు నెలల పాటు ప్రతి నెల ఒకసారి సందర్శించి మొబైల్ ట్యాబ్ ద్వారా సమాచారాన్ని సేకరిస్తామని తెలిపారు. కుటుంబ సభ్యుల విద్యార్హతలు, విద్యాభ్యాసం, వృత్తి విద్య, ఉద్యోగం, స్వయం ఉపాధి, రోజువారీ కూలి పనులు, పని చేసిన గంటలు, వేతన వివరాలు, మహిళల ఆదాయ వనరులు, అలాగే జొమాటో, స్విగ్గీ, రాపిడో, ఓలా, ఉబెర్ వంటి డిజిటల్ ప్లాట్ ఫారమ్‌ల ద్వారా పనిచేస్తున్న గిగ్ ప్లాట్ ఫారమ్ కార్మికుల వివరాలను కూడా నమోదు చేస్తామని పేర్కొన్నారు. ఈ సర్వే ద్వారా సేకరించిన సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంచ బడుతుందని, గణాంకాల రూపకల్పనకు మాత్రమే వినియోగిస్తామని తెలిపారు. ప్రజలు ఎలాంటి సందేహాలు లేకుండా సరైన సమాచారాన్ని అందించి సర్వే విజయవంతం కావడానికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ మాచర్ల రాజు గౌడ్ బిల్ కలెక్టర్ గుంటి సాయికృష్ణ మెప్మా సెక్షన్ సిబ్బంది బండి రజిత మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# తల్లిపాలు బిడ్డకు శ్రేష్టం

అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతాలు



**జమ్మికుంట, ఆగస్టు 8 (సింగిడి):** పుట్టిన ప్రతి బిడ్డకు తల్లిపాలు అత్యంత శ్రేష్టమైనవని శాయంపేట సర్పంచ్ సురేందర్రావు ఐసిడిఎస్ సూపర్వైజర్ రమాదేవి అన్నారు. జమ్మికుంట మండలంలోని శాయంపేట అంగన్వాడి కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన సర్పంచ్ సురేందర్ రావు మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించాలని, అవి బిడ్డ పెరుగుదలకు వ్యాధి నిరోధక శక్తిని పెంచడంలో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. తల్లిపాలలో పోషకపదార్థాలు ఉంటాయని ప్రతి ఒక్కరు నార్మల్ డెలివరీ అయిన సిజేరియన్ అయినప్పటికీ ముర్రుపాలు తాగించవచ్చునని పేర్కొన్నారు. అదేవిధంగా గర్భిణీ స్త్రీలకు శ్రీమంతాలు చేయడంతో పాటు పోషక పదార్థాలకు సంబంధించిన వాటిపై అవగాహన కల్పించారు. అనంతరం ఆరు నెలలు నిండిన వారికి అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఉదయశ్రీ, ఆశా వర్కర్లు ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణాపై రూరల్ పోలీసుల కొరడా

- ఐదు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం..
- అదుపులోకి ఐదుగురు నిందితులు



**కరీంనగర్, ఆగస్టు 8(సింగిడి):** కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమ ఇసుక రవాణాపై పోలీసులు దాడులు నిర్వహించి ఐదు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం గోపాల్‌పూర్, గుంటూరుపల్లి గ్రామాలతో పాటు బైపాస్‌లోని జియో పెట్రోల్ బంక్ సమీపంలో తనిఖీలు నిర్వహిస్తుండగా, అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను గుర్తించి పట్టుకున్నారు. నిందితులను బేథి సునీల్‌రెడ్డి, కొత్తూరి కుమార్, కొత్తూరి ఆంజనేయులు, పోస్టు గణేష్, గడిప్ర బాలయ్యగా గుర్తించారు. సుల్తానాబాద్ మండలం గొల్లపల్లి మానేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలించి కరీంనగర్‌లో అధిక ధరకు విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్లు విచారణలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. పంచుల సమక్షంలో పంచనామా నిర్వహించి ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని, నిందితులపై కేసులు నమోదు చేశారు. తదుపరి చట్టపరమైన చర్యల కోసం నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు వెల్లడించారు. గొల్లపల్లి మానేరు వాగు నుంచి అక్రమ ఇసుక రవాణాపై గతంలోనూ పలుమార్లు కేసులు నమోదు చేశామని, కొందరిపై చరిత్రపత్రాలు కూడా తెరిచామని పోలీసులు తెలిపారు. ఇకపై అక్రమ ఇసుక రవాణాను ఉపేక్షించబోమని కరీంనగర్ రూరల్ ఇన్‌స్పెక్టర్ ఏ. నిరంజన్‌రెడ్డి హెచ్చరించారు. పదేపదే నేరాలకు పాల్పడే వారిపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# నవోదయ దరఖాస్తులకు మరో ఛాన్స్!

దరఖాస్తు గడువు ఆగస్టు 10 వరకు పొడిగింపు
11, 12 తేదీల్లో దిద్దుబాట్లకు అవకాశం..



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, ఆగస్టు 8 (సింగిడి):** 2027-28 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశాల కోసం నిర్వహించే జవహర్ నవోదయ విద్యాలయ ఎంపిక పరీక్ష ఆన్‌లైన్ దరఖాస్తుల గడువును ఈ నెల 10వ తేదీ వరకు పొడిగించినట్లు ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల పీఎం శ్రీ జవహర్ నవోదయ విద్యాలయాల చొప్పదండి, మామునూరు ప్రిన్సిపాళ్లు బ్రహ్మానందరెడ్డి, ఎస్. ప్రవీణ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోలేకపోయిన అర్హులైన విద్యార్థులు ఆగస్టు 10లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసిన అనంతరం వివరాల్లో తప్పులు ఉన్నట్లయితే వాటిని సరిచేసుకునేందుకు ఆగస్టు 11, 12 తేదీల్లో ప్రత్యేక కరెక్షన్ విండో అందుబాటులో ఉంటుందని తెలిపారు. కరెక్షన్ విండోలో పరీక్ష మాధ్యమం, కేటగిరీ, లింగం, ప్రాంతం, దివ్యాంగత్వం తదితర ఐదు అంశాల్లో మాత్రమే మార్పులు చేసుకునే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నవోదయ విద్యాలయ సమితి, కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ పరిధిలో పనిచేసే స్వయంప్రతిపత్త సంస్థ ఆధ్వర్యంలో ఈ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాళ్లు పేర్కొన్నారు.

# బోర్లగూడెం కేంద్రంగా ఆదివాసీ మండలం ఏర్పాటు చేయాలి

5వ షెడ్యూల్ హక్కులు అమలు చేయాలి
నాయకపోడ్‌లను పీవీటీజీ జాబితాలో చేర్చాలి



**మహాముత్తారం, ఆగస్టు 8 (సింగిడి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం బోర్లగూడెం కేంద్రంగా ప్రత్యేక మండలం ఏర్పాటు చేసి ఆదివాసీ మండలంగా ప్రకటించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొలం రాజేందర్ డిమాండ్ చేశారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా బోర్లగూడెంలో సంఘం జెండాను ఆదివాసీ పెద్దమనిషి ఇనుముల సమ్మయ్య ఆవిష్కరించారు. ఆగస్టు 9న భూపాలపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవానికి జిల్లాలోని ఆదివాసీలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని రాజేందర్ పిలుపునిచ్చారు. నాయకపోడ్ తెగకు ప్రత్యేక గుర్తింపు కల్పించి పీవీటీజీ జాబితాలో చేర్చాలని, ఆదివాసీలకు 5వ షెడ్యూల్ హక్కులు వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో మేకల రాజు, మద్ద మనోజ్, గంప లక్ష్మణ్, ఎర్నేని సూరయ్య, బైరి కొమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభాతనవ సింగిడి ప్రతి రంగుల ఓ నిజం Singidi ఆదివారం 09-8-2026

# సాగునీటి ప్రాజెక్టులకు రూ.5 వేల కోట్ల నిధులు

**భూసేకరణ, పునరావాస పనుల్లో జాప్యం వద్దు**
**నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**



**కరీంనగర్, ఆగస్టు 8(సింగిడి):** రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి భూసేకరణ, పునరావాసం, అటవీ--పర్యావరణ అనుమతులు అడ్డంకిగా మారకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ మేరకు ప్రాజెక్టుల భూసేకరణ, పునరావాసం కోసం రూ. 5 వేల కోట్లను ప్రాధాన్యతతో సమకూర్చనున్నట్లు చెప్పారు. ఇప్పటికే రూ. 2 వేల కోట్లు విడుదల కాగా, మరో రూ. 3 వేల కోట్ల విడుదల ప్రక్రియ కొనసాగుతోందన్నారు. కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లోని సాగునీటి ప్రాజెక్టులపై శనివారం నిర్వహించిన సమీక్షలో మంత్రి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ప్రాజెక్టుల వారీగా అవసరమైన నిధుల ప్రతిపాదనలు వెంటనే పంపాలని, భూసేకరణ, పరిహారం, పునరావాస ప్రక్రియలను నిర్మాణ పనులతో సమాంతరంగా చేపట్టాలని సూచించారు.

**మిడ్‌మానేరు ఎడమ కాలువకు కదలిక..**

సుమారు నాలుగున్నరేళ్లుగా నిలిచిపోయిన మిడ్‌మానేరు ఎడమ కాలువ మిగులు పనులను వెంటనే ప్రారంభించాలని మంత్రి ఆదేశించారు. భూసంబంధిత సమస్యలను పరిష్కరించి, సవరించిన అంచనాలు, భూసేకరణ, టెండర్లు, అనుమతుల ప్రక్రియలను సమాంతరంగా పూర్తి చేయాలని సూచించారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలో ప్రతిపాదించిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి పత్తిపాక రిజర్వాయర్‌కు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికను ఆగస్టు నెలాఖరులోగా సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ ప్రాజెక్టు ద్వారా కొత్తగా 10 వేల ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు 2.40 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించ నున్నట్లు తెలిపారు.

**రోళ్లవాగు పనులకు వేగం..**

జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలంలోని రోళ్లవాగు ప్రాజెక్టు పనులు 96 శాతం పూర్తయ్యాయని మంత్రి తెలిపారు. మిగిలిన పనులకు అటవీ అనుమతులు వేగంగా పొందాలని ఆదేశించారు. ప్రాజెక్టు పూర్తయితే సుమారు 15 వేల ఎకరాలకు సాగునీటి ప్రయోజనం కలగనుంది. ప్రతి ప్రాజెక్టులో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, పునరావాసం, అటవీ, పర్యావరణ సమస్యలను ప్రత్యేకంగా నమోదు చేసి, వాటి పరిష్కారానికి బాధ్యులు, గడువును నిర్దేశించాలని మంత్రి సూచించారు. రైతులకు సాగునీరు అందించడంలో ఎలాంటి జాప్యం జరగకూడదని స్పష్టం చేశారు. సమీక్షలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఐటీ--పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## లక్ష్మీపురంలో ఉచిత వైద్య శిబిరం

- వందలాది మందికి వైద్య పరీక్షలు
- ఆదివాసీల ఆరోగ్యానికి భూక్య జంపన్న భరోసా
- ఉచిత మందుల పంపిణీ



**ములుగు జిల్లా ప్రతినిధి, ఆగస్టు 8 (సింగిడి):** గిరిజన ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ములుగు నియోజకవర్గ బీఆర్ఎస్ జిల్లా నాయకులు భూక్య జంపన్న ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలకు విశేష స్పందన లభిస్తోంది. ఇందులో భాగంగా శనివారం గోవిందరావుపేట మండలం లక్ష్మీపురం గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి లక్ష్మీపురంతో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. డాక్టర్ బోట్ల ప్రవీణ్ నేతృత్వంలో డాక్టర్ కావ్య, ఎండి సలీం తదితర వైద్యులు రక్తపోటు, మధుమేహం తదితర ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. రోగులకు అవసరమైన వైద్య సూచనలు అందించడంతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భూక్య జంపన్న మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతాల్లో వర్షాకాలంలో గిరిజనులు వివిధ వ్యాధుల బారిన పడుతున్న నేపథ్యంలో వారి ఆరోగ్య పరిరక్షణ కోసం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు విద్య, వైద్యం, ఉపాధి అందేలా కృషి చేయడం తన బాధ్యత అన్నారు. ప్రతి గ్రామపంచాయతీలో ఇలాంటి వైద్య శిబిరాలు నిర్వహించి గ్రామీణ, గిరిజన ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. వైద్య శిబిరానికి హాజరైన గ్రామస్తులు మాట్లాడుతూ.. ఉచిత వైద్య పరీక్షలు, మందుల పంపిణీతో ఎంతో ప్రయోజనం కలిగిందని తెలిపారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నిరంతరం సేవా కార్యక్రమాలు చేపడుతున్న భూక్య జంపన్నను అభినందించారు. మరిన్ని గ్రామాల్లో ఇలాంటి శిబిరాలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బోధం ముత్తయ్య, గాంధర్ల బాబు, సర్పంచ్ లకావత్ జుమ్మిలాల్, గ్రామ పార్టీ అధ్యక్షుడు జల్లెల కొమరయ్య, ఎండి అబ్దుల్ అజీజ్, గాంధర్ల మోహన్, ఈక రామారావు, సల్లూరి రామకృష్ణ, గాంధర్ల వెంకటేష్, గజ్జి కొమురయ్య, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు లకావత్ నరసింహ, గజ్జి ఎలేందర్, వార్డు మెంబర్ బక్క సరిత, భూక్య దేశోజి, పెట్టి రాజు, బాదావత్ రాజ్ కుమార్, అజ్మీర బిక్కు నాయక్, లకావత్ ప్రతాప్, శంకర్, వీరమల్లు హాస్పిటల్ పీఆర్ఓ సలీం తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి అండగా చిన్ననాటి స్నేహితులు



**కాల్వ శ్రీరాంపూర్ , ఆగస్ట్ 08(సింగిడి):** ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా కష్టాల్లో ఉన్న కుటుంబానికి భరోసాగా నిలుస్తున్న కాల్వ శ్రీరాంపూర్ జడ్పిహెచ్ఎస్ పూర్వ విద్యార్థులు మండలంలోని శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన పిల్లలమర్రి సదానందం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు తోటి స్నేహితులంతా కుటుంబ సభ్యులకు సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ఆర్థిక భరోసాగా నిలిచారు 1998 -99 సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు తలో కొంత పోగు చేసి 13 వేల రూపాయలను బ్యాంకులో సదానందం సునీత దంపతుల కూతురు మృదుల పేరు మీద ఫిక్స్ డిపాజిట్ చేసి బాండ్ పేపర్ ను శనివారం వారి స్వగృహంలో అందించారు అసలే నిరుపేద కుటుంబం కూలిపోయిన ఇల్లు గుంట భూమిలేని పేదవారిని ఆదుకునేందుకు స్నేహితులంతా ఒకటై మేమున్నాము అంటూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు ఇలాగే వారి స్నేహం కలకాలం ఉండాలని ఆపదలో ఉన్న కుటుంబాలకు మనోధైర్యం అందిస్తూ ఉండాలని వివిధ గ్రామాల ప్రజలు అన్నారు పరామర్శించిన వారిలో ఎండి రహీం, బంగారి నవీన్, ముస్కు అశోక్, కటకం శ్రీనివాస్, రాగుల వనమా చారి, మారుపాక ప్రవీణ్, మ్యాదరి సంపత్ తదితరులు ఉన్నారు.

### అల్లుడి వేధింపులు భరించలేక మామ ఆత్మహత్య



**జమ్మికుంట, ఆగస్టు 8 (సింగిడి):** తన కూతురు సుఖసంతోషాలతో ఉండాలని అత్తింటి వారు అడిగిన కట్న కానుకలతో కూతురి వివాహం చేసినప్పటికీ అదనపు కట్నం కావాలని అల్లుడు వేధింపులకు గురి చేయడంతో ఆ బాధ భరించలేక ఓ వ్యక్తి గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కరీంనగర్ జిల్లా వీణవంక మండలంలోని చల్లూరు గ్రామానికి చెందిన రామిడి సంజీవరెడ్డి (87) అనే వ్యక్తి తన కూతురు రజితను అదే గ్రామానికి చెందిన శ్రావణ్ కుమార్ గత 14 సంవత్సరాల క్రితం వివాహం జరిపించాడు. కట్నం గా ఒక ఎకరం 20 గుంటల భూమితో పాటు బంగారం కూడా ఇచ్చాడు. కొన్ని సంవత్సరాల తరువాత అల్లుడు శ్రావణ్ కుమార్ వేరే మహిళతో అక్రమ సంబంధం పెట్టుకుని తన కూతురు రజిత ను మానసికంగా శారీరకంగా హింసించడమే కాకుండా అదనపు కట్నం తేవాలని వేధింపులకు గురిచేశాడు. గత కొద్ది రోజుల క్రితం ఇదే విషయం పెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడి తన కూతురిని కాపురానికి తీసుకువెళ్లాలని ప్రాధేయ పడినప్పటికీ పట్టించుకోలేదు. దీంతో తన కూతురు జీవితం అల్లుడు వల్ల నాశనం అవుతుందని భావించి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా గమనించిన కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ కి తరలించారు. ఈ క్రమంలో శనివారం చికిత్స పొందుతూ మృతి చెందాడు తన భర్త మృతికి కారణమైన శ్రావణ్ కుమార్ మణెమ్మ మల్లారెడ్డి లపై చర్యలు తీసుకోవాలని మృతుడి భార్య వెంకటమ్మ వీణవంక పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆవుల తిరుపతి తెలిపారు.

# ఉమ్మడి కరీంనగర్ జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక సమీక్ష

**రామగుండం అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ప్రతిపాదనలు**



**గోదావరిఖని , ఆగస్టు08 (సింగిడి ):** ఉమ్మడి కరీంనగర్ జిల్లా అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. డా. బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో శనివారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో కొనసాగుతున్న, చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులపై ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ పాల్గొన్నారు. సమావేశంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో పాటు ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, చింతకుంట విజయరమణ రావు పాల్గొన్నారు. జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతి, కొత్తగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, రహదారులు, తాగునీరు, డ్రైనేజీ తదితర మౌలిక వసతులపై సమగ్రంగా చర్చించారు. రామగుండం నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులు, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, భవిష్యత్‌లో చేపట్టాల్సిన ప్రాధాన్యతా పనులను ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సమావేశంలో వివరించారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం అందించాలని కోరారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను వేగవంతం చేసి ఉమ్మడి కరీంనగర్ జిల్లాను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రులు పేర్కొన్నారు. సమావేశంలో రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామితో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# అంతర్రాష్ట్ర దొంగల ముఠాలో ఇద్దరి అరెస్ట్

**రేకుర్తి వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా పట్టుకున్న కొత్తపల్లి పోలీసులు**
**కొత్తపల్లి పోలీస్ స్టేషన్ అధికారి బిల్లా కోటేశ్వర్**



**కరీంనగర్, ఆగస్టు 8(సింగిడి):** కరీంనగర్‌లో దొంగతనాలకు పాల్పడేందుకు వచ్చిన మధ్యప్రదేశ్‌కు చెందిన అంతర్రాష్ట్ర దొంగల ముఠాలో ఇద్దరిని కొత్తపల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మరో ఇద్దరు నిందితులు పరారైనట్లు పోలీసులు తెలిపారు. కొత్తపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని రేకుర్తి ఐ ఆసుపత్రి కమాన్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. పోలీసుల వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌లోని థార్ జిల్లా, తాండా తాలూకాకు చెందిన నలుగురు సభ్యుల ముఠా కరీంనగర్‌కు చేరుకుని రేకుర్తి, మల్కాపూర్ ప్రాంతాల్లో దొంగతనాలకు ముందస్తుగా పరిశీలన చేస్తున్నట్లు గుర్తించారు. విచారణలో గత ఏడాది సంక్రాంతి సమయంలో చింతకుంట ప్రాంతంలో పలు దొంగతనాలకు పాల్పడినట్లు నిందితులు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. తిరిగి దొంగతనాలకు పాల్పడేందుకు కరీంనగర్ వచ్చినట్లు వెల్లడించినట్లు పేర్కొన్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కొత్తపల్లి పోలీస్ స్టేషన్ అధికారి బిల్లా కోటేశ్వర్ తెలిపారు. పరారైన మరో ఇద్దరి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. నిందితులను పట్టుకోవడంలో కృషి చేసిన ఎస్ఐ సాంబమూర్తి, కానిస్టేబుళ్లు శ్రీనాథ్, వెంకటేష్, మహేష్‌తో పాటు పోలీస్ సిబ్బందిని ఏసీపీ, సీఐ అభినందించారు.

## మంత్రి సీతక్కపై బురదజల్లడం తగదు

**కొత్తమల్లూరులో రోడ్ల సమస్యపై కాంగ్రెస్ నాయకుల పరిశీలన**



**ములుగు జిల్లా ప్రతినిధి, ఆగస్టు 8 (సింగిడి):** మంగపేట మండలం కొత్తమల్లూరు గ్రామంలో రోడ్ల దుస్థితిపై గ్రామస్తులు రోడ్డుపై నాట్లు వేసి నిరసన తెలిపిన విషయం తెలుసుకున్న మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెట్టుపెల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు శనివారం గ్రామాన్ని సందర్శించారు. రోడ్ల పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించి, సంబంధిత రోడ్డు వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ములుగు జిల్లాతో పాటు మంగపేట మండల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. మండలంలో స్థానిక పాలకవర్గాలు లేని పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని పంచాయతీరాజ్ శాఖ ద్వారా నిధులు కేటాయిస్తూ గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నారని పేర్కొన్నారు. కొత్తమల్లూరు గ్రామానికి రూ. 40 లక్షలు కేటాయించి సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపడుతోందన్నారు. అయితే కొందరు బీఆర్ఎస్ నాయకులు ప్రజా సమస్యలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుని మంత్రి సీతక్కపై బురదజల్లే ప్రయత్నం చేయడం సరికాదని విమర్శించారు.

# అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

- 1.83 కోట్ల అభివృద్ధి పనులకు కూన శ్రీశైలం గౌడ్ శంకుస్థాపన



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 8 (సింగిడి):** దుండిగల్ సర్కిల్ గండి మైసమ్మలో ఉన్న రాజరాజేశ్వర కాలనీ లో రూ. 90 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణం, రూ. 63 లక్షలతో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. శ్రీనివాస్ నగర్ కాలనీలో రూ. 30 లక్షలతో మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ మొత్తంగా రూ. 1.83 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులకు నేడు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తోందని ఆయన పేర్కొన్నారు. అభివృద్ధి పనులకు నిధులు కోరిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందని తెలిపారు. ఈ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు కావడానికి కృషి చేసిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబుకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేస్తోందని అర్హులైన ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సన్నబియ్యం పంపిణీ, ఉచిత విద్యుత్ తదితర పథకాల ద్వారా ప్రజలకు ప్రయోజనం కలుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ రాము గౌడ్, డిసిసి వైస్ ప్రెసిడెంట్ ముత్యం రెడ్డి, యాదవ రెడ్డి, దుండిగల్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లేష్ యాదవ్, సదానందం, తిరుపతి రెడ్డి, అధ్యక్షులు రాజిరెడ్డి, మోహన్ రెడ్డిలతో పాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంధకారంలో ఆటో కార్మికుల జీవితాలు

**భరోసా ఇస్తామన్నారు.. బాధ్యత మరిచారు!**
**ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలు ఇంకెప్పుడు అమలు చేస్తారు..?**



**ములుగు జిల్లా ప్రతినిధి, ఆగస్టు 8 (సింగిడి):** తెలంగాణ రాష్ట్రంలో ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్న మహాలక్ష్మి పథకం ఒకవైపు మహిళలకు ఊరటనిస్తుండగా.. మరోవైపు ఆటో కార్మికుల జీవనోపాధిపై ప్రభావం చూపుతోందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికుల సంఖ్య తగ్గడంతో ఆదాయం పడిపోయి, ఆటో డ్రైవర్లు, వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోతున్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో, క్యాబ్, టాక్సీ డ్రైవర్ల సంక్షేమానికి పలు హామీలు ఇచ్చిందని బీఆర్ఎస్ యువ నేత జై భీమ్ రామ్మోహన్ గుర్తుచేశారు. ప్రతి ఆటో డ్రైవర్‌కు ఏటా రూ. 12 వేల ఆర్థిక సహాయం, ప్రత్యేక ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు, మహాలక్ష్మి ఉచిత బస్సు పథకం వల్ల కలిగే ఆదాయ నష్టానికి ఉపశమన చర్యలు, పెండింగ్ చలాన్లలో రాయితీలు, లైసెన్స్ రెన్యువల్, వాహన ఫిట్‌నెస్ ప్రక్రియలను సులభతరం చేస్తామని హామీలు ఇచ్చారని తెలిపారు. అయితే హామీలు ఇచ్చి గడువు గడుస్తున్నా వాటి అమలుపై స్పష్టత లేకపోవడంతో ఆటో కార్మికులు నిరాశకు గురవుతున్నారని అన్నారు. రోజువారీ సంపాదనపైనే ఆధారపడి జీవించే ఆటో కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఎన్నికల హామీలను సత్వరమే అమలు చేసి ఆటో కార్మికుల జీవితాలకు ఆర్థిక భరోసా కల్పించాలని జై భీమ్ రామ్మోహన్ డిమాండ్ చేశారు.

## వరుస చోరీలకు పాల్పడుతున్న నిందితుడు అరెస్ట్



**మంథని, ఆగస్ట్ 08(సింగిడి):** తాళం వేసి ఉన్న ఇళ్లను పగటిపూట రెక్కీ చేసి, రాత్రివేళ తాళాలు పగులగొట్టి బంగారం, నగదు దొంగిలిస్తున్న ప్రధాన నిందితుడు వనం రాము (36)ను మంథని సీఐ బి. స్వామి ఆధ్వర్యంలోని ప్రత్యేక బృందం, రామగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద బటన్ కత్తిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల విచారణలో కల్వచర్ల, ఓడేడు, ముత్తారం, ధర్మారం, రత్నాపురం, జూలపల్లి తదితర ప్రాంతాల్లో పలు చోరీలకు పాల్పడినట్లు వెల్లడైనట్లు ఏసీపీ ఎం. రమేష్ తెలిపారు. దొంగిలించిన బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టడం, విక్రయించడం ద్వారా వచ్చిన నగదును ఖర్చు చేసినట్లు పోలీసులు తెలిపారు. కేసులో ఇతర నిందితుల పాత్ర, దొంగిలించిన ఆస్తుల రికవరీపై దర్యాప్తు కొనసాగుతోంది.

## ఘనంగా బ్లూ క్రాస్ వార్షిక రేబీస్ నివారణ టీకాలు



**రాజేంద్రనగర్, ఆగస్టు 8 (సింగిడి):** నార్సింగి సర్కిల్ మణికొండ వివేకనంద పార్కు ప్రాంతంలో బ్లూ క్రాస్ ఆఫ్ హైదరాబాద్ సంస్థ ఆధ్వర్యంలో వార్షిక రేబీస్ నివారణ వ్యాక్సినేషన్ డ్రైవ్ శనివారం ఘనంగా నిర్వహించారు. "రేబీస్ రహిత తెలంగాణ" సాధనలో భాగంగా మణికొండలో వరుసగా 5వ సంవత్సరం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా బ్లూ క్రాస్ ఆఫ్ హైదరాబాద్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కుమారి మాట్లాడుతూ ఈ డ్రైవ్‌లో డాగ్ క్యాచర్స్, పారావెట్స్, వాలంటీర్లతో కూడిన 30 మంది సభ్యుల 3 ప్రత్యేక వాహనాల సహాయంతో ఈ ఉచిత వ్యాక్సినేషన్ డ్రైవ్ ఒకే రోజు 700కి పైగా వీధి కుక్కలకు యాంటీ-రేబీస్ టీకాలు వేయించమన్నారు. రేబీస్ నివారణతో పాటు వీధి కుక్కల సంతాన నిరోధక శస్త్ర చికిత్సలపై ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు.

# పరిగి నియోజకవర్గంలో సర్ ప్రక్రియ విజయవంతం



**వికారాబాద్, ఆగస్టు 8 (సింగిడి):** పరిగి నియోజకవర్గం లో సర్ ప్రక్రియ విజయవంతం చేశామని 99 శాతం పూర్తికాగా మరో రెండు రోజుల్లో 100 శాతం పూర్తి చేయనున్నట్లు టీ పి సీ సీ జనరల్ సెక్రటరీ, పరిగి నియోజకవర్గ సర్ ఇన్‌చార్జ్ జంగా రెడ్డి తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో సర్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్, పరిగి ఎమ్మెల్యే డా. టి. రామ్మోహన్ రెడ్డి రాష్ట్ర స్థాయిలో కీలక బాధ్యతలు నిర్వహిస్తూ, కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు సర్ పై అవగాహన, శిక్షణ, మార్గదర్శకత్వం అందిస్తున్నారని ఆయన మార్గదర్శకత్వంలో పరిగి నియోజకవర్గంలో సర్ ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సమన్వయంతో విజయవంతంగా నిర్వహిస్తున్నాయని టీపీసీసీ జనరల్ సెక్రటరీ, పరిగి నియోజకవర్గ సర్ ఇన్‌చార్జ్ జంగా రెడ్డి తెలిపారు. పరిగి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో జంగా రెడ్డి మాట్లాడుతూ పరిగి నియోజకవర్గంలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (సర్ ) ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తున్నామని తెలిపారు. డా. టి. రామ్మోహన్ రెడ్డి టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్‌గా తెలంగాణ రాష్ట్ర స్థాయిలో సర్ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, బీ ఎలా వో లకు అవసరమైన మార్గదర్శకత్వం అందిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఆయన అందిస్తున్న శిక్షణ, సూచనలు, మార్గదర్శకత్వం వల్ల క్షేత్రస్థాయిలో సర్ ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు వీలు కలుగుతోందన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో సర్ ప్రక్రియను ప్రత్యేక దృష్టితో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో 99 శాతం సర్ ప్రక్రియ పూర్తయిందని, మిగిలిన ప్రక్రియను కూడా రాబోయే రెండు రోజుల్లో 100 శాతం పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. నియోజక వర్గంలోని ప్రతి బూత్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బీఎల్‌వోలు సమన్వయంతో పనిచేస్తూ ఓటర్లను సంప్రదిస్తున్నారని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణతో పాటు సర్ ప్రక్రియపై ఓటర్లకు అవసరమైన అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ఎన్యూమరేషన్ ఫారాలు ఇవ్వని వారు వెంటనే సమర్పించాలని అన్నారు. ప్రతి కుటుంబం తమ కుటుంబ సభ్యుల ఓటరు వివరాలను పరిశీలించుకోవాలని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఓటు హక్కు మన హక్కు మాత్రమే కాదని మన బాధ్యత కూడాఅని అన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూసుకోవాలి. ఈ కార్యక్రమంలో పరిగి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు వెంకటరాములు, మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాం రెడ్డి, పి ఏ సీ ఎస్ వైస్ చైర్మన్, మున్సిపల్ చైర్మన్ రజిత వెంకటేష్, రాజపుల్లారెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి




**గోదావరిఖని,ఆగస్ట్ 08(సింగిడి):** అంతర్గాం మండలం పెద్దంపేటలో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. డబ్బులు పందెంగా పెట్టి మూడు ముక్కల పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 14,730 నగదు, 52 పేకముక్కలు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి తదుపరి చర్యల కోసం నిందితులను అంతర్గాం పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు.



# ఖరీదైన ఫేస్ వాష్‌లకు గుడ్ బై చెప్పండి..

## వంటగదిలోని ఈ వస్తువులతో మీ ముఖాన్ని తాజాగా మార్చుకోండిలా!

పూర్వీకులు చర్మ సంరక్షణ కోసం సహజ పదార్థాలనే నమ్ముకున్నారు. నేటి తరం వారు ప్రకటనల ప్రభావంతో రసాయన ఉత్పత్తుల వైపు వెళు_న్నారు, కానీ ఇవి చర్మాన్ని నిర్జీవంగా మారుస్తాయి. ఆరోగ్య నివేదికల ప్రకారం, శనగపిండి పెరుగు కలయిక చర్మాన్ని శుభ్రపరచడమే కాకుండా సహజమైన స్క్రబ్‌లా పనిచేసి మృతకణాలను తొలగిస్తుంది. ఈ ఫేస్ వాష్ తయారీకి అయ్యే ఖర్చు చాలా తక్కువ దీని ఫలితాలు మాత్రం దీర్ఘకాలం పాటు అద్భుతంగా ఉంటాయి



వాడే పదార్థాలు..
శనగపిండి (2 టీస్పూన్లు): ఇది చర్మ రంధ్రాల్లోని మురికిని తొలగించి, అధిక నూనెను నియంత్రించడంలో సహాయపడుతుంది.

పెరుగు (1 టీస్పూన్): పెరుగులోని లాక్టిక్ యాసిడ్ చర్మాన్ని మృదువుగా చేసి, సహజమైన మాయిశ్చరైజర్‌లా పనిచేస్తుంది.

పసుపు (చిటికెడు): పసుపులోని యాంటీ సెప్టిక్ గుణాలు మొటిమలను నివారించి చర్మానికి మంచి రంగును ఇస్తాయి.

రోజ్ వాటర్ (కొద్దిగా): ఇది చర్మాన్ని తాజాగా ఉంచి, సహజమైన టోనర్‌లా పనిచేస్తుంది.

తయారీ విధానం:
ఒక శుభ్రమైన గిన్నె తీసుకుని అందులో శనగపిండి పెరుగు వేసి బాగా కలపండి. ఆ తర్వాత చిటికెడు పసుపు సరిపడా రోజ్ వాటర్ కలిపి మెత్తని పేస్ట్‌లా తయారు చేయండి. ఈ మిశ్రమం మరీ చిక్కగా లేదా మరీ పల్చగా ఉండకూడదు.

ఉపయోగించే సరైన పద్ధతి:
సిద్ధం చేసుకున్న పేస్ట్‌ను మీ ముఖానికి రాసుకుని 1 నుండి 2 నిమిషాల పాటు సున్నితంగా మసాజ్ చేయండి. దీనివల్ల చర్మం లోతుగా శుభ్రపడుతుంది. ఆ తర్వాత చల్లని నీటితో ముఖాన్ని కడిగి, పొడి టవల్‌తో మెల్లగా తట్టండి. ఈ ఫేస్ వాష్‌ను ప్రతిరోజూ లేదా వారానికి 3-4 సార్లు ఉపయోగించవచ్చు. ముఖ్యంగా వేసవిలో ఇది చర్మానికి మంచి చల్లదనాన్ని అందిస్తుంది.

ఇంట్లో తయారు చేసుకునే ఈ ఫేస్ వాష్ చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి ఒక గొప్ప మార్గం. రసాయన ఉత్పత్తుల భయం లేకుండా దీనిని వాడవచ్చు. క్రమం తప్పకుండా ఉపయోగించడం వల్ల చర్మంపై మచ్చలు తగ్గి, ముఖం కాంతివంతంగా మారుతుంది.



### వేతన పరిమితి రూ.25000కి పెంచితే..

# చేతికి వచ్చే జీతం తగ్గుతుందా?

## పెన్షన్ పరిస్థితి ఏంటి?

ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ వేతన పరిమితిని రూ. 25000 లకు పెంచాలన్న ప్రతి పాదనకు ఆర్థిక శాఖ ఆమోదం తెలిపి కేంద్ర కేబినెట్ ఆమోదం కోసం పంపించినట్లు వార్తలు వస్తున్నాయి. అయితే, ఉద్యోగుల వేతన పరిమితి పెంచితే చేతికి వచ్చే జీతం తగ్గుతుందా ? ఈపీఎస్ పెన్షన్ ఎంత మేర పెరగవచ్చు ? ఉద్యోగులకు కలిగే లాభాలు ఏంటి ? ఈ కథనం ద్వారా అర్థం చేసుకునే ప్రయత్నం చేద్దాం.

**ఈపీఎఫ్ వేతన పరిమితి రూ. 2500లకు పెంపు**

ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం, ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఙూఖీూ) నుంచి త్వరలోనే పెద్ద శుభవార్త అందే అవకాశం ఉంది. ఉద్యోగుల పెన్షన్ పథకం ఈపీఎస్ కింద వర్తించే కనీస వేతన పరిమితిని ప్రస్తుతం ఉన్న రూ. 15000 నుంచి రూ. 25000లకు పెంచేందుకు కసరత్తు జరుగుతోంది. ఇప్పటికీ ఈ ప్రతిపాదనకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపి కేబినేట్ ఆమోదం కోసం పంపించినట్లు సమాచారం. ఒక వేళ ఈ నిర్ణయం అమలులోకి వస్తే ఉద్యోగులు రిటైర్మెంట్ తర్వాత పొందే నెలవారీ పెన్షన్ భారీగా పెరిగే అవకాశం ఉంది. ఈ వేతన పరిమితి పెంపు వల్ల పెన్షన్ లెక్కలు ఎలా మారతాయి? నెలకు ఎంత పెన్షన్ పెరిగే అవకాశం ఉంది? మీ చేతికి వచ్చే జీతం, పీఎఫ్ లంప్ సమ్ ఫండ్ పై దీని ప్రాభావం ఎలా ఉంటుంది? పూర్తి వివరాలు తెలుసుకుందాం.

**పెన్షన్ ఎలా లెక్కిస్తారు?**

ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ నిబంధనల ప్రకారం నెలవారీ పీఎఫ్ పెన్షన్‌ను ప్రత్యేక ఫార్ములా ద్వారా లెక్కిస్తారు. నెలవారీ పెన్షన్= (పెన్షనబుల్ జీతం శ మొత్తం సర్వీస్)/ 70 అనే ఫార్ములా ఉపయోగిస్తారు. ఇక్కడ పెన్షనబుల్ జీతం అంటే ఉద్యోగి రిటైర్ అవ్వడానికి ముందు చివరి 60 నెలల సగటు బేసిక్ పే ప్లస్ డీఏ. ప్రస్తుతం ఈ పెన్షనబుల్ జీతం గరిష్ఠ పరిమితి రూ. 15000గా ఉంది.


రూ. 25000లకు పెంచితే వచ్చే మార్పులు ఇవే
వేతన పరిమితి రూ. 25000లకు పెరిగితే పెన్షన్ మొత్తంలో దాదాపు 67 శాతం పెరుగుదల ఉండే అవకాశం ఉంది. యజమాని జమ చేసే ఈపీఎశ్ వాటా (8.33 శాతం) ప్రకారం ప్రస్తుతం నెలకు రూ. 1250 ఉండగా కొత్త రూల్స్ వస్తే నెలకు రూ. 2083 అవుతుంది. ఈపీఎస్ పెన్షన్‌కు అదనంగా రూ. 833 వెళ్తుంది. గరిష్ఠ నెలవారీ పెన్షన్ (35 ఏళ్ల సర్వీస్ ఉంటే) ప్రస్తుత నిబంధనల ప్రకారం నెలకు రూ. 7500 వస్తుంది. అదే కొత్త రూల్స్ వస్తే రూ. 12,500 నెలకు అందుతాయి. అంటే అదనంగా రూ. 5000 చొప్పిన పెన్షన్ లభిస్తుంది.

**ఉద్యోగులకు కలిగే లాభాలు ఇవే**

రిటైర్మెంట్ తర్వాత స్థిరమైన ఆదాయం కోరుకునే వారికి ఇది గొప్ప ప్రయోజనం కలిగిస్తుంది. ఇప్పటి వరకు గరిష్ఠంగా రూ. 7500 మాత్రమే వచ్చే పెన్షన్, కొత్త నిబంధనతో గరిష్ఠంగా రూ. 12,500 వరకు పెరిగే అవకాశం ఉంది. యాజమాని చెల్లించే 12 శాతం కాంట్రిబ్యూషన్‌లో పెన్షన్ ఫండ్ కి ఎక్కువ భాగం రూ. 2083 వెళ్లడంతో పీఎఫ్ ఖాతాలో జమ అయ్యే మొత్తం దాదాపు రూ. 1167 వరకు తగ్గుతుంది. దీనివల్ల రిటైర్మెంట్ సమయంలో ఒకేసారి చేతికి వచ్చే లంప్ సమ్ ఫండ్ కాస్త తగ్గవచ్చు. కానీస ప్రతి నెలా వచ్చే గ్యారెంటీ పెన్షన్ పెరుగుతుంది. ప్రస్తుతం పీఎఫ్ వేతన పరిమితి రూ. 15000గా ఉండగా ఉద్యోగి జీతం నుంచి నెల నెలా గరిష్ఠంగా 12 శాతం చొప్పున రూ. 1800 పీఎఫ్ ఖాతాకు జమ చేయాల్సి ఉంటుంది. అయితే, రూ. 25000లకు పెంచితే ఇది రూ. 3000లకు పెరుగుతుంది. అంటే చేతికి వచ్చే జీతం తగ్గే అవకాశం ఉంది. అయితే, యాజమాన్యం కాంట్రిబ్యూషన్ పెరుగుతుంది కాబట్టి ఓవరాల్ గా చూసుకుంటే ప్రయోజనక రమేనని చెప్పవచ్చు.

### ఐటీఆర్ ఫైల్ చేసిన వారికి..

# వాట్సప్‌లో ట్యాక్స్ నోటీసులు




## మీకూ వస్తే ఏం చేయాలంటే?

ఆదాయపు పన్ను రిటర్నులు ఫైల్ చేసిన వారికి ఐటీ శాఖ వివిధ రకాల నోటీసులు పంపిస్తుంది. ప్రతిదానికీ కంగారు పడాల్సిన పని లేదు. అయితే, ప్రస్తుతం వాట్సప్ ద్వారా నోటీసులు వస్తున్నాయి. ఇలా మీకూ వాట్సప్‌లో నోటీసులు వస్తే తస్మాత్ జాగ్రత్త. అవి సైబర్ నేరగాళ్ల పని అయి ఉంటుంది. ఆదాయపు పన్ను శాఖ ఇలా వాట్సప్ ద్వారా నోటీసులు పంపించదు. మరి మీకూ ఇలా నోటీసు వస్తే ఏం చేయాలి అనే వివరాలు తెలుసుకుందాం.

ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్నులు ఫైల్ చేసి రీఫండ్ కోసం ఎదురుచూస్తున్నారా? ఈ క్రమంలోనే మీకు వాట్సప్ ద్వారా ఆదాయపు పన్ను విభాగం నుంచి నోటీసు వచ్చిందా? అయితే అలర్ట్. ఇలా వాట్సప్ ద్వారా ఐటీ నోటీసు వచ్చినట్లయితే ఆందోళన చెందకుండా అది ఎక్కడి నుంచి వచ్చిందో పరిశీలించాలి. అందులో ఉండే ఎలాంటి లింకుల పై క్లిక్ చేయకండి. పొరపాటున క్లిక్ చేశారో సైబర్ నేరగాళ్ల వలకు చిక్కినట్లే. ప్రస్తుతం ఐటీఆర్ ఫైలింగ్ సీజన్ (ఞ= ఖీఅశ్రీఅఅస్త్రూముంశీఅ) కావడంతో సైబర్ నేరగాళ్లు కొత్త ఎత్తుగడలు వేస్తూ ట్యాక్స్ చెల్లించే వారిని మోసగించే ప్రయత్నం చేస్తున్నారు. అందుకు సంబంధించిన వివరాలు తెలుసుకుందాం. ఇప్పటికే ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్నులు ఫైల్ చేసిన వారు, రిటర్నులు దాఖలు చేయాల్సిన వారే లక్ష్యంగా వారి వాట్సప్‌కి లేదా ఇతర మెసేజింగ్ వేదికల ద్వారా సందేశాలు పంపిస్తున్నారు. ట్యాక్స్ రీఫండ్ల కోసం ఎదురుచూస్తున్నవారు, డెడ్‌లైన్ దాటినా రిటర్నులు ఫైల్ చేయని వారు తమకు నోటీసు వచ్చిందేమోనన్న భయంతో వాట్సప్ ద్వారా వచ్చిన లింకులను క్లిక్ చేసే అవకాశం ఉంటుంది. ఇదే అదునుగా తీసుకున్న సైబర్ నేరగాళ్లు వాట్సప్ ద్వారా ట్యాక్స్ నోటీసులు అంటూ ఈ మార్గాన్ని ఎంచుకుంటున్నట్లు సైబర్ నిపుణులు చెబుతున్నారు. ఆదాయపు పన్ను శాఖ ఎంబ్లమ్‌తో కూడిన డీపీతో, గుర్తు తెలియని వాట్సప్ నంబర్ నుంచి ఇలాంటి నోటీసులు పంపిస్తున్నారు రిటర్నుల్లో తప్పుడు సమాచారం నమోదు చేశారని, లేదా ఏదైనా ఇతర కారణం చెబుతూ భయ పెట్టే ప్రయత్నం చేస్తుంటారు. దీనిపై స్పందించేందుకు జిప్ లేదా . వఞవ ఫైల్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచిస్తారు. అలా వచ్చిన ఫైల్ పై క్లిక్ చేస్తే మీ ఫోన్లో మాల్‌వేర్ మీకు తెలియకుండానే చేరుతుంది. మీకు వచ్చే ఎస్ఎంఎస్‌లు, ఓటీపీలు, కాంటాక్టు వివరాలు సైబర్ నేరగాళ్ల చేతిలోకి వెళ్తాయి. బ్యాంకింగ్ యాప్స్‌కు సంబంధించిన యూజర్ నేమ్, పాస్‌వర్డ్‌తో పాటు ఇతర సున్నితమైన సమాచారం దొంగలిస్తారు. కాబట్టి ఇలా వాట్సప్ లేదా ఇతర మార్గాల ద్వారా సందేశాలు వచ్చినప్పుడు వాటిల్లో ఉండే లింకుల పై ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయవద్దు. ఇలాంటి నోటీసులకు స్పందించొద్దని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. ఐటీ విభాగం నుంచి నోటీసులు ఎప్పుడైనా రిజిస్టర్డ్ మెయిల్ ఐడీకి వస్తుంది. ఐటీఆర్ పోర్టల్‌లోకి వెళ్లి చెక్ చేసుకోవచ్చు. కానీ, ఇలా వాట్సప్ ద్వారా ఐటీ శాఖ ఎప్పుడూ నోటీసులు పంపించదు. అందులోనూ లింకుల పై క్లిక్ చేయాలని చెప్పదు. అలా అడిగారు అంటే అది సైబర్ నేరగాళ్ల పనే అని అర్థం చేసుకోవాలి. మీకు ఎలాంటి సందేహం ఉన్నా ఇ-ఫైలింగ్ పోర్టల్ లోకి వెళ్లి మీ రీఫండ్ స్టేటస్ చెక్ చేస్తే అన్ని వివరాలు తెలిసిపోతాయి.

# స్టాక్ మార్కెట్
Stock Market

### ఆ బ్యాంకుల్లో

# ఎఫ్‌డి చేసే వారికి గుడ్‌న్యూస్




## అక్టోబర్ 1 నుంచి కొత్త రూల్స్.. ఇక ఆ టెన్షన్ లేదు..!

అక్టోబర్ 1 నుంచి ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసే వారికి కొత్త రూల్స్ అమలులోకి రానున్నాయి. అయితే, స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులకు వర్తించేలా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొత్త ఎఫ్‌డీ నియమాలు తీసుకొస్తోంది. ఉదయం 10 గంటలకల్లా వడ్డీ రేట్లు ప్రకటించడం, అన్ని బ్రాంచ్‌ల్లో ఒకే రేటు అమలు చేయడం వంటివి ఉన్నాయి. ఇక రూ. 3 కోట్లు దాటిన బల్క్ డిపాజి ట్లకు ప్రత్యేక రూల్స్ తీసుకొస్తున్నారు. మరి ఆ వివరాలను ఈ కథనం ద్వారా తెలుసుకుందాం. ఎలాంటి రిస్క్ లేకుండా స్థిరమైన రాబడి అందించే మార్గం ఫిక్స్‌డ్ డిపాజిట్లు అయితే, డిపాజిట్లు చేసే వారు నిబంధనలు కచ్చితంగా తెలుసుకోవాలి. సాధారణ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు కాస్త ఎక్కువ వడ్డీ ఆఫర్ చేస్తుంటాయి. దీంతో చాలా మంది అటువైపు మొగ్గు చూపుతుంటారు. చాలా బ్యాంకులు ఎఫ్‌డీ చేసే సమయంలో వడ్డీ రేట్లు చెబుతుంటాయి. అలాగే వెబ్ సైట్లో సరైన సమాచారం అప్‌డేట్ చేయవు. కానీ కొత్త నిబంధనల ప్రకారం ఇక నుంచి స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు రెగ్యులర్, బల్క్ (దీబశ్రీని) డిపాజిట్ల వడ్డీ రేట్లకు సంబంధించిన పూర్తి వివరాలను ముందుగానే అధికారిక వెబ్‌సైట్లో పొందుపరచాలి. దీంతో కస్టమర్ ఏ బ్రాంచ్‌కు వెళ్లకుండానే వడ్డీ రేట్లను తెలుసుకోవచ్చు.

# లిస్టింగ్ తర్వాత నెలలోనే 50 శాతం పతనం

*స్టాక్ మార్కెట్ సూచీలు మంగళ వారం సెషన్‌లో భారీ నష్టాల్లో ట్రేడవుతు న్నాయి. సెన్సెక్స్ 400, నిఫ్టీ 330 పాయింట్లు పతనమయ్యాయి. అయితే ఇలా మార్కెట్లు పడుతున్నా ఒక టెక్స్‌టైల్ స్టాక్ ఏకంగా 10 శాతం అప్పర్ సర్క్యూట్ కొట్టింది. దీంతో ఇన్వెస్టర్లకు మంచి లాభాల్ని అందించింది. దీని గురించి తెలుసుకుందాం.*




**ఆస్థా స్పింటెక్స్ షేర్లు**

భారత స్టాక్ మార్కెట్లలో లాభాల జోరుకు అడ్డుకట్ట పడింది. గత కొద్ది సెషన్లుగా మంచి లాభాల్లోనే ట్రేడవుతూ వచ్చిన సూచీలు ఇప్పుడు ఆగస్ట్ 4 సెషన్‌లో (మంగళవారం) నష్టాల్లో కొనసాగుతున్నాయి. ఆరంభంలో ఫ్లాట్‌గానే ట్రేడయినప్పటికీ మధ్యాహ్నం తర్వాత భారీ నష్టాల్లోకి జారుకున్నాయి. ఒక దశలో సెన్సెక్స్ 200 పాయింట్లకుపైగా లాభాల్లో కూడా ట్రేడయినా ఇప్పుడు వార్త రాసే సమయంలో మధ్యాహ్నం 2 గంటలకు చూస్తే సెన్సెక్స్ 400 పాయింట్లు తగ్గి 78,240 స్థాయిలో ఉంది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజి సూచీ నిఫ్టీ సెబీ ఈక్విటీ మార్కెట్ల ట్రేడింగ్‌లో కొత్త పద్ధతిని అమలు చేయగా ఇది మరింత భారీగా తగ్గింది. సెన్సెక్స్ 0.50 శాతం తగ్గితే నిఫ్టీ 1.30 శాతం లేదా 330 పాయింట్లకుపైగా పడిపోయి ప్రస్తుతం 24,440 స్థాయిలో ఉంది. గత కొన్ని సెషన్లలో సూచీలు పుంజుకోగా ఇప్పుడు ప్రాఫిట్ బుకింగ్ నేపథ్యంలో అమ్మకాల ఒత్తిడి కనిపిస్తోంది. అయితే మార్కెట్ లాభనష్టాలతో సంబంధం లేకుండా ఒక స్టాక్ భారీగా దూసుకెళ్తోంది. అదే ప్రముఖ టెక్స్‌టైల్ స్టాక్ ఆస్థా స్పింటెక్స్ లిమిటెడ్. ఇది కిందటి సెషన్‌లో రూ. 76.12 వద్ద ముగియగా ఇవాళ ఏకంగా 10 శాతం అప్పర్ సర్క్యూట్ కొట్టి రూ. 83.73 వద్ద గరిష్ఠాన్ని నమోదు చేసింది. మార్కెట్లు పడుతున్నా ఈ స్టాక్ పుంజుకునేందుకు ఒక ఆర్డరే కారణం. అవును ఫాల్కన్ యార్న్ నుంచి రూ. 51 కోట్ల విలువైన ఆర్డర్‌ను దక్కించుకోగా ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బలపడింది. ఒక్కసారిగా భారీగా షేర్లను కొనుగోలు చేశారు. స్టాక్ ఎక్స్ఛేంజీ ఫైలింగ్‌లో కీలక విషయాల్ని వెల్లడించింది. 10కి పైగా దేశీయ వినియోగదారుల నుంచి మొత్తం సుమారు 17.35 లక్షల కేజీల కాటన్ నూలుకు (యార్న్) సంబంధించిన 38 ఆర్డర్లను పొందినట్లు కంపెనీ ధ్రువీకరించింది. ఈ కంపెనీ ఇటీవలే స్టాక్ మార్కెట్లో లిస్టింగ్ అయింది. ఇష్యూ ప్రైస్ రూ. 136 గా ఉండగా సుమారు 4.41 శాతం డిస్కౌంట్‌తో రూ. 130 వద్ద ఈ ఏడాది జులై 6నే దలాల్ స్ట్రీట్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. ఒక దశలో రూ. 140.01 వద్ద 52 వారాల గరిష్ఠాన్ని తాకినా అక్కడి నుంచి భారీగా పడిపోయింది. ఈ క్రమంలోనే నెల రోజుల్లోనే 50 శాతం వరకు పతనంతో రూ. 74.40 వద్ద 52 వారాల కనిష్ఠాన్ని నమోదు చేసింది. ఆ స్థాయి నుంచి ఇప్పుడే మళ్లీ పుంజుకోవడం విశేషం. ఐపీఓ లిస్టయి గరిష్ఠ స్థాయి నుంచి 50 శాతం వరకు పడిపోయిన స్టాక్ ఇప్పుడిప్పుడే పుంజుకుంటుందన్నమాట.

## కేరళ స్కూల్లో రెయిన్ డే వేడుకలు



**హుస్నాబాద్ (సింగిడి):** హుస్నాబాద్ పట్టణంలోని కేరళ ఈ/ఎం హైస్కూల్లో శుక్రవారం నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులతో రెయిన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు రెయిన్‌కోట్లు, గొడుగులు (అంబ్రెలాలు) ధరించి వర్షంలో ఆటపాటలతో ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. పాఠశాల చైర్మన్, ప్రిన్సిపల్ బుర్ర రాజేందర్ మాట్లాడుతూ చిన్నారులకు ప్రకృతిపై అవగాహన కల్పిం చడంతో పాటు వర్షాల ప్రాధాన్యతను తెలియజేయడం కోసం రెయిన్ డే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. సమృద్ధిగా వర్షాలు కురిస్తే వ్యవసాయం అభివృద్ధి చెందడంతో పాటు భూగర్భ జలాలు పెరిగి తాగునీటి సమస్య కూడా తీరుతుందని విద్యార్థులకు వివరించారు. వర్షాలను ప్రేమిస్తూ ప్రకృతిని సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిదని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల సెక్రటరీ, కరస్పాండెంట్ అల్లే శైలేందర్, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా బోనాల వేడుకలు

### పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఉమారాణి శ్రీనివాస్





**కామారెడ్డి రూరల్, (సింగిడి):** కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మున్సిపల్ వాటర్ వర్క్స్, శానిటేషన్ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహిం చిన బోనాల కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌వ ర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో కామారెడ్డి పట్టణ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించినట్లు చైర్‌పర్సన్ తెలిపారు. భక్తిశ్రద్ధలతో బోనాల వేడుకలను నిర్వహించిన మున్సిపల్ వాటర్ వర్క్స్, శానిటేషన్ సిబ్బందిని చైర్పర్సన్ అభినందించారు. పట్టణ ప్రజలకు నిరంతరం సేవలందిస్తూ, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్న మున్సిపల్ సిబ్బంది సేవలను ఈ సందర్భంగా చైర్‌పర్సన్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్పర్సన్ కాసార్ల గోదావరి స్వామి, కౌన్సిలర్ కాళ్ళ గణేష్, మున్సిపల్ అధికారులు, వాటర్ వర్క్స్, శానిటేషన్ సిబ్బంది మరియు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



## 'ఫ్రైడే-డ్రైడే'లో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్



**కామారెడ్డి రూరల్, (సింగిడి):**

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని 32వ వార్డులో శుక్రవారం నిర్వహించిన 'ఫ్రైడే--డ్రైడే' కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఇందులో భాగంగా వార్డులోని పలు వీధుల్లో పర్యటించి, పరిసరాల పరిశుభ్రతపై స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ నివాసాల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు వృద్ధి చెంది డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందన్నారు. ప్రతి శుక్రవారం క్రమం తప్పకుండా 'ఫ్రైడే--డ్రైడే' పాటిస్తూ. ట్యాంకులు, కూలర్లు, పాత టైర్లలో నిల్వ ఉన్న నీటిని తొలగించి ఎండబెట్టాలని కోరారు. ప్రజల భాగస్వామ్యంతోనే వ్యాధుల నివారణ, పరిసరాల పరిశుభ్రత సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు మున్సిపల్ సిబ్బందికి ప్రజలందరూ సహకరించాలని పిలుపుని చ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ గ్యార అఖిల, సత్యం, కమిషనర్ పర్వతాలు, ఏఈ వేణు ప్రసాద్, ఆర్ఓ గోపాల్ రెడ్డి, సానిటరీ ఇన్స్పెటర్ ప్రశాంత్, మున్సిపల్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది మరియు వార్డు ప్రజలు పాల్గొన్నారు.



# శాలువాలకు స్వస్తి.. చేనేత నేతన్నలు నేసిన టవళ్లే వాడాలి

### జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపు..





**హుస్నాబాద్, (సింగిడి):** హుస్నాబాద్ పట్టణంలోని శ్రీ మార్కండేయ స్వామి ఆలయంలో శుక్రవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చేనేత వస్త్రాల వినియోగాన్ని ప్రోత్సహిస్తూ ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించాలని, అతిథులకు శాలువాలు కప్పే సంప్రదాయానికి బదులుగా నేతన్నలు నేసిన చేనేత టవళ్లను అందించే విధానాన్ని అలవాటు చేసుకోవాలని ప్రతిజ్ఞ చేయించారు. ఇటీవల మరణించిన చేనేత కార్మికుడు అల్వాల రాములు కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ. 5 లక్షల ఆర్థిక సహాయ చెక్కును అందజేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు చేనేత రంగం ప్రతీక అని పేర్కొంటూ జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఇకపై శాలువాల వినియోగాన్ని తగ్గించి, నేతన్నలు నేసిన చేనేత టవళ్లను అతిథి సత్కారాల్లో ఉపయోగించాలని పిలుపునిచ్చారు. దీనివల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు చేనేత కార్మికులకు ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయని అన్నారు. ఇప్పటికే ప్రభుత్వ శాఖల అధికారులకు చేనేత ఉత్పత్తుల వినియోగంపై ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. గతంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్న చేనేత కార్మికులకు ప్రభుత్వం అండగా నిలుస్తూ వారి సంక్షేమం కోసం చర్యలు తీసుకుంటోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా చేనేత రంగానికి సంబంధించిన పెండింగ్ అంశాలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పరిష్కరిస్తున్నామని తెలిపారు. హ్యాండ్లూమ్‌తో పాటు పవర్‌లూమ్ క్లస్టర్ల ఏర్పాటుకు ప్రభుత్వం సహకరిస్తుందని, హుస్నాబాద్‌లో విద్య, వైద్యం, పర్యాటకం, పారిశ్రామిక రంగాల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. చేనేత కార్మికుడు మరణిస్తే రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని, మహిళలకు ఆకుపచ్చ రంగు, ఎరుపు అంచుతో కూడిన చేనేత చీరలను ప్రభుత్వం పంపిణీ చేస్తోందని తెలిపారు. దేవాదాయ శాఖలోనూ పాలిథిన్ లేదా ఇతర శాలువాలకు బదులుగా నేతన్నలు తయారు చేసిన చేనేత ఉత్పత్తులనే వినియోగించేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, ఆర్డీవో రామ్మూర్తి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్లు, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటరమణ, చేనేత సహకార సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు, అధికారులు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

# మెగా రక్తదాన శిబిరం విజయవంతం





98 యూనిట్ల రక్త సేకరణ.
రక్తదాతలను అభినందించిన కామారెడ్డి జిల్లా ద సీనియర్ సివిల్ జడ్జ్ నాగరాణి.
ఐవిఎఫ్ జాతీయ సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్త.

**కామారెడ్డి రూరల్, (సింగిడి):** : కామారెడ్డి జిల్లా బిబిపేట్ మండల కేంద్రంలో తల సేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం వాసవి క్లబ్ మరియు ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవిఎఫ్) కామారెడ్డి రక్తదాతల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం జరిగింది ఈ శిబిరానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన కామారెడ్డి జిల్లా సీనియర్ సివిల్ జడ్జ్, జిల్లా న్యాయ సేవాధికారిత సంస్థ కార్యదర్శి పి. నాగరాణి మరియు ఐవిఎఫ్ జాతీయ సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్త లు మాట్లాడుతూ చిన్నారుల ప్రాణాలను కాపాడడం కోసం మెగా రక్తదాన శిబిరం నిర్వహించిన నిర్వాహకులను అభినందించి రక్తదానం చేసిన రక్తదాతలకు ప్రశంస పత్రాలను అందజేయడం జరిగింది. రక్తానికి ప్రత్యామ్నాయ మార్గాలు లేవని మానవతా దృక్పథంతో రక్తదాతలు ముందుకు రావడం అభినం దనీయమని అన్నారు. రక్తదాతలను ప్రోత్సహించడం కోసం వాటర్ బాటిల్ లు, ప్రశంస పత్రాలను అందజేసిన శ్రీ మణికంఠ భారత్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహ కులు బాశెట్టి నాగేశ్వర్ ను అభినందించి సన్మానించడం జరిగింది. వాసవి క్లబ్, కామారెడ్డి రక్తదాతల సమూహం, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవిఎఫ్) కమిటీలను అభినందించి సన్మానించడం జరిగింది. ఈ కార్యక్ర మంలో ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు, గ్రామ సర్పంచ్ ఉప్పల సాత్విక సాయి, వాసవి క్లబ్ అధ్యక్షుడు మురికి శ్రీనివాస్, ప్రధాన కార్యద ర్శి, కోశాధికారి రెడ్ శెట్టి శ్రీనివాస్, జోన్ చైర్మన్ నాగ భూషణం, వైస్ గవర్నర్ బాశెట్టి నాగేశ్వర్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పబ్బ యాదగిరి, కామారెడ్డి రక్తదాతల సమూహ అధ్యక్షులు జమీల్ అమ్మద్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ పుట్ల అనిల్ కుమార్, ఉపాధ్యక్షులు పర్ష వెంకటరవ ణ, జాలిగామ శ్రీకాంత్, లీడర్ టీవీ సీఈవో బట్టుపల్లి నరేష్ గౌడ్, ఐవిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎర్రం చంద్రశేఖ ర్, ప్రధాన కార్యదర్శి దొంతి సుధాకర్, కోశాధికారి కస్వ వెంకన్న, నంగునూరి కాశీనాథం, మందుల రామచంద్రం, పప్పుల ఆంజనేయులు మొదలగువారు పాల్గొనడం జరిగింది.

## చేనేతకు గౌరవం..

### ఖాదీ కార్మికులకు ఘన సన్మానం....



**మెట్‌పల్లి, (సింగిడి):** జాతీయ చేనేత కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని జగిత్యాల జిల్లా, మెట్ పల్లి ఖాదీ ప్రతిష్ఠాన్‌లో సేవలందిస్తున్న చేనేత కార్మికులు మచ్చ అశోక్, రాజేందర్‌లను శుక్రవారం ఘనంగా సన్మానించారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి బొమ్మెల శంకర్ శాలువాలు కప్పి సత్కరించి వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ ఆర్థిక వ్యవస్థలో చేనేత రంగం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. సంప్రదాయ వస్త్ర సంస్కృతిని తరతరాలకు అందిస్తూ చేనేత కార్మికులు విశేష సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. నాణ్యమైన ఖాదీ వస్త్రాల తయారీలో కార్మికుల కృషి అభినందనీయమని, వారి శ్రమ వల్లే చేనేత రంగానికి ప్రత్యేక గుర్తింపు లభిస్తోందన్నారు. చేనేత రంగాన్ని బలోపేతం చేయా లంటే ప్రభుత్వ ప్రోత్సాహంతో పాటు ప్రజలు ఖాదీ, చేనేత వస్త్రాల వినియోగాన్ని పెంచాలని ఆయన సూచించారు. కార్మికుల సంక్షే మం, ఉపాధి భద్రతకు మరిన్ని చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బొమ్మెల శివ, చిన్నయ్య, రమేష్, ఖాదీ ప్రతిష్ఠాన్ ఉద్యోగులు, చేనేత కార్మికులు, స్థానికులు పాల్గొన్నారు.

# మహాలక్ష్మి అమ్మవారికి పట్టు వస్త్రాలు

### ప్రత్యేక పూజల్లో పాల్గొన్న రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు

### వనమహోత్సవంలో మొక్కల నాటకం






**మెట్ పల్లి, (సింగిడి):** ఆషాఢ మాస బోనాల సందర్భంగా మెట్‌పల్లి పట్టణంలోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శుక్రవారం భక్తిశ్రద్ధల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ్‌రావు ఆలయాన్ని దర్శించుకుని అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొని కోరుట్ల నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులు, ఆయురా రోగ్యాలు, సుభిక్షంతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. బోనాల వేడుకలు ఆధ్యాత్మిక వాతా వరణంలో ఘనంగా నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీర్వాదాలు పొందా రు. వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆల య ప్రాంగణంలో మొక్కలు నాటిన జువ్వాడి నర్సింగ్‌రావు, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించవచ్చని అన్నా రు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఓం కారి నవీన్, డిఎస్పి రాములు, సీఐ సురేష్ బాబు, ఎస్సై పబ్బ కిరణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు, మొహమ్మద్ రైసొద్దిన్, మున్సిపల్ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై సీపీఐ అడుగులు...


### – జిల్లా వ్యాప్తంగా పాదయాత్రలు..

### 'చలో ఢిల్లీ' ర్యాలీకి మద్దతు కూడగట్టే ప్రయత్నం...



**మెట్‌పల్లి, (సింగిడి):** ప్రజా సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు సెప్టెంబర్ 1న నిర్వహించనున్న 'చలో ఢిల్లీ' ర్యాలీకి మద్దతు కూడగట్టే లక్ష్యంతో సీపీఐ జిల్లావ్యాప్తంగా ప్రచార పాదయాత్రలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా శుక్రవారం మెట్‌పల్లిలో బస్‌డిపో నుంచి కొత్త బస్టాండ్ వరకు పార్టీ నాయ కులు, కార్యకర్తలు పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ జగిత్యాల జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం మాట్లాడుతూ, ఆగస్టు 6 నుంచి 14 వరకు గ్రామాలు, పట్టణాల్లో ప్రజా సమస్యలపై విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ధరల పెరుగుదల నియంత్రణ, ద్రవ్యోల్బణం అరికట్టడం, రైతులకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధ హామీ, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు, కార్మిక హక్కుల పరిరక్షణ, మహిళా రిజర్వేషన్ల అమలు, ప్రభుత్వ విద్య–వైద్య రంగాల బలోపేతం, దళితులు, ఆదివాసీల సామాజిక న్యాయం వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే 'బద్లావ్ జరూరీ హై' నినాదంతో సెప్టెంబర్ 1న న్యూఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించనున్న భారీ ర్యాలీ, బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు, సీపీఐ మెట్‌పల్లి పట్టణ కార్యదర్శి ఎండీ ఉస్మాన్, నాయకులు కొక్కుల శాంత, ఎన్నం రాధా, ఈనా ఫిర్దోస్, అందే వంశీకృష్ణ, పోశెట్టి, మల్లాపూర్ రాజన్న, తిప్పర్తి రమేష్‌తో పాటు సీపీఐ కార్యకర్తలు, కార్మికులు పాల్గొన్నారు.

## డీఏపీ ఎరువులు సరఫరా చేయాలని కేంద్ర మంత్రికి వినతి



**ఆమనగల్లు, (సింగిడి):** తెలంగాణ రాష్ట్రానికి అవసరమైన మేరకు తగినంత డీఏపీ ఎరువులను సరఫరా చేయాలని కోరుతూ నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి మరియు ఎంపీ సురేష్ శతాబ్ది కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జగత్ ప్రకాష్ నడ్డాను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ వినతిపత్రంపై కాంగ్రెస్ పార్టీకి చెందిన పలు వురు లోక్‌సభ ఎంపీలు సంతకాలు చేశారు. రైతుల ప్రయో జనాలను దృష్టిలో ఉంచుకుని ఎరువుల కొరత తలెత్తకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని వారు కోరగా, కేంద్ర మంత్రి సానుకూ లంగా స్పందించినట్లు సమాచారం.

# పిటిషన్లపై తక్షణ స్పందన.. సిసిటిఎన్ఎస్‌లో నమోదు, రసీదు జారీ

### పిటిషన్ స్వీకరణ నుంచి పరిష్కారం వరకు పారదర్శకత

### రిసెప్షన్ వర్టికల్ సిబ్బందికి ఎస్పీ దిశానిర్దేశం.. కామారెడ్డి జిల్లా ఎస్పి యం. రాజేష్ చంద్ర.

**కామారెడ్డి రూరల్ (సింగిడి):** కామారెడ్డి జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర శుక్రవారం జిల్లా పో లీస్ కార్యాలయంలో నిర్వహిం చిన రిసెప్షన్ వర్టికల్ ట్రైనింగ్ కార్యక్రమంలో పాల్గొని సిబ్బందికి పలు కీలక సూచనలు చేస్తూ దిశానిర్దేశం చేశారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ స్టేషన్లకు అందించే ప్రతి పిటిషన్‌ను ఎలాంటి ఆలస్యం లేకుండా సిసిటి ఎన్ఎస్ లో నమోదు చేసి, పిటిషన్‌దారుడికి వెంట నే రిసీప్ట్ అందించాలని రిసెప్షన్ వర్టికల్ అధికా రులను ఆదేశించారు. పిటిషన్ స్వీకరించిన వెంటనే వివరాలను సక్రమంగా నమోదు చేసి, తదుపరి చర్యలను పారదర్శకంగా చేపట్టా లని సూచించారు. ప్రతి పోలీస్ అధికారి బాధ్యతాయుతంగా, మర్యాదపూర్వకంగా, పారదర్శకంగా వ్యవహరించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎస్పీ అన్నారు. పిటిషన్లను పెండింగ్‌లో ఉంచకుండా సంబంధిత అధికారులు సత్వరమే పరిశీలించి, చట్టపరమైన పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా సైబర్ నేరాల బాధితులు పోలీస్ స్టేషన్‌కు వచ్చినప్పుడు వారి ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, వారికి సరైన మార్గదర్శకత్వం అందించాలని ఆదేశించారు. సైబర్ నేరాలకు గురైన బాధితులకు సత్వర సహాయం అందిస్తూ, అవసరమైన చర్యలు చేపట్టి న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. ప్రజలకు పోలీస్ శాఖ అందించే సేవల్లో వేగం, పారదర్శకత, బాధ్యత ప్రధానంగా ఉండాలని ఎస్పీ స్పష్టం చేశారు. రిసెప్షన్ వర్టికల్ ప్రజలకు పోలీస్ శాఖతో తొలి పరిచయ వేదికగా ఉంటుందని, అందువల్ల ప్రతి సిబ్బంది ప్రజల పట్ల సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె. నరసింహారెడ్డి, సదాశివ నగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్ కుమార్‌తో పాటు రిసెప్షన్ వర్టికల్ సిబ్బంది పాల్గొన్నారు.





విద్యుత్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా

# నల్లబ్యాడ్జీల నిరసన....

– యాదాద్రి థర్మల్ ప్లాంట్ ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగించాలని విద్యుత్ ఉద్యోగుల డిమాండ్....




**మెట్‌పల్లి, (సింగిడి):** యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రయ త్నాలను విరమించుకోవాలని కోరుతూ మెట్‌పల్లి విద్యుత్ డివిజన్ కార్యాలయం ఎదుట శుక్రవారం విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ విద్యుత్ రంగం ప్రజలకు అత్యవసర సేవలు అందించే కీలక ప్రభుత్వ రంగ సంస్థ అని పేర్కొన్నారు. ఇటువంటి సమయంలో ప్రభుత్వ రంగ సంస్థలను మరింత బలోపేతం చేయాల్సింది పోయి ప్రైవేటీకరణ దిశగా చర్యలు తీసుకోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తే ఉద్యోగుల భద్రతతో పాటు ప్రజలకు అందే విద్యుత్ సేవల నాణ్యతపై కూడా ప్రతికూల ప్రభావం పడే అవకాశముందని అభిప్రాయపడ్డారు. విద్యుత్ సంస్థలను లాభాపేక్షతో కాకుండా ప్రజా సేవా దృక్పథంతో నిర్వహించాలని, ఉద్యోగులు, కార్మిక సంఘాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ప్రైవేటీకరణకు సంబంధించిన నిర్ణయాలను ప్రభుత్వం పునఃసమీక్షించాలని వారు కోరారు. నిరసన కార్యక్రమంలో జేఏసీ జిల్లా చైర్మన్ అజీజ్, మెట్‌పల్లి డివిజన్ జేఏసీ చైర్మన్ మునుగురి లక్ష్మణ్, కార్యదర్శి హరిప్రసాద్, జేఏసీ నాయకులు లక్కంపల్లి సురేష్, ఎండీ కరీం, శంకరయ్య, రవీందర్, భోయినపల్లి అశోక్, మహేష్, కమలాకర్, శరణ్య, లక్ష్మి, రాజమ్మ, మౌనికతో పాటు విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

50 పడకల ఆసుపత్రి

# నిర్మాణానికి భూమి పూజ



**అమరచింత, (సింగిడి):** ఆత్మకూర్ మండల పరిధిలోని ప్రియదర్శిని జూరాల క్యాంపు వద్ద రూ, 22 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 50 పడకల ఆసుపత్రి నిర్మాణానికి మునిసిపల్ చైర్ పర్సన్ నాగమణి, వైస్ చైర్మన్ నల్లగొండ శ్రీనివాసులు, డిసిసి కార్యదర్శి తులసిరాజ్ యాదవ్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు నాగేశ్వర్, పట్టణ అధ్యక్షులు శ్రీనివాసులు శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అమరచింత ఆత్మకు మండలాల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని అన్నారు. ఈ ఆస్పత్రి నిర్మాణమైతే మండలంలోని అన్ని గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తుంటే బీఆర్ఎస్ నేతలు మాత్రం అభివృద్ధి చేయడం లేదని చెప్పడం ఆశాస్పదంగా ఉందన్నారు. సంవత్సరంలోపల్లి ఆస్పత్రి నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తేవాలని వారు కాంట్రాక్టర్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు పరమేష్ కౌన్సిలర్లు అండ్ శ్రీనివాసులు కోట్ల తిరుపతి సద్దల తులసి వెంకటరామ్ముడ కో ఆప్షన్ సభ్యులు సౌజన్య గంగాధర్, నాయకులు మహేష్, గోపాల్, గాలి పంపు శ్రీనివాసులు, మనివర్ధన్ రెడ్డి, దామోదర్, గడ్డం శ్రీకాంత్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# బీరంగూడలో యువకుడిపై కత్తులతో దాడి..



**అమీన్‌పూర్, (సింగిడి):** అమీన్‌పూర్ సర్కిల్ పరిధిలోని బీరంగూడ శ్రీరామ్‌నగర్ కాలనీలో యువకుడిపై కత్తులతో దాడి ఘటన కలకలం రేపింది. మిత్రుడి పుట్టినరోజు వేడుకలకు వెళ్లి ఇంటికి తిరిగి వచ్చిన బండారి అరవింద్‌పై సుమారు పది మంది వ్యక్తులు కత్తులతో దాడి చేసినట్లు బాధితుడు ఆరోపించాడు. ఈ ఘటనపై అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించిన పోలీసులు కొంతమందిని ఇప్పటికే అరెస్ట్ చేశారు. మిగిలిన నిందితులను కూడా వెంటనే అరెస్ట్ చేయాలని అఖిల భారత వడ్డెర సంఘం నాయకులు పోలీసులను కోరారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఘటనకు సంబంధించిన సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలించి నిందితులను గుర్తించామని అమీన్‌పూర్ సీఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని చెప్పారు. అఖిల భారత వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షుడు వేముల లక్ష్మణ్, మహిళా అధ్యక్షురాలు తిరుమల దేవి, ఆల్ ఇండియా ఉపాధ్యక్షుడు వేముల దశరథ్, ప్రధాన కార్యదర్శి వరికుప్పల శ్రీనివాసులు, తెలంగాణ రాష్ట్ర జనరల్ సెక్రటరీ వేముల మధుసూదన్, నాంపల్లి నియోజకవర్గం అధ్యక్షుడు వల్లపు మల్లికార్జున్ తదితరులు పోలీసులను కలిసి ఫిర్యాదు చేశారు.

రోస్టర్ విధానం సవరించాలి..

## మాలలకు న్యాయం చేయాలి: ఆరె కిశోర్



**హుస్నాబాద్ (సింగిడి):** రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన అంగన్‌వాడీ నియామక నోటిఫికేషన్‌లో హుస్నాబాద్ నియోజకవర్గానికి సంబంధించిన పోస్టుల రిజర్వేషన్ కేటాయింపులో ఎస్సీ జీ–3లోని మాల, అనుబంధ ఉపకులాలకు ఒక్క పోస్టు కూడా కేటాయించకపోవడం తీవ్ర అన్యాయమని జాతీయ మాల మహానాడు హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆరె కిశోర్ ఆరోపించారు. ఇతర వర్గాలకు, ముఖ్యంగా ఈడబ్ల్యూఎస్ కేటగిరీకి పోస్టులు కేటాయించినప్పటికీ, రాజ్యాంగబద్ధ రిజర్వేషన్లకు అర్హులైన ఎస్సీ జీ–3లోని మాల, అనుబంధ ఉపకులాలను పూర్తిగా విస్మరించడం ఆందోళనకరమని పేర్కొన్నారు. ఎస్సీ జీ–3లోని మాల, అనుబంధ ఉపకులాలకు ఒక్క పోస్టు కూడా ఎందుకు కేటాయించలేదని ప్రశ్నించిన ఆయన, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కల్పించిన రాజ్యాంగ హక్కులు, రిజర్వేషన్లు ఈ వర్గాలకు వర్తించవా అని నిలదీశారు. ఎస్సీ వర్గంలోని ఒక ఉపవర్గానికి పూర్తిగా అవకాశం లేకుండా చేయడం సామాజిక న్యాయ స్ఫూర్తికి విరుద్ధమని, దీంతో మాల, అనుబంధ ఉపకులాల యువత విద్య, ఉద్యోగ అవకాశాలకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతోందని విమర్శించారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కల్పించిన రాజ్యాంగ హక్కులను కాలరాసే అధికారం ఎవరికీ లేదని స్పష్టం చేసిన ఆయన, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు ప్రతి వర్గానికి సమానంగా అందేలా ప్రభుత్వం రోస్టర్ విధానాన్ని తక్షణమే పునఃసమీక్షించి, ఎస్సీ జీ–3లోని మాల, అనుబంధ ఉపకులాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

# క్విట్ ఇండియా స్ఫూర్తితో 10న జైల్ భరో

## కార్మిక రైతు వ్యవసాయకార్మిక సంఘాల పిలుపు



**అమరచింత, (సింగిడి):** ఆత్మకూరు శుక్రవారంనాడుజరిగిన సదస్సుకు సి ఐ టియు జిల్లా ఉపాధ్యక్షులు యస్. రాజు అధ్యక్షత న జరిగింది. సి ఐ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి మండ్ల రాజు. తెలంగాణ రైతు సంఘశీ జిల్లా ప్రధాన కార్యదర్శి. డి. బాల్ రెడ్డి తెలంగాణ వ్యవసాయకార్మిక సంఘము. జిల్లా అధ్యక్షులు యస్. అజయ్.. సి ఐ టి. యు. జిల్లా అధ్యక్షులు ఆర్ ఎన్. రమేష్. తెలంగాణ రైతు సంఘ శీ. జిల్లా ఉపాధ్యక్షులు జి యస్. గోపి లు మాట్లాడుతు కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక కర్షక వ్యతిరేక విధానాలకు కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా ఆగస్టు 10న దేశవ్యాప్తంగా జరుగు జైల్ భరో కార్యక్రమాన్ని వనపర్తి జిల్లాలో కార్మికులు రైతులు వ్యవసాయ కూలీలను వేలాదిగా సమీకరించి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం సామ్రాజవా దులకు లొంగిపోయి అమెరికా వ్యవసాయ ఉత్పత్తులను ప్రధానంగా మక్కజొన్నలు, పత్తి, పాలు, చేపలు జీరో టాక్స్ తోని దేశంలోకి దిగుమతి చేసుకోవడానికి అంగీకరించడం దేశ రైతాంగం ప్రయోజనాలకు విగాతం కలిగించడమే కాక వ్యవసాయాన్ని కార్పొరేట్ శక్తులకు ధరాదత్తం చేయడం కోసం కుట్ర పన్నుతున్నాడని వారు విమర్శించారులి ఈ విధానాలను విరమిశీచు కోనట్లైతే రైతాంగం అగ్రహానికి మోడీ ప్రభుత్వం గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. అదేవిధంగా కార్మికులు అనేక సంవత్సరాలుగా పోరాడి సాధించుకున్న 29 చట్టాలను కుదించి పారిశ్రామిక యజమానులకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడులుగా తీసుకురావడం దుర్మార్గమని అన్నారు. గ్రామీణ పేదలకు ఉపాధి కల్పిస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని ఎత్తివేసి వి బి జి రామ్ జి పేరుతోని కేంద్ర ప్రయోజిత పథకం తీసుకురావడం గ్రామీణ పేదల పొట్ట కొట్టడమేనని ఆయన విమర్శించారులి మోడీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దరాదత్తం చేయడం కోసం చాలా చురుకుగా ప్రయత్నాలు కొనసాగిస్తున్నదని అన్నారు. దేశంలోని ఘనులు, అడవులు, ప్రకృతి వనరులను ఇప్పటికే కార్పొరేట్ శక్తులకు పెద్ద ఎత్తున కట్టబెట్టారు. విద్యుత్తును కూడా ఆదానీ, అంబానీ లాంటిపారిశ్రామికవేత్తలకు అప్పజెప్పే కుట్రలో భాగంగానే విద్యుత్ బిల్లును తీసుకొచ్చాడని ఆయన విమర్శించారు. పేదలకు రైతాంగానికి మొత్తం రాష్ట్ర ప్రయోజనాలకే విఘాతం కలిగించే విద్యుత్ బిల్లును వ్యతిరేకించవలసిన రాష్ట్ర ప్రభుత్వము ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్రం అడుగులకు మడుగులోత్తడానికి పూనుకొని విద్యుత్ బిల్లును రాష్ట్రంలో అమలు చేయడం కోసశీ ప్రయత్నం చేస్తున్నాడని అందులో భాగమే రాష్ట్రంలో మూడవ డిస్కం తీసుకొస్తున్నాడని అన్నారు. ఈ విధంగా రైతులు పారిశ్రామిక కార్మికులు వ్యవసాయ కూలీల ప్రయోజనాలను దెబ్బ కొట్టి పెట్టుబడిదారుల ఖజానా నింపడం తన కార్యక్రమంగా మోడీ పెట్టుకున్నాడని అందులో భాగమే రోజురోజుకు పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలు అని అన్నారు. ఈ ప్రజా వ్యతిరేకమైన విధానాలకు వ్యతిరేకంగా పట్టణ కార్మికులు, గ్రామీణ రైతు వ్యవసాయ కూలీలు సంఘటితంగా ఉద్యమాలు కొనసాగించాలని అందులో భాగమే ఆగస్టు 10న జైలు నింపే కార్యక్రమాన్ని మూడు సంఘాలు చేపట్టాయని ఈ కార్యక్రమాన్ని మూడు సంఘాల కార్యకర్తలు సవాల్గా స్వీకరించి ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసి ప్రజల్ని సమీకరించాలని ప్రభుత్వం మెడలు వంచైన ఈ విధానాలను వెనక్కి తీసుకునే విధంగా ఉద్యమాలు పెంపొందించాలనికోరారు. ఈ కార్యక్రమం లో సి ఐ టియు జిల్లా నాయకులు ఎ. బుచ్చన్న, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు, విజయమ్మ, సంధ్యారాణి, భారతీయుడు, రాణి. ఖాజా మైను, పోలన్న, తదితరులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థిక సాధికారతకు శ్రీనిధి పథకం

**శ్రీ నిధి ద్వారా తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లించాలి, వసూలు చేసిన డబ్బులు బ్యాంకుకు కట్టకుండా దుర్వినియోగం చేసిన, మోసం చేసిన వారి నుండి రెవెన్యూ రికవరీ యాక్ట్**

**జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



**అమరచింత, (సింగిడి):** స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థిక సాధికారత సాధించేందుకు, వడ్డీ వ్యాపారాలను అరికట్ట డానికి ప్రభుత్వం తక్కువ వడ్డీ తో శ్రీనిధి పథకం ద్వారా రుణాలను అందజేస్తుందని అందువల్ల వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యం మేరకు రుణాలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐ. డి. ఓ సి సమావేశ మందిరంలో శ్రీ నిధి జోనల్ మేనేజర్ టి. వి. రవి కుమార్ ఆధ్వర్యంలో ఎ. పి. యం., గ్రామీణాభివృద్ధి శాఖ సిబ్బందితో ఏర్పాటు చేసిన శ్రీనిధి సమీక్ష సమావేశానికి జిల్లా కలెక్టర్ హాజర య్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇప్పటి వరకు వనపర్తి జిల్లాలో ఎన్ని రుణాలు గ్రౌండింగ్ చేశారు, రికవరి ఎంత చేశారు అనే వివరాలను జోనల్ మేనేజర్ ద్వారా అడిగి తెలుసుకున్నారు. జోనల్ మేనేజర్ రవి కుమార్ వివరిస్తూ జిల్లాలో ఇప్పటి వరకు స్వయం సహాయక సంఘాల మహిళలకు, పురపాలికల్లోని మహిళా సంఘాల సభ్యులకు యూనిట్లు మంజూరు చేస్తూ రుణాలు మంజూరు చేయడం జరిగిందని కానీ మంజూరు చేసిన రుణాలు తిరిగి చెల్లించే విషయంలో వనపర్తి జిల్లా చాలా వెనుకబడి ఉన్నామని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన కలెక్టర్ రుణాలు పొందిన స్వయం సహాయక సంఘాల నుండి డబ్బులు తిరిగి బ్యాంకుకు కట్టే విధంగా ఎ. పి. యం లు, వి. ఒ లు చర్యలు తీసుకోవాలని సూచించారు. రుణాలు మొండి బకాయిల కింద మారకుండా చూసుకునే బాధ్యత వి. ఓ లు తీసుకోవాల న్నారు. స్వయం సహాయక సంఘంలో కొందరు మొండి బకాయిలు గా మారితే మిగతా సభ్యులకు బ్యాంకులు రుణాలు ఇవ్వరని అప్పుడు ఇతర మహిళలకు రుణాలు రాక ఇబ్బందులు ఎదుర్కొంటారని తెలియజేశారు. కొందరు వి. ఓ లు స్వయం సహాయక సంఘాల సభ్యుల నుండి రుణాలు వసూలు చేసి బ్యాంకుకు చెల్లించకుండా దుర్వినియోగం చేసినారని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన కలెక్టర్ అలాంటి వారి పై రెవెన్యూ రికవరీ యాక్ట్ అమలు చేసి క్రిమినల్ కేసు పెట్టాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు ఏకరూప దుస్తులను ఆగస్టు 14 లోగా కనీసము ఒక జత అందజేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఏటీఎంలను ఆదేశించారు. స్వయం సహాయక సంఘాల టైలర్లు కొంతమంది పాఠశాలకు వెళ్లి విద్యార్థులు బట్టల కొలతలు తీసుకోకుండానే కుట్టి పోస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అలా చేయడంవల్ల విద్యార్థులకు బట్టలు సరిపోక పోగా అవి నిరుపయోగంగా మారుతాయని చెప్పారు. అందువల్ల టైలర్లు కచ్చితంగా పాఠశాలలకు వెళ్లి విద్యార్థుల కొలతలు తీసుకొని కొలతల ప్రకారమే బట్టలు కుట్టాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఎన్ ఖీమ్యా నాయక్, ఇంచార్జి పి. డి డి ఆర్ డి ఓ రామమహేశ్వర రెడ్డి, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఇందిర, ఎపిడి సరోజ, ఎపియం లు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఆరోగ్యశ్రీ సాధన దినోత్సవం

**మందకృష్ణ మాదిగ పోరాట ఫలితమే ఆరోగ్యశ్రీ: ఆడెపు నాగార్జున మాదిగ కరిగెల్ల దశరథం మాదిగ**

**బిజినపల్లి (సింగిడి):** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని బాబాసాహెబ్ అంబేద్కర్ చౌరస్తా సర్కిల్‌లో శుక్రవారం ఆరోగ్యశ్రీ సాధన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్-- ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జి ఆడెపు నాగార్జున మాదిగ హాజరై మాట్లాడారు. ఆగస్టు 7, 2004న పద్మశ్రీ మందా కృష్ణ మాదిగ గుండె జబ్బులతో బాధపడుతున్న చిన్నారుల కోసం చేపట్టిన ఉద్యమం ఫలితంగానే ఆరోగ్యశ్రీ పథకం అమల్లోకి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో జరిగిన ఆ ఉద్యమం వేలాది నిరుపేద కుటుంబాలకు ఆశాజ్యోతిగా నిలిచిందన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రెండు తెలుగు రాష్ట్రాల్లో పేద కుటుంబాలకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఖరీదైన వైద్య చికిత్సలు ఉచితంగా అందుతున్నాయని తెలిపారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం పద్మశ్రీ మందా కృష్ణ మాదిగ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ మండల ఇన్‌చార్జి నల్లికంటి నాగయ్య మాదిగ, ఎంఎస్ఎఫ్ జిల్లా ఇన్‌చార్జి అరికెల రమేష్ మాదిగ, అనిల్ కుమార్ గౌడ్, మంగి రాజేష్, నాగరాజు, యాకోబు, మల్లెపోగు శ్రీశైలం, గడ్డం విజయ్, నిర్జింత భాస్కర్, నల్లికంటి మల్లేష్, కానాపూర్ ఉషన్న, కట్నాల శివ, మహేష్, మంగి శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు కరిగళ్ల దశరథం మాదిగ అధ్యక్షత వహించారు.





# జనగణన హ్యాండ్‌బుక్‌ను అత్యంత ప్రామాణికంగా రూపొందించాలి



## జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి


**అమరచింత, (సింగిడి):** జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ (డీసీహెచ్‌బీ)ను అత్యంత ప్రామాణికంగా, నాణ్యతా ప్రమాణాలతో రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభిఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ తయారీ పైజనగణన సంచాలకులు భారతి హొలికేరి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. వనపర్తి జిల్లాకలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్ తోకలిసి కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి వీసీ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగాజనగణన సంచాలకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రతి జిల్లాకు ప్రత్యేకజిల్లా జనగణన హ్యాండ్‌బుక్ రూపొందిస్తున్నట్లు తెలిపారు. జిల్లా జనగణనహ్యాం డ్‌బుక్‌లో జనాభా, సామాజిక, ఆర్థిక, పరిపాలనా, మౌలిక వసతులకుసంబంధించిన సమగ్ర సమాచారాన్ని పొందుపరుస్తామని చెప్పారు. భవిష్యత్తు ప్రభుత్వ విధానాల రూపకల్పన, అభివృద్ధి ప్రణాళికలు, పరిశోధనలు, జనగణనవిశ్లేషణలకు ఈ హ్యాండ్‌బుక్ కీలక ఆధార పత్రంగా ఉపయోగపడు తుందని పేర్కొన్నారు. ప్రతి శాఖ నుంచి అవసరమైన సమాచారాన్ని సేకరించి, రెవెన్యూగ్రామం, పట్టణ స్థాయి వరకు పూర్తి వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. 2025 డిసెంబర్ 31 నాటికి అందుబాటులో ఉన్న సౌకర్యాలు, మౌలిక వసతులు, శాఖలసమాచారాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకో వాలని సూచించారు. జిల్లా జనగణనహ్యాండ్‌బుక్‌లో పొందుపరిచే ప్రతి సమాచారం సంబంధిత శాఖల అధికారిక నమోదులఆధారంగా మాత్రమే ఉండా లని, సమాచారం సంపూర్ణంగా, ఖచ్చితంగా, ఏకరూపంగాఉండేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఆగస్టు 10 నుంచి సెప్టెంబర్ 8వరకు సమాచార సేకరణ, పరస్పర పరిశీలన చేపట్టాలని, ప్రతి పట్టికను సంబంధితశాఖాధికారి, జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ విభాగం క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. గణాంకాల్లో పొరపాట్లు, ఖాళీ వివరాలు, పునరావృత నమోదులు లేకుండాజాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాజనగణన హ్యాండ్‌బుక్ (డీసీహెచ్‌బీ)ను అత్యంత ప్రామాణికంగా, నాణ్య తాప్రమాణాలతో రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగాజిల్లాలో సెన్సస్ కు సంబంధించి ఎన్యూమరేటర్లకు హానరోరియం కూడా అందజేయడంజరిగిందని తెలిపారు. సమావేశంలో సిపిఓ హరికృష్ణ, జెడ్పి సీఈఓ యాదయ్య, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



పెన్షన్ల కోసం దరఖాస్తుల

# స్వీకరణ ప్రారంభం

**అర్హులైన లబ్ధిదారులు అవసరమైన ధ్రువపత్రాలతో గామ పంచాయతీల్లో దరఖాస్తు చేసుకోవాలి ఎంపీడీఓ కథలప్ప**



**బిజినపల్లి (సింగిడి)::** తెలంగాణ ప్రభుత్వం కొత్తగా వితంతు, ఒంటరి మహిళలు, వికలాంగులు, చేనేత కార్మికులు, కల్లు గీత కార్మికులకు సామాజిక భద్రతా పెన్షన్లు మంజూరు చేసేందుకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ప్రారంభించినట్లు ఎంపీడీఓ తెలిపారు. అర్హులైన లబ్ధిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని గ్రామ పంచాయతీల ద్వారా దరఖాస్తులు సమర్పించాలని సూచించా రు. దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా పాస్‌బుక్, రేషన్ కార్డు, వితంతు పెన్షన్‌కు భర్త మరణ ధ్రువీకరణ పత్రం, భూమి పాస్‌బుక్ (ఉంటే), రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు జతచేసి గ్రామ పంచాయతీ కార్యదర్శికి అందజేయాలని తెలిపారు. ఒంటరి మహిళలు అదనంగా తహసీల్దార్ జారీ చేసిన ఒంటరి మహిళ ధ్రువీకరణ పత్రం లేదా కోర్టు జారీ చేసిన విడాకుల ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. చేనేత పెన్షన్‌కు సహాయ చేనేత అధికారి జారీ చేసిన ధ్రువీకరణ పత్రం, కల్లు గీత కార్మికుల పెన్షన్‌కు ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జారీ చేసిన ధ్రువీకరణ పత్రాన్ని తప్పనిసరిగా జతపరచాలని ఎంపీడీఓ సూచించారు. అర్హత కలిగిన లబ్ధిదారులందరూ నిర్ణీత గడువులోగా గ్రామ పంచాయతీల్లో దరఖాస్తులు సమర్పించి ప్రభుత్వ సంక్షేమ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం

## తెలంగాణ జన సమితికే కేటాయించాలి

**మహాకూటమి బలోపేతానికి టీజేఎస్‌కు అవకాశం కల్పించాలి: మొసలి శ్యాం ప్రసాద్ రెడ్డి**



**బిజినపల్లి (సింగిడి):** మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాన్ని మహాకూ టమి (పొత్తు)లో భాగంగా తెలంగాణ జన సమితి (టీజేఎస్) పార్టీకి కేటాయించాలని తెలంగాణ జన సమితి రాష్ట్ర కమిటీ సభ్యులు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ మొసలి శ్యాం ప్రసాద్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకత్వాన్ని కోరారు. శుక్రవారం బిజినపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో తెలంగాణ జన సమితి కీలక పాత్ర పోషించిందని తెలిపారు. రాష్ట్ర ఆవిర్భావం అనంతరం కూడా ప్రజా సమస్యలు, నిరుద్యోగ యువత, విద్యార్థులు, పట్టభద్రుల హక్కుల పరిరక్షణ కోసం పార్టీ నిరంతరం పోరాటం చేస్తోందని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైదరా బాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాన్ని తెలంగాణ జన సమితికి కేటాయించడం ద్వారా తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలకు తగిన గౌరవం దక్కుతుందని, అదే సమయంలో మహాకూటమి మరింత బలోపేతం అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ నేప థ్యంలో కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం, రాష్ట్ర నాయకత్వం ఈ అంశాన్ని సానుకూలంగా పరిశీలించి, మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాన్ని తెలంగాణ జన సమితి పార్టీకి కేటాయించాలని మొసలి శ్యాం ప్రసాద్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

దళితుల ఇండ్ల కూల్చివేతను

# విరమించుకోవాలి

**చేర్యాల మున్సిపల్ మిషనర్ ను ఆదేశించిన రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్**



**చేర్యాల, (సింగిడి):** చేర్యాల పట్టణంలో రోడ్డు విస్తరణ పేరుతో దళితుల ఇండ్లకూల్చివేతను వీర మించుకోవాలని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చేర్యాల మున్సిపల్ కమిషనర్ను ఆదేశించింది. ఇల్లు కోల్పోతున్న బాధితులు దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి శంకర ఆధ్వర్యంలో శుక్రవారం నాడు రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ కార్యాలయం హైదరాబాద్ కు వెళ్లి ఫిర్యాదు చేయగా రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు జిల్లా శంకర్ కు ఫిర్యాదు చేశారు. ఆయన వెంటనే స్పందించి చేర్యాల మున్సిపల్ కమిషనర్ కు ఫోన్ చేసి దళితుల ఇండ్ల కుల్చివేత పై ఆరా తీశారు. దళితుల ఇండ్ల కూల్చివేతను మానుకోవాలని కమిషనర్ ఆదేశించగా కమిషనర్ స్పందిస్తూ కూల్చివేత ప్రతిపాదనలు ఏమీ లేవని చెప్పారు. దళితులు ఇండ్లను కూల్చివేయబమని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బాధితులు గుస్క వెంకటేశం అంజయ్య, గునిగంటి శివ తదితరులు పాల్గొన్నారు

## గడ్డిఅన్నారం డివిజన్‌లో వీధి కుక్కల సమస్యను పరిష్కరించండి.

**అధికారులకు మద్దెల సునీల్ బాబు వినతిపత్రం**



**ఎల్బీ నగర్, (సింగిడి):** గడ్డి అన్నారం డివిజన్‌లో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని, దీంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని తక్షణమే చర్యలు తీసుకోవాలని డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మద్దెల సునీల్ బాబు అధికారులను కోరారు. శుక్రవారం తార్నాకలోని వెటర్నరీ కార్యాలయాన్ని సందర్శించి డిప్యూటీ వెటర్నరీ డైరెక్టర్ కి వీధి కుక్కల సమస్యపై వినతిపత్రం అందజేసారు. డివిజన్ లో విధి కుక్కల సమస్య ఎక్కువగా ఉందని, ముఖ్యంగా రోడ్లపై నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాలు, ఆటోల సీట్ కవర్లను చింపివేయడం ద్వారా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి ప్రజలకు నష్టం కలిగిస్తున్నా యని తెలిపారు. అలాగే చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు వీధుల్లో సంచరించేందుకు భయపడే పరిస్థితి నెలకొందన్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని వీధి కుక్కలను తక్షణమే పట్టు కొని, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో వై. వి. కృష్ణారెడ్డి, మహేష్, డింపు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమానికి నిర్వచనం కాంగ్రెస్ ప్రభుత్వం

రాష్ట్ర టాడి కార్పొరేషన్ వైస్ చైర్మన్ నాగరాజ్ గౌడ్



**అమరచింత, (సింగిడి):** ప్రజా సంక్షేమానికి నిర్వచనం కాంగ్రెస్ ప్రభుత్వ మని రాష్ట్ర టాడికార్పొరేషన్ వైస్ చైర్మన్ కేశం నాగరాజ్ గౌడ్ అన్నారు. శుక్రవారం వనపర్తిజిల్లా అమరచింత మున్సిపాలిటీ కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం వద్ద మున్సిపల్ చైర్ పర్సన్ జింక సువర్ణ రవి యాదవ్, తో కలిసి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 62 మంది కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు 62 లక్షల పైచిలుకు చెక్కులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో అమరచింత మండలానికి అనేక సంక్షేమ పథకాలు మంజూరెంగ్గైనట్లు తెలిపారు. మండలంలో 300 ఇందిరమ్మ ఇండ్లను ఇప్పటికే పూర్తి చేసినట్లు తెలిపారు. పార్టీలకు అతీతంగా ఇందిరమ్మ ఇండ్లను కేటాయించామన్నారు. ఇండ్లు మంజూరు చేయడమే కాకుండా అవి నిర్మించుకునేందుకు లబ్ధిదారులను ప్రోత్సహించామన్నారు. మంత్రి వాకిటి శ్రీహరి మొత్తం నియోజకవర్గానికి దాదాపు 1800 కోట్ల రూపాయలు సంక్షేమం కోసం ఖర్చు చేసినట్లు తెలిపారు. అమరచింత మండలానికి ఏమేమి కావాలో ఎప్పటికీ ఎస్టిమేషన్ వేసి ఆ ప్రకారంగా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో ఎంపీడీవో కార్యాలయానికి నాలుగు పర్యాయాలు అద్దె కట్టలేదని తాళాలు వేసిన చరిత్ర ఉందన్నారు. ప్రభుత్వ భవనాల్లోకి ప్రభుత్వ కార్యాలయాలను మార్చి సమస్యకు పరిష్కారం చూపమన్నారు. మంత్రి వాకిట శ్రీహరి ఆధ్వర్యంలో అమరచింత మండలాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తా మని ఈ సందర్భంగా నాగరాజుగౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రవికు మార్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు రాజేందర్ రెడ్డి, డిసిసి కార్యదర్శి ముదిరాజు రమేష్, పట్టణ అధ్యక్షులు రవికాంత్, మాజీ పట్టణ మండల అధ్యక్షులు కేజీ మహేం దర్ రెడ్డి అరుణ్ కుమార్, జగన్ రెడ్డి, జింక రవి, ధర్మపురం శ్రీనివాసులు,కౌన్సిలర్లు కో ఆప్షన్ సభ్యులు సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటరుగా

## నమోదు చేసుకోవాలి:

కేఎల్ఆర్, డీబీఆర్

– ప్రజల కోసం హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేయాలి.



**ఎల్బీ నగర్, (సింగిడి):** అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, టీపీసీసీ మెంబర్ దేప భాస్కర్ రెడ్డి (కేఎల్ఆర్, డీబీఆర్) అన్నారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం రామకృష్ణాపురం, ఎన్టీఆర్ నగర్, సరూర్ నగర్ డివిజన్ ముమ్మరంగా కొనసాగుతున్న కార్యక్రమంలో కేఎల్ఆర్, డీబీఆర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని మహేందర్ యాదవ్, సరూర్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బోయిని శంకర్ యాదవ్, రంగారెడ్డి జిల్లా జనరల్ సెక్రెటరీ చిలుక ఉపేందర్ రెడ్డి, నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పిడి లింగస్వామి గౌడ్, తలాటి రమేష్ నేత,దుబ్బాక శేఖర్, రాజు నాయక్,మహమ్మద్, నబీ, రేణుక కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఆల్ప్రాజోలామ్‌తో

## కల్తీ చేసిన కల్లు విక్రయం

– ఇద్దరు నిందితుల అరెస్ట్

60 కల్లు సీసాలు,2 మొబైల్ ఫోన్లు స్వాధీనం..

వివరాలు వెల్లడించిన ఎల్లారెడ్డి సీఐ డి.రాజారెడ్డి.



**కామారెడ్డి రూరల్, (సింగిడి):** విశ్వసనీయ సమాచారం మేరకు 06-08-2026న ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలోని వెల్లుట్ల గ్రామంలో ఎస్సై బాల సుబ్రమణ్యాచారి ఆధ్వర్యంలో పోలీసులు ఓ కల్లు దుకాణంపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో దుకాణంలో ఉన్న కల్లు విక్రేత సాతెల్లి నాగేశ్వర్ గౌడ్ను అదుపులోకి తీసుకుని,విని యోగదారులకు విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన 60 కల్లు సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ప్రాథమిక విచారణలో కల్లులో ఆల్ప్రాజోలామ్ అనే మత్తు పదార్థాన్ని కలిపి విక్రయిస్తున్నట్లు వెల్లడైంది. అదే సమయంలో దుకాణంలో కల్లు సేవిస్తున్న ఇద్దరు వ్యక్తులకు నిర్వహించిన ప్రాథమిక డ్రగ్ టెస్టులో బెంజోడయాజెపైన్ పాజిటివ్గా తేలింది. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన వైద్య పరీక్షల్లో కూడా (బెంజోడయాజెపైన్) పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. దర్యాప్తును కొనసాగించిన పోలీసులు 07-08-2026న కల్లు దుకాణం లైసెన్స్ హోల్డర్ మాసాని మాస గౌడ్ను అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో తన కల్లు దుకాణం లైసెన్స్‌ను సంవత్సరానికి రూ. 2,50,000/-కు నాగేశ్వర్ గౌడ్‌కు లీజుకు ఇచ్చినట్లు వెల్లడించాడు. లైసెన్స్‌పై నాగేశ్వర్ గౌడ్ కల్లు విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో నిర్ధారణ అయింది. ఈ కేసులో పోలీసులు 60 కల్లు సీసాలు,రెండు మొబైల్ ఫోన్లు మరియు ఇతర సంబంధిత ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి గౌరవ న్యాయస్థానం ముందు హాజరుపరుస్తున్నట్లు ఎల్లారెడ్డి సీఐ డి.రాజారెడ్డి తెలిపారు. ప్రజలకు విజ్ఞప్తి మత్తు పదార్థాలు కలిపిన కల్లు లేదా ఇతర ఆహార పదార్థాలు,పానీయాలను విక్రయిస్తున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కామారెడ్డి జిల్లా పోలీసులు ప్రజలను కోరుతున్నారు. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే ఇటువంటి అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# చేనేత కార్మికులకు పని కల్పిస్తాం..!

సంఘం అభివృద్ధికి అందరూ సహకరించాలి: చేనేత సహకార సంఘం అధ్యక్షుడు అంకం మధు

**దుబ్బాక ప్రతినిధి, (సింగిడి):** జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని దుబ్బాక చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సహకార సంఘం కార్యాలయం ఎదుట జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన చేనేత సహకార సంఘం అధ్యక్షుడు అంకం మధు మాట్లాడుతూ, అర్హులైన ప్రతి చేనేత కార్మికుడికి చేతినిండా ఉపాధి కల్పించేందుకు సంఘం కృషి చేస్తుందని తెలిపారు. చేనేత రంగం ఎన్నో కుటుంబాలకు జీవనాధారమని, ప్రస్తుతం పని లేక అనేక మంది నేత కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అలాంటి పరిస్థితులను అధిగమించి వారికి నిరంతర ఉపాధి కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలు విదేశీ వస్త్రాలకు బదులుగా స్వదేశీ చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి వినియోగించాలని ఆయన పిలుపునిచ్చారు. చేనేత వస్త్రాల వినియోగం పెరిగితేనే నేత కార్మికుల కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం అవుతాయని తెలిపారు. నేటి కాలంలో విదేశీ వస్త్రాల వినియోగం పెరగడంతో చేనేత రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, ఈ పరిస్థితిని మార్చేందుకు ప్రతి ఒక్కరూ చేనేతకు అండగా నిలవాలని కోరారు. చేనేత సహకార సంఘం అభివృద్ధికి సభ్యులందరూ ఐక్యంగా పనిచేసి సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని ఆయన సూచించారు. ప్రతి చేనేత కార్మికుడికి ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా సంఘం నిరంతరం కృషి చేస్తుందని



స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు జిందం గాలయ్య, చేనేత సహకార సంఘం నాయకులు గాజుల భాస్కర్, గాజుల తిరుపతి, చెరుకు కాశయ్య, బింగి రవి, సుదర్శన్‌తో పాటు పలువురు చేనేత కార్మికులు పాల్గొన్నారు.

# పుల్కల్ గ్రామ భద్రతకు 28 సీసీ కెమెరాల ఏర్పాటు

ప్రజల భద్రతే లక్ష్యంగా. గ్రామస్తుల భాగస్వామ్యంతో నిఘా వ్యవస్థ పటిష్టం





ట్రాఫిక్, సైబర్ నేరాలు, మత్తు పదార్థాలపై అవగాహన.

**కామారెడ్డి రూరల్, (సింగిడి):** కామారెడ్డి జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు, బిచ్కుంద మండలంలోని పుల్కల్ గ్రామంలో ప్రజల సహకారంతో 28 సీసీ కెమెరా లను ఏర్పాటు చేశారు. డీఎస్పీ ఆధ్వర్యంలో బిచ్కుంద సీఐ మరియు ఎస్ఐ సమక్షంలో గ్రామ సర్పంచ్ సంతోష్ పటేల్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు మరియు గ్రామ ప్రజల సహకారంతో ఈ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగింది. గ్రామంలోని ప్రధాన రహదారులు, కూడళ్లు, ప్రవేశ--నిష్క్రమణ మార్గాలు, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాలు పూర్తిగా కవర్ అయ్యే విధంగా కెమెరాలను ఏర్పాటు చేశారు. దీంతో గ్రామంలో నిరంతరం నిఘా కొనసాగిస్తూ, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలను గుర్తించేందుకు వీలవుతుంది.

**నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం.**

సీసీ కెమెరాలు నేరాల నివారణలో కీలక పాత్ర పోషిస్తాయని పోలీస్ అధికారులు తెలిపారు. దొంగతనాలు, గొడవలు, రోడ్డు ప్రమాదాలు, ఇతర నేర సంఘటనలు జరిగినప్పుడు నిందితులను త్వరితగతిన గుర్తించి పట్టుకోవడంలో సీసీ కెమెరాల దృశ్యాలు కీలక ఆధారాలుగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. అదేవిధంగా ట్రాఫిక్ నియంత్రణ, మహిళలు, వృద్ధులు మరియు ప్రజల భద్రత, అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల వేగవంతమైన స్పందనకు కూడా సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపా రు. ప్రతి గ్రామం సీసీ కెమెరాల నిఘాలో ఉంటే నేరాల నియంత్రణ మరింత సమర్థవంతంగా సాధ్యమవుతుందని అన్నారు.

ఈ సందర్భంగా డీఎస్పీ గ్రామ ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాల నివారణ, మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ చట్టాలను పాటిస్తూ, నేరాల నియంత్రణలో పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల్లో భద్రతా వ్యవస్థను పటిష్టం చేయడం అభినందనీయమని పోలీస్ అధికారులు పేర్కొన్నారు. పుల్కల్ గ్రామాన్ని ఆదర్శంగా తీసుకొని ఇతర గ్రామాలు కూడా ప్రజల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుని తమ గ్రామాల భద్రతను మరింత బలోపేతం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిచ్కుంద సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవి కుమార్, ఎస్ఐ రాజు, గ్రామ సర్పంచ్ సంతోష్ పటేల్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆషాఢం చివరి శుక్రవారం పెబ్బేరు ఆలయాల్లో భక్తి వెల్లివిరిసింది

వాసవీమాతకు జంభీరాలంకరణ

– లలితా త్రిపురసుందరీ దేవికి శాకాంబరీ దేవి అలంకరణ

**పెబ్బేరు, (సింగిడి):** ఆషాఢ మాసం చివరి శుక్రవారం సందర్భంగా వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలోని ఆలయాలు భక్తజన సందోహంతో కళకళలాడాయి. శ్రీ-శ్రీశ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం, శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు, విశేష అలంకరణలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఆలయాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవార్ల దివ్య దర్శనం చేసుకుని ఆశీస్సులు పొందారు. పెబ్బేరు పట్టణంలోని శ్రీశ్రీశ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిఆలయంలో ఆషాఢ మాసం చివరి శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని జంభీరాలంకరణ (నిమ్మకాయల అలంకరణ)లో అత్యంత సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ అర్చకులు కిట్టు స్వామి ఆధ్వర్యంలో తెల్లవారు జామునే అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అర్చనలు, పూజలు, మహా మంగళహారతి నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. చిన్నమ్మవారి ఉత్సవమూర్తిని ఆర్యవైశ్య మహిళలు సాంప్రదాయ బద్ధంగా అలంకరించగా, ఆలయం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది. సాయంత్రం కుంకుమార్చన, లలితా సహస్రనామ పారాయణం, వాసవి మాతా పారాయణం నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తిని పల్లకిలో కొలువుదీర్చి ఆలయ ప్రాంగణంలో పల్లకీసేవ నిర్వహిం చారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, మహిళలు, యువతులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

**శాకాంబరీ దేవి అలంకరణలో శ్రీ లలితా త్రిపురసుందరీ దేవి దర్శనం**

ఆషాఢ మాసం చివరి శుక్రవారం సందర్భంగా పెబ్బేరు పట్టణంలోని శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో కొలువై ఉన్న శ్రీ లలితా త్రిపురసుందరీ దేవి అమ్మవారిని శాకాంబరీ దేవి అలంకరణలో అత్యంత వైభవంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, కుంకుమార్చనలు నిర్వహించి విశేష పూజలు చేశారు. అనంతరం పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు,పుష్పాలతో శాకాంబరీ దేవి స్వరూపంలో అమ్మవారిని సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. శాకాంబరీ దేవి అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలు పొందారు. ఆలయ ప్రాంగణం భక్తిశ్రద్ధలతో నిండిపోగా, ఆలయ నిర్వాహకులు భక్తులకుతీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమం ఆధ్యాత్మిక ఉత్సాహంతో, భక్తిపారవశ్యంతో కొనసాగింది.





# యజ్ఞ-యాగాలు సమాజ శాంతికి దోహదం: ఎమ్మెల్యే కసిరెడ్డి



**ఆమనగల్లు, (సింగిడి):):** యజ్ఞ యాగాలు సమాజ శాంతి స్థాపనకు దోహదపడతాయని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం హనుమాన్ నగర్ లో ఉమా శంకర్ పద్మ దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన శత చండి సప్త శతి మహాయాగం యజ్ఞ--యాగ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూర్ణాహుతి అనంతరం పండితుల ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ దైవ కార్యక్రమాలు మానవాళి సన్మార్గ పురోగమనానికి, శాంతి స్థాపనకు ఉపకరిస్తాయి అన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. కల్వకుర్తి నియోజకవర్గం అన్ని రంగాలలో సమగ్రంగా అభివృద్ధి సాధించాలని వేడుకున్నారు. దైవ కార్యక్రమాలకు, పురాతన ఆలయాల పునరుద్ధరణకు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని నారాయణరెడ్డి పేర్కొన్నారు. పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ, డిసిసి కార్యదర్శి కల్లు వెంకటరమణారెడ్డి, వెంకటే శ్వరరావు, బిసి కార్పొరేషన్ చైర్మన్ శ్రీకాంత్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, వేద పండితులు, భక్తులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యం

జిల్లా గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాపు



**మహాదేవపూర్ (సింగిడి):** తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యాన్ని ప్రసాదిస్తాయని జయశంకర్ భూపాలపల్లి జిల్లా గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాపు అన్నారు. శుక్రవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మహాదేవపూర్ ఐసిడి ఎస్ ప్రాజెక్టు పరిధిలోని మహాదేవపూర్ 8 వా అంగన్వాడి సెంటర్ లో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిడ్డకు తల్లిపాలు ఎంతో శ్రేష్టమైనవని , పిల్లలకు ఎన్నో పోషకాలు అందించి ఆరోగ్యంగా ఉంచుతాయని ఆయన అన్నారు. స్థానిక సర్పంచ్ హసీనాబాను అక్బర్ ఖాన్ మాట్లాడుతూ తల్లి పాలు బిడ్డకు ఒక టీకా లాగా పనిచేస్తాయని, రెండున్నర సంవత్సరాల వరకు బిడ్డకు పాలు ఇవ్వడం వల్ల బిడ్డ ఎదుగుదలలో ఎంతో తోడ్పడతాయని ఆమె తెలిపారు. సిడిపిఓ రాధిక ఆదేశాల మేరకు ఈవో స్పందన ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్ర మంలో ఉప సర్పంచ్ తుంగల శ్రీజ, వార్డు సభ్యులు, అంగన్వాడి టీచర్లు,గర్భిణీ స్త్రీలు, బాలింతలు పాల్గొన్నారు.

## లక్ష గాజుల పూజ మహోత్సవంలో చిలుక దంపతులు



**ఎల్బీ నగర్, (సింగిడి):** ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చిలుక మధుర ఉపేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆర్ కెపురం డివిజన్ పరిధిలోని శ్రీ రామకృష్ణా పురం గల శ్రీశ్రీశ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో ఆషాఢ మాస చివరి శుక్రవారం సందర్భంగా లక్ష గాజుల పూజా మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మహోత్సవ వేడుకల్లో చిలుక మధుర ఉపేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై దుర్గా మల్లేశ్వర అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ఈఓ ఉమా రాణి,దేవాలయ మాజీ చైర్మెన్ తలాటి రమేష్ నేత, జగిని రమేష్, పెద్దవూర సైదులు, వెంకటేష్ గుప్త, బొడ్డుపల్లి మహేందర్, విజయ లక్ష్మీ, సంతోష్, నవీన్, పాండు, నాగేష్, సాయి కుమార్, విద్య సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదును

## ప్రారంభించిన కాంగ్రెస్



**కొడంగల్, (సింగిడి):** ఎమ్మెల్సీ ఓటర్ నమోదు కార్యక్రమాన్ని కొడంగల్ నియోజకవర్గం లోని దౌల్తాబాద్ మండ లంలో జిల్లా పార్టీ అధ్యక్షులు ధారాసింగ్ ఆధ్వర్యంలో ప్రారం భించారు. గ్రామ కాంగ్రెస్ పార్టీ కమిటీలు మరియు ప్రత్యేక ఓటర్ మ్యాపింగ్ నమోదు కార్యక్రమం పై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఓటర్లను ప్రత్యేక శ్రద్ధతో నమోదు చేయించాలని ధారాసింగ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దౌల్తాబాద్ మండల ఇన్చార్జి శ్రీనివాస్ గౌడ్, కళల్ చంద్రశేఖర్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు గత్ప వెంకట్రావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కుర వెంకట రాములు, మరియు యూత్ కాంగ్రెస్ ఎన్ ఎస్ యు ఐ నాయకులు పాల్గొన్నారు.

## బాచుపల్లిలో ఘనంగా "మదర్ సాల్"

కార్యక్రమంలో పాల్గొన్న కొలను హనుమంతరెడ్డి.



**కుత్బుల్లాపూర్, (సింగిడి):** బాచుపల్లి గ్రామంలో ముస్లిం సోదరుల ఆధ్వర్యంలో నిర్వహించిన "మదర్ సాల్" (మదర్సా) కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొ న్నా రు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఇటువంటి కార్యక్రమాలు గ్రామంలో సోదరభావం, ఐక్యత, శాంతియుత వాతావరణాన్ని పెంపొందించడంలో దోహదపడతాయని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఐకమత్యంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ కొలన్ కృష్ణ రెడ్డి, మాజీ సర్పంచులు సుధాకర్, సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షులు కొలన్ జీవన్ రెడ్డి, నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సీతారామ్ రెడ్డి, కొలన్ బాల్ రెడ్డి, ఆలేటి శ్రీనివాస్, బిక్కన్ షా, కొలన్ యుద్ధం రెడ్డి,గోపాల్ రెడ్డి, జనార్ధన్, ఎస్.డి సాలీమ్, ఎస్.డి సాలీమ్ అక్బర్, ఫారూఖ్,చాంద్, అక్బర్, ఖాజా,శంకర్ రెడ్డి, జీతూ మాధవ్ రెడ్డి, సి.ఏచ్. జీతయ్య, కె. జీతయ్య, ఆగం శంకర్, వెంకటేష్,ఉదం రెడ్డి, జి. శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## 6 నుండి 14 వరకు జరిగే పాదయాత్రలను విజయవంతం చేయండి

**సిపిఐ మక్తల్ అసెంబ్లీ కన్వీనర్ శ్రీహరి**



**అమరచింత, (సింగిడి):** కేంద్రంలోని బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను పాలన నిరసిస్తూ ఆగస్టు 6 నుండి 14 వరకు చేపట్టే సిపిఐ పాదయాత్రలను విజయవంతం చేయాలని ఆ పార్టీ మక్తల్ అసెంబ్లీ కన్వీనర్ పి. శ్రీహరి పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం అమరచింతలోని సిపిఐ కార్యాలయంలో పాదయాత్రలకు సంబంధించిన గోడపత్రికలను సిపిఐ నాయకులతో కలిసి ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ ధరల పెరుగుదలను అరికట్టాలని ప్రతి యువకుడికి ఉద్యోగం ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సార్వత్రిక విద్యను అమల్లోకి తేవాలని మహిళా రిజర్వేషన్ తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కులను సంరక్షించాలని పంటలకు కనీస మద్దతు ధర చేపట్టాలని బద్లావ్ జరూరి మార్పు కావాలి అనే నినాదంతో సిపిఐ పాదయాత్ర చేపట్టిందని ఈ పాదయాత్రను రేపు ఈర్లదిన్నె నుండి చేపడుతున్నట్లు ఈ పాదయాత్రలో భారీగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి అబ్రహం, పట్టణ కార్యదర్శి రవీందర్, నాయకులు శ్యాంసుందర్ భాస్కర్ రఘు కుతుబ్ సౌలు యాకోబు తో పాటు పలువురు పాల్గొన్నారు.

## ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలి



**భిక్కనూర్, (సింగిడి):** పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ బీజేవైఎం ఆధ్వర్యంలో శుక్రవారం భిక్కనూర్ మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలను సందర్శించి విద్యార్థుల నుంచి సంతకాల సేకరణ చేపట్టారు. బీజేవైఎం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణ రెడ్డి, జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు నంది వేణు ఆదేశాల మేరకు బీజేవైఎం నాయకులు పుట్నాల పవన్, మండల అధ్యక్షుడు ఉప్పరి రమేష్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బకాయిలు చెల్లించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంతంపల్లి ఉపసర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా నాయకుడు రవీందర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు అరిగ నర్సింలు, వివిధ గ్రామాల అధ్యక్షులు భాస్కర్, సందీప్, బాల్ లింగం, రామచంద్రం, బండమీది రాజు, జేపీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## జైలు భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్**



**జమ్మికుంట, (సింగిడి):** ఏఐకేఎస్, సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘాల పిలుపులో భాగంగా ఈ నెల 10న కరీంనగర్‌లో నిర్వహించనున్న జైలు భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం ఇల్లంతకుంట మండల కేంద్రంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్, తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్య దర్శి చెల్పూరి రాము. మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూ లంగా రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీల హక్కులను కాలరాస్తూ ప్రజా వ్యతిరే క విధానాలను అమలు చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసే విద్యుత్ సంస్కరణలను వెంటనే ఉపసంహరించుకోవాలని, కార్మికుల హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, రైతులు, వ్యవసాయ కూలీల జీవనోపాధిని దెబ్బతీసే చట్టాలను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాల కారణంగా రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని, కార్మికులు ఉపాధి భద్రత కోల్పోతున్నారని, వ్యవసాయ కూలీలు తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఆగస్టు 10న కరీంనగర్‌లో జరిగే జైలు భరో కార్యక్రమంలో రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు భారీ సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి గట్టి హెచ్చరిక పంపాలని నాయకులు పిలుపునిచ్చారు. కొత్తూరు మల్లయ్య, కండే రాజయ్య, నరేష్, తిరుపతి, రమేష్, పాల్గొన్నారు.

## "సురక్షా కా తిరంగా".. విద్యార్థులకు సైబర్ మోసాలపై అవగాహన

**ఉద్యోగాలు, ఓటీపీ, పెట్టుబడులు, ఫేక్ లోన్ యాప్‌ల ఉచ్చుపై హెచ్చరికలు**



**భీమదేవరపల్లి (సింగిడి):** డిజిటల్ యుగంలో పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల విద్యార్థుల్లో అప్రమత్తత పెంచేందుకు "సురక్షా కా తిరంగా" కార్యక్రమంలో భాగంగా హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని వంగర పోలీస్ స్టేషన్ పరిధిలో గల పీవీఆర్ఆర్ రెసిడెన్షియల్ పాఠశాలలో సైబర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వంగర ఎస్సై దివ్య మాట్లాడుతూ సైబర్ నిపుణులు, పోలీసులు ఉద్యోగాల పేరుతో జరిగే మోసాలు, ఓటీపీ చెప్పించి బ్యాంకు ఖాతాల నుంచి నగదు కాజేసే మోసాలు, అధిక లాభాల పేరుతో పెట్టుబడి మోసాలు, నకిలీ లోన్ యాప్‌ల ద్వారా జరుగుతున్న ఆర్థిక దోపిడీల గురించి విద్యార్థులకు వివరించారు. తెలియని వ్యక్తులతో వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు పంచుకోవద్దని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటీపీని ఎవరికీ చెప్పవద్దని సూచించారు. అనుమానాస్పద లింకులు, యాప్‌లకు దూరంగా ఉండాలని, సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని అవగాహన కల్పించారు. విద్యార్థులు సైబర్ భద్రతకు సంబంధించిన సందేహాలను అడిగి నివృత్తి చేసుకోగా, కార్యక్రమం ఆసక్తికరంగా సాగింది.

# సమాచార కమిషన్ పేరుతో ఖర్చులెన్ని..?

**ఈ-పంచాయతీ ఆపరేటర్ జీతం పేరుతో మళ్లిన నిధులెన్ని..?**

**ఆర్టీఐ కింద వివరాలు కోరిన చుక్క గంగారెడ్డి**






**బుగ్గారం, (సింగిడి):** తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్‌కు వెళ్లిన పేరుతో చేసిన ఖర్చులు, ఈ-పంచాయతీ ఆపరేటర్ జీతం పేరుతో మండలంలోని గ్రామ పంచాయతీల నుంచి మళ్లించిన నిధుల వివరాలను వెల్లడించాలని కోరుతూ సీనియర్ ఆర్టీఐ కార్యకర్త, తెలంగాణ ఉద్యమ కారుడు, తెలంగాణ జన సమితి జగిత్యాల జిల్లా అధ్యక్షుడు చుక్క గంగారెడ్డి శుక్రవారం బుగ్గారం మండల ప్రజా పరిషత్ కార్యాలయం, గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం కింద వేర్వేరుగా దరఖాస్తులు సమర్పించారు. 2019 జనవరి 1 నుంచి ఈ-పంచాయతీ ఆపరేటర్ పేరుతో మళ్లించిన నిధులు, ఆపరేటర్లకు చెల్లించిన జీతాలు, సమాచార కమిషన్ విచారణకు హాజరైన అధికారుల ప్రయాణ ఖర్చులు, వాటి చెల్లింపుల వివరాలను ఆధారాలతో సహా అందజేయాలని కోరారు. కమిషన్ నుంచి పిలుపు లేకున్నా కొందరు అధికారులు హాజరైన కారణాలు, విధుల దుర్వినియోగానికి బాధ్యులెవరో వెల్లడించాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా బుగ్గారం గ్రామ పంచాయతీకి వచ్చిన నిధులు, ఖర్చుల వివరాలు, ఈ-పంచా యతీ నిధుల మళ్లింపులపై కూడా ప్రత్యేకంగా సమాచారం కోరారు. గ్రామ సభలో భూకబ్జాల నివారణ, బస్ షెల్టర్ పూర్తి, డ్రైనేజీలు, ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టాలని అధికారులను కోరుతూ, నిబంధనలు పాటించకపోతే క్వాలిటీ కంట్రోల్ అధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఆర్టీఐ దరఖాస్తు సమర్పించే సమయంలో ఫోటో దిగేందుకు ఎంపీడీవో సుమంత్ నిరాకరించారని చుక్క గంగారెడ్డి ఆరోపించారు.

# చేనేత పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**అమీన్పూర్‌లో 12వ జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు**







**అమీన్పూర్, (సింగిడి):** అమీన్పూర్ పట్టణ పద్మశాలి సంఘం, అమీన్పూర్ మండల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో 12వ జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ శ్రీ భావనాఋషి పద్మశాలి భవనంలో జరిగిన ఈ కార్యక్రమానికి సంఘ గౌరవ అధ్యక్షులు మాకం మల్లేష్ నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా మాకం మల్లేష్ మాట్లాడుతూ ఆధునిక కాలంలోనూ చేనేత పరిశ్రమను పరిరక్షించి, ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి భారతీయుడి పై ఉందన్నారు. చేనేత వస్త్రాలను కొనుగోలు చేయడం ద్వారా నేతన్నల జీవనోపాధికి అండగా నిలవడంతో పాటు దేశ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడినవారమవుతామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత కళాకారులను గుర్తించి, వారికి అందాల్సిన సంక్షేమ పథకాలు, ఆర్థిక సహాయం పూర్తిస్థాయిలో చేరేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అమీన్పూర్ పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు కుంట్ల యెల్లప్ప, ప్రధాన కార్యదర్శి ఆనందపు మహేందర్, అమీన్పూర్ మండల పద్మశాలి సంఘం అధ్యక్షులు వనం యాదగిరి, గోనె లింగం, మసుర ఆగమయ్య, భామిని జోగినాథ్, ఉడుత ఆనంద్, పంచల జనార్ధన్, బత్తుల కనకారావు, గోప శ్రీ విష్ణు, పొన్న ప్రభాకర్, నల్ల లింగయ్య, రామనాథం, నాగభూషణం, పట్నం కృష్ణ, సంగు ప్రభాకర్‌తో పాటు పద్మశాలి సంఘం సభ్యులు, కుల బాంధవులు పాల్గొన్నారు.

# గాంధీనగర్ పారిశ్రామిక వాడ ఎంటిఏ ఆర్, ఈఓయు టెక్నాలజీస్ యాజమాన్య నిరంకుశ వైఖరి

**సిఐటియు మేడ్చల్ జిల్లా మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో షాపూర్ నగర్ లో ర్యాలీ**

**కుత్బుల్లాపూర్, (సింగిడి):** : గాంధీనగర్ పారిశ్రామిక వాడలోని ఎంటిఏఆర్, ఈఓయు టెక్నాలజీస్ యాజమాన్య నిరంకుశ వైఖరిని వ్యతిరేకిస్తూ అక్రమంగా తొలగించిన ఫిక్స్ టర్మ్ కార్మికులను వెంటనే విధులలోకి తీసుకోవాలని సిఐటియు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో షాపూర్ నగర్ లో ర్యాలీ ర్యాలీ నిర్వహించారు. సిఐటియు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గాంధీనగర్ పారిశ్రామిక వాడలో ఎంటిఏఆర్ టెక్నాలజీస్ పరిశ్రమలో గత 15 సంవత్సరాలుగా పనిచేస్తున్న ఫిక్స్ టర్మ్ కార్మికులను యాజమాన్యం నిరంకుశంగా వ్యవహరిస్తూ కార్మిక చట్టాలను అమలు చేయాలని ఆందోళన చేస్తున్న కార్మికులను విధుల నుండి తొలగింపుకు నిరసనగా షాపూర్ నగర్ రైతు బజార్ నుండి ఉషోదయ టవర్స్ వరకు ఫిక్స్ టర్మ్ కార్మికులకు మద్దతుగా ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ ర్యాలీలో పాల్గొన్న సిఐటియు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సహాయ కార్యదర్శి ఐలపురం రాజశేఖర్, సిఐటియు కుత్బుల్లాపూర్ మండల కన్వీనర్ కీలు కానీ లక్ష్మణ్ మాట్లాడుతూ గాంధీనగర్ పారిశ్రామిక వాడలో ఉన్న ఎంటీఎఆర్ ఈ ఓ యు పరిశ్రమలో గత పది పదిహేను సంవత్సరాల నుండి 350 మంది ఐటిఐ డిప్లమా చదివి ఫిక్స్ టర్మ్ కార్మికులుగా విధులు నిర్వహిస్తూ ఎలాంటి ఉద్యోగ భద్రత లేక శాశ్వత ఉద్యోగ హోదా ఇవ్వకుండా ఒప్పందాలను పునరుద్ధరిస్తూ ఉద్యోగ భద్రతను దూరం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది కార్మికుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసే విధంగా యాజమాన్యం వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. కంపెనీలో పని చేస్తున్న 350 మంది ఫిక్స్ టర్మ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, గత ఎనిమిది రోజులుగా ఆందోళన చేస్తున్న కార్మికులను అకారణంగా విధుల నుండి తొలగిస్తూ సెటిల్మెంట్ చేస్తూ నోటీసులు జారీ చేయడం కార్మిక హక్కులు




కాలరాయడమేనని ఈ సంద ర్భంగా యాజమాన్య నిరంకుశ విధానాలను ఎండగట్టారు. కంపెనీ యాజమాన్యాలు తీసుకునే స్వార్థపూరిత చర్యల వలన కార్మికులను బానిస లుగా మార్చే కుట్రలో భాగమని అన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం తొల గించిన కార్మికులను వెంటనే విధులలోకి తీసుకొని పర్మినెంట్ కార్మికులుగా గుర్తించాలని లేనిపక్షంలో జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణతో ఎంటిఏఆర్ యాజమాన్యంతో కార్మికులకు న్యాయం జరిగే వరకూ పోరాడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బొడిగె లింగస్వామి, ఈ దేవదానం, కే శీను, పసుల అంజయ్య, తిమ్మప్ప, కరుణాకర్, భాషా, యాదవ రెడ్డి, ఆంజనేయులు, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

# కుచనపల్లి-మాలపల్లి బ్రిడ్జి నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరు

**టపాసులు పేల్చి స్వీట్లు పంచుకున్న గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు**

**నెరవేరిన రెండు గ్రామాల చిరకాల వాంఛ.. వర్షాకాల ఇబ్బందులకు ఇక శాశ్వత పరిష్కారం..**



**హుస్నాబాద్ (సింగిడి):** హుస్నాబాద్ మండలంలోని కుచనపల్లి--మాలపల్లి గ్రామాల మధ్య ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న బ్రిడ్జి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 3 కోట్ల నిధులు మంజూరు చేయడంతో రెండు గ్రామాల ప్రజల చిరకాల వాంఛ నెరవేరింది. నిధుల మంజూరు సందర్భంగా గ్రామస్తులు, రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు టపాసులు పేల్చి స్వీట్లు పంచుకుని ఆనందోత్సాహాలతో సంబరాలు నిర్వహించారు. ఎన్నో ప్రభుత్వాలు మారినా, పలువురు ప్రజాప్రతినిధులు హామీలు ఇచ్చినా బ్రిడ్జి నిర్మాణం కార్యరూపం దాల్చలేదని, ప్రతి వర్షాకాలంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవాళ్లమని గ్రామస్తులు తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మంత్రి పొన్నం ప్రభాకర్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి తన మాట నిలబెట్టుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ బ్రిడ్జి నిర్మాణంతో కుచనపల్లి, మాలపల్లి గ్రామాల ప్రజలతో పాటు రైతులకు రవాణా సౌకర్యం మెరుగుపడి, విద్యార్థులు, అత్యవసర సేవలు, వ్యవసాయ ఉత్పత్తుల రవాణా మరింత సులభతరం కానుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బంక చందు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా మంత్రి పొన్నం ప్రభాకర్ నిరంతరం కృషి చేస్తున్నారని, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెన్న రాజు మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధిలో మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక పాత్ర పోషిస్తున్నారని, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలతో పాటు గ్రామీణ మౌలిక వసతుల కల్పనలోనూ ముందుండి పనిచేస్తున్నారని పేర్కొన్నారు. బ్రిడ్జి నిర్మాణానికి రూ. 3 కోట్లు కేటాయించినందుకు గ్రామ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మండప పద్మ--జయపాల్ రెడ్డి, జిల్లా ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బొమ్మగాని రాజ్‌కుమార్, స్థానిక కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.



## గంగమ్మ తల్లికి మొక్కులు తీర్చుకున్న మాజీ జెడ్పీటీసీ



**కామారెడ్డిప్రతినిధి, (సింగిడి):** జిల్లాలోని నాగిరెడ్డి పేట మండలంలోని పోచారం ప్రాజెక్టు వద్ద గంగమ్మ తల్లికి శుక్రవారం మాజీ జడ్పీటీసీల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, స్థానిక మాజీ జెడ్పిటిసి ఉమ్మన్నగారి మనోహర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయ కులు ప్రత్యేక పూజలు చేసి 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. గత 20 ఏళ్లుగా వర్షాకాలం ప్రారంభంలో ప్రాజెక్టు నిండాలని ఐదు కొబ్బరికాయలు కొట్టి మొక్కుకుం టామని, ప్రాజెక్టు నిండిన తర్వాత 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీగా కొనసాగుతోందని మనోహర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ మండల అధ్యక్షులు గుర్రాల సిద్దయ్య మాట్లాడుతూ... మాజీ జెడ్పిటిసి ఉమన్నగారి మనోహర్ రెడ్డి గత ఇరవై సంవత్సరాలనుండి పోచారం ప్రాజెక్టు వద్ద ఉన్న గంగమ్మ తల్లికి నూట ఒక కొబ్బరికాయలు కొట్టడం వల్ల అప్పటినుండి ఇప్పటివరకు ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండి పొంగిపొరడం ఆనందంగా ఉంది అని హర్షం వ్యక్తం చేశారు ప్రాజెక్టు వద్ద ఉన్న గంగమ్మ తల్లికి మొక్కులు మొక్కితే కోరికలు తీర్చుతాయని మాజీ జెడ్పిటిసి మనోహర్ రెడ్డి తెలిపారు. గత వర్షాకాలం సందర్భంలో పోచారం ప్రాజెక్టు పూర్తి స్థాయిలో దెబ్బతిని కుంగిపోయే స్థితిలో ఉండగా గంగమ్మ తల్లి పోచారం ప్రాజెక్టును కాపాడిందన్నారు . ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ అధ్యక్షుడు సిద్దయ్య, సర్పంచ్లు వంశీ కృష్ణ గౌడ్, మహేందర్, సాయిలు, బాల్య నాయక్, మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు మోతే శ్రీనివాస్, తాండూర్ సొసైటీ వైస్ చైర్మన్ మిద్దె బాబురావు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు హనుమంత్ రెడ్డి, నరేష్, సిద్దిరామ్ రెడ్డి, విజయ్ కుమార్, పికే రాజు, మల్లారెడ్డి, రైతులున్నారు.



## జోయాలుక్కాస్ 'బ్రిలియన్స్ వజ్రాభరణాల ప్రదర్శన' ప్రారంభం

**ఆగస్టు 23 వరకు ప్రత్యేక డిజైన్లు..**

**రూ. లక్షకు పైగా వజ్రాభరణాల కొనుగోలుపై ఉచిత బంగారు నాణెం**



**కరీంనగర్, (సింగిడి):** కరీంనగర్‌లోని జోయాలుక్కాస్ ఆభరణాల ప్రదర్శనశాలలో ఆగస్టు 7 నుంచి 'బ్రిలియన్స్ వజ్రాభరణాల ప్రదర్శన' ప్రారంభమైంది. ఆగస్టు 23 వరకు కొనసాగే ఈ ప్రత్యేక ప్రదర్శనలో పెళ్లిళ్లు, వేడుకలు, నిత్య వినియోగానికి అనువైన అత్యాధునిక, సాంప్రదాయ వజ్రాభరణాల ప్రత్యేక నమూనాలను వినియోగదారుల కోసం అందుబాటులో ఉంచారు. జోయాలుక్కాస్ గ్రూప్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జోయ్ అలుక్కాస్ మాట్లాడుతూ, తెలంగాణ వినియోగదారుల కోసం అత్యుత్తమ నైపుణ్యం, సరికొత్త రూపకల్పనతో రూపొందించిన వజ్రాభరణాలను ఈ ప్రదర్శన ద్వారా అందిస్తున్నామని తెలిపారు. అందం, నాణ్యత, ప్రత్యేకతకు ప్రతీకగా నిలిచే డిజైన్లు ఈ ప్రదర్శనలో ఆకర్షణగా ఉంటాయని పేర్కొన్నారు. ప్రదర్శన సందర్భంగా రూ. 1 లక్ష లేదా అంతకంటే ఎక్కువ విలువైన వజ్రాభరణాలు కొనుగోలు చేసే ప్రతి వినియోగదారునికి ఉచిత బంగారు నాణెం అందజేయనున్నట్లు సంస్థ వెల్లడించింది. పరిమిత కాలం పాటు మాత్రమే నిర్వహించే ఈ ప్రదర్శనను సందర్శించి ప్రత్యేక వజ్రాభరణాల సేకరణను వీక్షించాలని నిర్వాహకులు ఆహ్వానించారు.

## మరిపెడ కాంగ్రెస్‌కు కొత్త సారథులు..

**- మండల, పట్టణ అధ్యక్షుల నియామకం**



**డోర్నకల్ /మరిపెడ (సింగిడి):** కాంగ్రెస్ పార్టీ నూతన మండల, పట్టణ అధ్య క్షుల పేర్లను శుక్రవారం విడుదల చేశారు. పీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు, డీసీసీ అధ్యక్షురాలు డాక్టర్ భుక్యా ఉమా మురళి నాయక్ ఆమోదంతో డోర్నకల్ నియోజకవర్గంలోని పలు మండల, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులను నియమించారు. డోర్నకల్ నియోజకవర్గ ఎమ్మెల్యే రామచంద్రనాయక్ నాయకత్వంలో పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు నూతనంగా నియమితులైన అధ్యక్షులు సమన్వయంతో పనిచేయాలని కాంగ్రెస్ శ్రేణులు ఆకాంక్షిస్తున్నాయి. ఇందులో భాగంగా మరిపెడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా గుగులోత్ రవి నాయక్, మరిపెడ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా బానోత్ రాంలాల్, చిన్నగూడూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎం. వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. నూతన అధ్యక్షులు గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని పార్టీ నాయకత్వం సూచించింది. నూతనంగా నియమితులైన నాయకులకు స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

## నూతన ఎస్ఐ అనిల్‌కు ఘన సన్మానం



**భిక్కనూర్, (సింగిడి):** భిక్కనూర్ పోలీస్ స్టేషన్‌లో నూత నంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ అనిల్‌ను మండల ఉపసర్పంచ్‌ల ఫో రం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానిం చారు. ఫోరం అధ్య క్షుడు గొల్లపల్లి వినోద్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ప్రజలకు అం దుబాటులో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు సమర్థ వం తంగా పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్ర మంలో ఫోరం కార్యదర్శి రాజిరెడ్డి, కోశాధికారి సుజాత రాంరెడ్డి, ఉపసర్పంచ్‌లు ప్రకాష్ గౌడ్, కె. రమేష్, శ్రీనివాస్ రెడ్డి, చైతన్య కొండల్ రెడ్డి, ఏ. రమేష్, సాయన్న, ఆర్. రాజు, బర్ల స్వామి పాల్గొని ఎస్ఐ అనిల్‌ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

singidinews@gmail.com



## హాయ్ చెప్పడానికి
# నయన్ సిద్ధం



'హాయ్' సినిమాతో ప్రేక్షకుల్ని పలకరించనుంది నటి నయనతార. ఆమె.. కవిన్ కలిసి నటించిన ఈ సినిమాని విష్ణు తెరకెక్కించారు. జీ స్టూడియోస్, ది రౌడీ పిక్చర్స్, సెవెన్ స్క్రీన్ స్టూడియోస్ సంస్థలు నిర్మించాయి. కె భాగ్యరాజ్, రాధికా శరత్‌కుమార్, ప్రభు తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రాన్ని ఈ నెల 28న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు శుక్రవారం ప్రకటించారు. ఈ సందర్భంగా దర్శకుడు విష్ణు మాట్లాడుతూ.. "ఇదొక మంచి ఫీల్‌గుడ్ ఎంటర్‌టైనర్. కుటుంబ బంధాలు, భావోద్వేగాలు, హాస్యం మేళవింపుగా ఉంటుంది. కచ్చితంగా కుటుంబ సమేతంగా కలిసి ఆస్వాదించే చిత్రమిది" అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాకి జెన్ మార్టిన్ సంగీతమందించగా.. రాజేశ్ శుక్లా ఛాయాగ్రాహకుడిగా వ్యవహరించారు.

# త్రివిక్రమ్‌తో మా బంధం బలమైనది
## సూర్యదేవర నాగవంశీ

ఒక బ్యానర్‌లో పనిచేసే వ్యక్తుల మధ్య మంచి అనుబంధం ఏర్పడితే.. అదే బంధం కొనసాగుతుందని, దానికి ప్రత్యేకమైన అగ్రిమెంట్లు అవసరం లేదని ఆయన



పేర్కొన్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నాగవంశీ.. నిర్మాతల కాంపౌండ్స్, దర్శకుడు త్రివిక్రమ్‌తో తమ కుటుంబానికి ఉన్న అనుబంధం గురించి ఆసక్తికర విషయాలను వెల్లడించారు. డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్‌తో వారి కుటుంబానికి ఉన్న అనుబంధం గురించి నాగవంశీ మాట్లాడుతూ.. తన బాబాయి (చిన్నబాబు) ఇండస్ట్రీలోకి రావాలని అనుకున్న సమయంలో తొలి సినిమాను త్రివిక్రమ్ దర్శకత్వంలోనే చేయాలని కోరుకున్నారని తెలిపారు. త్రివిక్రమ్ పనితీరు, సినిమాలపై ఆయనకు ఉన్న అభిమానం కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. ఆ సమయంలో 'జులాయి' సినిమా ప్రారంభమైనప్పటి నుంచి త్రివిక్రమ్‌తో తమ అనుబంధం మరింత బలపడిందని నాగవంశీ పేర్కొన్నారు. 'హారిక అండ్ హాసిని క్రియేషన్స్' అనే బ్యానర్ పేరును కూడా త్రివిక్రమే సూచించారని, ఆ బ్యానర్ లోగోను సైతం ఆయనే డిజైన్ చేశారని వెల్లడించారు. 'అప్పటి నుంచి ఇప్పటివరకు త్రివిక్రమ్ బయట బ్యానర్‌లో సినిమా చేయలేదు. దీనికి ఎలాంటి అగ్రిమెంట్లు లేవు. మా మధ్య ఉన్న రిలేషన్‌షిప్ అలాంటిది. ఒక ఫ్యామిలీలా అయిపోయాం' అని నాగవంశీ చెప్పుకొచ్చారు.

త్రివిక్రమ్ తమ బ్యానర్‌తోనే వరుసగా సినిమాలు చేస్తూ ప్రయాణం కొనసాగిస్తున్న నేపథ్యంలో.. తమ వైపు నుంచి కూడా ఆయనకు ఎక్స్‌క్లూజివిటీ ఇవ్వడం సహజమేనని నాగవంశీ అన్నారు. 'హారిక అండ్ హాసిని క్రియేషన్స్' బ్యానర్‌ను ప్రధానంగా త్రివిక్రమ్ సినిమాల కోసం కొనసాగిస్తున్నట్లు వివరించారు. అయితే త్రివిక్రమ్‌కు ఆ బ్యానర్‌లో వాటా ఉందనే ప్రచారంపై కూడా నాగవంశీ క్లారిటీ ఇచ్చారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్‌లో త్రివిక్రమ్‌కు ఎలాంటి షేర్ లేదని, ఆయనకు రెమ్యునరేషన్ మాత్రమే ఉంటుందని స్పష్టం చేశారు. ఆయనకు సంబంధించిన షేర్ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌లో ఉంటుందని తెలిపారు. అలాగే సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌కు సంబంధించిన ప్రాజెక్టుల్లో త్రివిక్రమ్ కీలకంగా భాగస్వామ్యం అవుతున్నారని, స్క్రిప్టులు, ఇతర సినిమా విషయాల్లో ఆయన సలహాలు కూడా తీసుకుంటామని నాగవంశీ వెల్లడించారు. త్రివిక్రమ్‌తో తమ బంధం కేవలం సినిమాలకు సంబంధించినది మాత్రమే కాదని.. సంవత్సరాలుగా కొనసాగుతున్న అనుబంధమే తమ ప్రయాణానికి కారణమని నాగవంశీ చెప్పుకొచ్చారు.

సినిమా సింగిడి
Cinma Singidi
ఆదివారం
9-8-2026



## జెండా పండగకు
# పోస్టర్ల సందడి


బాలీవుడ్ తారలు రణ్‌బీర్ కపూర్, అలియా భట్, విక్కీ కౌశల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'లవ్ అండ్ వార్'. ప్రముఖ దర్శకనిర్మాత సంజయ్ లీలా భన్సాలీ దీనికి దర్శకత్వం వహిస్తున్నారు. రొమాంటిక్ డ్రామాగా తీర్చిదిద్దుతున్న ఈ సినిమా ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోన్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ చిత్రం గురించి ఓ ఆసక్తికర విషయం నెట్టింట్లో చక్కర్లు కొడుతోంది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 15న ఈ సినిమా నుంచి క్యారెక్టర్ పోస్టర్లను విడుదల చేయనున్నట్లు సమాచారం. ముక్కోణపు ప్రేమకథ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమా చిత్రీకరణ ఈ నెల ఆఖరి నాటికి పూర్తి కానుందని, వచ్చే ఏడాది జనవరి 22న దీన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు బాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# 1బిలియన్ కలెక్షన్ల క్లబ్‌లో ది ఒడిస్సీ

హాలీవుడ్ ప్రముఖ దర్శకుడు క్రిస్టోఫర్



నోలన్ తెరకెక్కించిన తాజా విజువల్ వండర్ 'ది ఒడిస్సీ' బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టిస్తోంది. థియేటర్లలో విడుదలైన మూడు వారాల్లోనే ఈ ఫాంటసీ యాక్షన్ డ్రామా ప్రపంచవ్యాప్తంగా 1 బిలియన్ కలెక్షన్ల క్లబ్‌లో (దాదాపు రూ. 9,500 కోట్లకు పైగా) అడుగుపెట్టింది
క్రిస్టోఫర్ నోలన్ కెరీర్‌లో 1 బిలియన్ మార్కును అందుకున్న మూడో చిత్రంగా 'ది ఒడిస్సీ' నిలిచింది. అంతకుముందు ఆయన దర్శకత్వం వహించిన 'ది డార్క్ నైట్' (1.008 బిలియన్), 'ది డార్క్ నైట్ రైజెస్' (1.08 బిలియన్) ఈ ఘనత సాధించాయి. గతేడాది వచ్చిన 'ఓపెన్‌హైమర్' ఈ మార్కుకు కాస్త దూరంలో ఆగిపోయింది. కాగా, ఈ వీకెండ్ ముగిసేసరికి 'ది ఒడిస్సీ' నోలన్ కెరీర్‌లోనే అత్యధిక కలెక్షన్లు సాధించిన చిత్రంగా నిలవడం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు. ఒక్క ఐమాక్స్ స్క్రీన్ల నుంచే ఏకంగా 257 మిలియన్ డాలర్ల వసూళ్లు (దాదాపు రూ. 2,445 కోట్లు) రావడం విశేషం. త్వరలోనే ఐమాక్స్ చరిత్రలోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగానూ ఇది నిలవనుంది. ప్రపంచంలోనే రెండో అతి పెద్ద మార్కెట్ అయిన చైనాలో ఈ సినిమా విడుదల కావాల్సి ఉంది. చైనా వ్యాప్తంగా దాదాపు 800 ఐమాక్స్ స్క్రీన్లతో పాటు వేలాది సాధారణ స్క్రీన్లలో అత్యంత భారీ స్థాయిలో విడుదల చేయడానికి మేకర్స్ ఎ÷–లాన్ చేస్తున్నారు. దీంతో ఈ సినిమా మరిన్ని రికార్డులను తిరగరాయడం ఖాయంగా కనిపిస్తోంది.




## 12న ఇరుముడి ట్రైలర్
# విడుదలకు సన్నాహాలు

మాస్ మహారాజా రవితేజ కథానాయకుడిగా తెరకెక్కుతున్న తాజా చిత్రం 'ఇరుముడి' ట్రైలర్‌ను ఆగస్టు 12న విడుదల చేయనున్నారు. భీమవరంలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఈ ట్రైలర్ లాంచ్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. 'నిన్ను కోరి', 'టక్ జగదీష్' వంటి చిత్రాలతో తనదైన గుర్తింపు తెచ్చుకున్న శివ నిర్వాణ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంపై ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి నెలకొంది. ఇప్పటివరకు సినిమాకు సంబంధించి విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్, ఇతర ప్రచార చిత్రాలు ప్రేక్షకుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్‌ను అందుకున్నాయి. ముఖ్యంగా కుటుంబ కథాంశానికి భక్తి అంశాలను జోడించి సినిమాను రూపొందిస్తున్నట్లు తెలుస్తుండటంతో 'ఇరుముడి'పై అంచనాలు మరింత పెరిగాయి. ట్రైలర్ విడుదల కార్యక్రమానికి చిత్ర బృందంతో పాటు అభిమానులు, సినీ ప్రేక్షకులు భారీగా హాజరయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే 'ఇరుముడి' నుంచి వచ్చిన ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై పాజిటివ్ వైబ్స్‌ను తీసుకొచ్చింది. దీంతో ట్రైలర్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. కుటుంబ భావోద్వేగాలు, భక్తి అంశాలతో పాటు రవితేజకు సంబంధించిన మాస్ ఎలివేషన్స్‌ను ట్రైలర్‌లో ఎలా చూపించారనేది ఆసక్తికరంగా మారింది. ట్రైలర్ కూడా ప్రేక్షకులను మెప్పిస్తే సినిమా విడుదలకు ముందే హైప్ మరింత పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా రవితేజను శివ నిర్వాణ ఏ తరహా పాత్రలో చూపించారనే విషయం ట్రైలర్ ద్వారా స్పష్టత వచ్చే అవకాశం ఉందని అభిమానులు భావిస్తున్నారు. ఈ సినిమాలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటిస్తున్నారు. రవితేజ కుమార్తె పాత్రలో బేబీ నక్షత్ర కనిపించనుంది. కుటుంబ బంధాలు, భావోద్వేగాలకు ప్రాధాన్యత ఉన్న కథలో ఈ తండ్రీకూతుళ్ల బంధం కీలకంగా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. మాస్ మహారాజా ఇమేజ్‌కు భిన్నంగా కుటుంబ భావోద్వేగాలను, భక్తి అంశాలను కలగలిపి శివ నిర్వాణ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. దీంతో 'ఇరుముడి' రవితేజ కెరీర్‌లో మరో విభిన్నమైన సినిమాగా నిలుస్తుందా అన్న ఆసక్తి నెలకొంది. కాగా 'ఇరుముడి' ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

Printed,published & Owned by P. Sunitha Reddy on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Dussa Shivaprasad, PRGI.NO. TGTEL/26/A4370. Cell 8179799090